# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**

**LEGISLATIVE COUNCIL DEBATES**

## అధికార నివేదిక

## OFFICIAL REPORT

గురువారం, మార్చి 23, 2017,

ఇరవై ఎనిమిదవ సమావేశం, సంపుటం–2, నంబరు–3,

దుర్ముఖినామ సం.ఫాల్గుణ బ.10

**THURSDAY, THE 23TH DAY OF MARCH, 2017,**

**TWENTY EIGHTH SESSION, VOLUME - 2, NO.3**

**2ND,CHAITRA 1938 S.E.**

* * * * *

శాసన పరిషత్తు సచివాలయము,

వెలగపూడి,

అమరావతి – 522503.

**LEGISLATURE SECRETARIAT,**

**VELAGAPUDI,**

**AMARAVATHI - 522503.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | ః | డా. ఎ. చక్రపాణి |
| **డెప్యూటీ ఛైర్మన్** | ః | శ్రీ వెంకట సతీష్ కుమార్ రెడ్డి సింగారెడ్డి |
| **ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక** | ః | శ్రీమతి పమిడి శమంతకమణి<br>శ్రీ వాకాటి నారాయణ రెడ్డి<br>శ్రీ బొడ్డు నాగేశ్వర రావు<br>శ్రీ మెట్టు గోవిందరెడ్డి |
| **కార్యదర్శి (ఇన్‌ఛార్జ్)** | ః | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ఉప కార్యదర్శులు** | ః | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎమ్. విజయరాజు |
| **సహాయ కార్యదర్శులు** | ః | శ్రీ పి.వి. సుబ్బారెడ్డి<br>శ్రీ కె. రాజ్‌కుమార్<br>శ్రీమతి ఆర్. వనితారాణి<br>శ్రీ పి. నరసింహ<br>శ్రీ బి. కమలాకర్<br>డా. వై. కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె. వెంకటేశ్వరరావు<br>శ్రీ డి. జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి. ప్రభాకర్‌రావు |
| **చీఫ్ రిపోర్టర్** | ః | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు

## గురువారం, మార్చి 23, 2017.

# అధికార నివేదిక

---

## విషయ సూచిక

---

**(1)** ప్రశ్నోత్తరాలు

**(2)** ప్రత్యేక ప్రస్తావన

**(3)** సభా సమక్షంలో ఉంచబడిన పత్రం:

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పి. నారాయణ, 2014-15 సంవత్సరానికి, విశాఖపట్టణం పట్టణాభివృద్ధి సంస్థ ఆడిట్ నివేదిక, వార్షిక లెక్కల ప్రతిని, 2016, ఆంధ్రప్రదేశ్ మహానగర ప్రాంత, పట్టణాభివృద్ధి సంస్థల చట్టంలోని సెక్షను 108, ఉప సెక్షను (5) క్రింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ.

**(4)** కమిటీ నివేదికలు సభా సమక్షంలో ఉంచబడినవి

**(5)** రాష్ట్రంలో కరవు పరిస్థితిపై లఘు చర్చ

# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL

# THURSDAY, THE 23RD MARCH, 2017

(THE HOUSE ASSEMBLED AT 10.00 A.M.)

(THE HON'BLE CHAIRMAN IN THE CHAIR)

* * *

MR. CHAIRMAN: Question Hour. 1st Question, Dr. Murthy garu...

## 1. ప్రశ్నోత్తరాలు:

### అన్న క్యాంటీన్లు

ప్రశ్న నెం.9476(81)

డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన పౌర సరఫరాల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలో 100 అన్న క్యాంటీన్లను ప్రారంభించే ప్రతిపాదన ఏదైనా ఉందా?

ఆ) అయితే, ఆ వివరాలేమిటి?

గౌరవనీయులైన ధరల అజమాయిషీ, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రిణి (శ్రీమతి పరిటాల సునీత):

అ) 14 మున్సిపల్ కార్పోరేషన్లు మరియు మున్సిపల్ ప్రాంతాలలో మొదటి దశలో 65 క్యాంటీన్లను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

ఆ) మొదటి దశలో విశాఖపట్నం (20), విజయవాడ (10), శ్రీకాకుళం(3), నెల్లిమర్ల(1), రాజాం(1), కాకినాడ(4), గుంటూరు(8), ఒంగోలు(3), కందుకూరు(1), తిరుపతి(5), రాజాంపేట(1), కర్నూలు(4), అనంతపూర్(3), హిందూపూరు(1) పట్టణాలలోని 14 మున్సిపలు కార్పోరేషన్లను/మున్సిపలు ప్రాంతాలలోని వివిధ ప్రాంతాలలో 65 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడమయింది.

డా.ఎం.వి.వి.ఎస్ మూర్తిః అధ్యక్షా, తమిళనాడులో అమ్మ క్యాంటిన్లను నడుపుతూ చక్కటి భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. వెనుకబడిన వారు, తిండిలేని వారు గౌరవ ప్రదంగా ఉంటారు. ఎక్కడా యాచించలేరు. యాచించకుండా భోజనం కొనుక్కొని తిందామని అనుకునే వారికి తక్కువ రేటుతో భోజనం దొరికితే వారు బ్రతకగలుగుతారు. లేకపోతే యాచకులుగా మారడమన్నది ప్రతివాడు చేయలేని పని. అటువంటప్పుడు ఉదయాన్నే రూపాయికి ఇడ్లీ, మధ్యాహ్నం భోజనం కావాలంటే 3 రూపాయలకు పెరుగన్నం, 5 రూపాయలకు పప్పన్నం దొరుకుతున్నాయి. జేబులో 10 రూపాయలు ఉంటే, కూలీ పని చేసుకొనే వారు, బండి నడుపుకునే వారు మధ్యాహ్నం పూట అక్కడికి వచ్చి తింటుంటారు. ఇదే పద్ధతి 2014వ సంవత్సరంలో హైదరాబాదులో జిహెచ్ఎంసి వారు మొదలుపెట్టారు. హైటెక్ సిటి నుండి వెళుతూ ఉంటే మధ్యాహ్న సమయంలో చూస్తుంటాను. 12 గంటల సమయంలో భోజనం ప్యాకెట్స్ తీసుకొచ్చి

పెడుతుంటారు. క్యూ లో నిలబడి 5 రూపాయలు ఇచ్చి ఆ భోజన ప్యాకెట్‌ని కొనుక్కొని తింటుంటారు. చాలా పెద్ద లైన్ ఉంటుంది. ఆ లైన్‌లో దాదాపుగా 300 మందికి పైగా ఉంటారు. హైదరాబాదులో అంటువంటి క్యాంటిన్లు 50 ఉన్నాయి. తమిళనాడులో ఇంకా చాలా ఎక్కువ ఉన్నాయి. ఈ స్కీమ్‌ని మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు 2014వ సంవత్సరంలోనే మొదలుపెట్టారు. కాని, ఎందుకో అన్‌ఫార్చునేట్‌గా అధికారుల తాత్సారమో తెలియదు లేకపోతే గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ తాత్సారమో తెలియదు. దీని మీద మాత్రం నిర్ణయం తీసుకోవడం లేదు. ఎందుకంటే మనం కడుపునిండిన వాళ్లము. మనకు భోజనం కూడా అక్కర్లేదు. కానీ, రోడ్ల మీద ఉన్నవారికి ఇదొక సమస్య. అది జీవన పోరాటం. అటువంటి పోరాటం ఉన్న వారిని మనం గుర్తుపెట్టుకుంటే ఒక పూట తినలేకపోతుంటే, మధ్యాహ్నంపూట అరగంట పాటు ఆలస్యం అయితే వెళ్లి భోజనం చేసి వస్తున్నాము. Under these circumstances, are we thinking about the underprivileged class of people? వారి గురించి మనం పట్టించుకున్నప్పుడు ఇది తాత్సారం చేయకుండా చూడాలి. గౌరవ మంత్రివర్యులు సునీత గారంటే నాకు చాలా గౌరవం. ఎందుకంటే పేదవారి కోసం ఎప్పుడూ కష్టపడి పనిచేసే వ్యక్తిత్వం గల మంత్రి వారు. హైదరాబాదులో అన్నపూర్ణ క్యాంటిన్లు అని పేరు పెట్టారు. తమిళనాడులో అమ్మ క్యాంటిన్లు ఉన్నాయి. మనం కూడా అన్నా క్యాంటిన్లు అనే పేరు పెట్టుకున్నాం మొట్టమొదటి ఫేజ్‌లో ఇప్పుడు చెప్పిన 65 క్యాంటిన్లకు డేట్ ఫిక్స్ చేసుకొని, ముందు 100 అని చెప్పారు, తరువాత 65కి కుదించారు. నెల క్రితం రిపోర్ట్‌లో 100 అని ఉంది. ఎంతపెద్ద ఖర్చు అవుతుంది. It is a part of social welfare. ఇటువంటి పేద ప్రజలకి తిండి పెట్టడం ఖర్చు అనుకోకుండా, 100 క్యాంటిన్లను ఏర్పాటు చేయవచ్చు. వీలైనంత త్వరలో ఒక ఫిక్స్‌డ్ డేట్ చెబితే ప్రజలకి చాలా ఉపకారం జరుగుతుందని తమ ద్వారా మనవి చేస్తున్నాను.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు: అధ్యక్షా, అన్నా క్యాంటిన్లు పేదవారి కోసం ఎస్టాబ్లిష్ చేయాలి. భోజనం పెట్టె సౌకర్యం ఏర్పాటు చేయాలని టీమ్ ఆఫ్ మినిస్టర్స్ 2014వ సంవత్సరంలో ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే తమిళనాడు వెళ్లి స్టడీ చేసి వచ్చారు. వాటికి సంబంధించిన రిపోర్ట్స్ ఉన్నాయి. తమిళనాడు వెళ్లి వచ్చిన వారు రిపోర్ట్స్‌ని తప్పకుండా సబ్‌మిట్ చేసి ఉండాలి. సబ్‌మిట్ చేసిన తరువాత నిర్ణయం తీసుకోవడానికి మూడు సంవత్సరాలు పట్టింది. మూర్తి గారు చెప్పినట్లు హైదరాబాదులో ఎస్టాబ్లిష్‌మెంట్ వచ్చింది. ఈ క్యాంటిన్లను రన్ చేస్తున్న వాటిలో philanthropic attitude ఉన్నటువంటి సంస్థలను కూడా వాటిలో జోడించారు. వారు కూడా వాటికి కాంట్రిబ్యూట్ చేస్తున్నారు. భారీగా జరుగుతున్నాయి. మనకు మూడు సంవత్సరాలు జాప్యం అయిపోయింది. ఎందుకు జాప్యం కావడం జరిగింది, దాదాపుగా 100 క్యాంటిన్లను పెడతామని నిర్ణయం తీసుకొని 65 క్యాంటిన్లకు ఎందుకు కుదించడం జరిగింది? ఉదాహరణకి కొత్తగా ఏర్పడిన రాజధానికి సంబంధించిన ప్రాంతంలో మధ్యాహ్నం సమయంలో సచివాలయానికి చాలా మంది వస్తున్నారు. భోజనం కొనడానికి స్తోమత ఉన్నా దొరకడం లేదు. ఇటువంటి చోట అన్న క్యాంటిన్లను ఆదర్శంగా తీసుకొని పెడితే బాగుంటుంది. అన్న క్యాంటిను అనేది చాలా మంచి కాన్సెప్ట్. దాని మీద శ్రద్ధ పెట్టి ఎందుకు తయారు చేయడం లేదో ప్రభుత్వం ఆలోచించవలసినదిగా కోరుతున్నాను.

శ్రీ రాము సూర్యారావు (ఉపాధ్యాయ నియోజకవర్గం – తూర్పు, పశ్చిమ గోదావరి): అధ్యక్షా, గవర్నమెంట్ హాస్పిటల్స్‌లో ప్రైవేట్ కాంట్రాక్టర్లు పేద రోగులను దోచుకుంటున్నారు. డా. యం.వి.వి.ఎస్. మూర్తి గారు, శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గారు చెప్పినట్లు హాస్పిటల్స్‌లో కూడా అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేస్తే పేద రోగులకు సౌకర్యంగా ఉంటుందని దయచేసి మీ ద్వారా మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్ (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, అన్నా క్యాంటీన్ ప్రతిపాదన అమలులోకి వచ్చి, సచివాలయ ప్రాంతంలో అన్నా క్యాంటీన్ ఒకటి పెట్టారు. చాలా సంతోషం. క్వాంటిటి, క్వాలిటీ కూడా బాగుంటుందని చెబుతున్నారు. కానీ, ఎంతమంది వెళుతున్నారో వారికి టైంబౌండ్‌లో పెడుతున్నారు. అది కొద్ది మందికే అందుతుంది. జనాలు విజిటర్స్, మా లాంటి ప్రజాప్రతినిధుల డ్రైవర్లు వస్తుంటారు. వారు వచ్చేసరికి భోజనం అయిపోతుందనే కంప్లైంట్ ఉంది. సచివాలయంలో ఎంతమంది ఉన్నారో ఆ డిమాండ్‌కి తగ్గట్టుగా భోజనాలు సరఫరా చేసే ఆలోచన చేయాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ ఆదిరెడ్డి అప్పారావు (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, అన్నా క్యాంటీన్లను 14 మున్సిపల్ కార్పోరేషన్‌లో, మున్సిపాలిటీలలో 65 అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తారని చెప్పారు. చాలా సంతోషం. ప్రతిష్టాత్మకమైనటువంటి రాజ మహేంద్రవరం మున్సిపల్ కార్పోరేషన్‌లలో కూడా ప్రారంభిస్తే బాగుంటుందని మీ ద్వారా మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఉ.10.10

శ్రీమతి పరిటాల సునీత: అధ్యక్షా, ఎన్.టి.ఆర్ అంటేనే పేదలకు సంబంధించిన వ్యక్తి. అందువలన ఆయన పేరు మీద ఎన్.టి.ఆర్ క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలనేది, మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి కోరిక. వారి ఆదేశాల మేరకు, మేము మా సబ్ కమిటీ సభ్యులు, అధికారులు అందరూ కలసి చెన్నైకు వెళ్లి అక్కడ రెవ్యూ నిర్వహించాము. మన రాష్ట్రంలో కూడా ఏ విధంగా క్యాంటీన్‌ను నిర్వహిస్తే బావుంటుందనేది ఆలోచించి ఇక్కడ కూడా మన సి.ఆర్.డి.ఏ పరిధిలో రెండు అన్నా క్యాంటీన్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. అన్నా క్యాంటీన్‌లకు మంచి స్పందన లభించింది. ఎవరైతే ఆకలితో ఉన్నారో వారికి కడుపు నిండా అన్నం పెట్టే నాయకుడే కీర్తిశేషులు శ్రీ నందమూరి తారకరామారావు గారు. అందువలన వారి పేరుతో ఇక్కడ సి.ఆర్.డి.ఏ. పరిధిలో రెండు క్యాంటీన్‌లను పెట్టడం జరిగింది. ఈ క్యాంటీన్‌లో ఆహారం చాలా రుచిగా ఉందని ప్రజల ద్వారా తెలుసుకున్నాము. మా అధికారులు, సబ్‌కమిటీ సభ్యులతో వెళ్లి మేమంతా పరిశీలించాము. అన్నీ చాలా రుచిగా ఉన్నాయని గుర్తించాము. చెన్నైకు మనకు చాలా తేడా ఉందని గమనించాము. అక్కడ గ్యాస్ స్టవ్ మీద అన్నం వండుతున్నారు. మరియు అక్కడ వంట వారు మారడం వలన రుచిలో తేడా వస్తుంది. ఇక్కడ మన అమరావతిలో చాలా రుచిగా వంట చేస్తున్నారు. రుచిలో తేడా లేకుండా ఆహారాన్ని అందిస్తున్నాము. అక్షయపాత్ర వారికి కూడా ఇచ్చాము. వారు ఒక పథకం ప్రకారం చేస్తున్నారు కాబట్టి, ఎక్కడా భోజనంలో ఇబ్బంది లేకుండా టిఫిన్లు గాని, సాంబారు అన్నంగాని, పెరుగన్నంగాని, పులిహోర గాని చాలా రుచిగా అందిస్తున్నారు కాబట్టి అక్షయపాత్రకు ఇవ్వాలని నిర్ణయించడం జరిగింది.

మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఈ బడ్జెట్‌లో దాదాపు రూ.200కోట్ల బడ్జెట్‌ను కేటాయించడం జరిగింది. ఈ అన్న క్యాంటీన్‌ను పెట్టకముందు 63 క్యాంటీన్లు అని అన్నాము. ఇప్పుడు ఈ 63 క్యాంటీన్లు మాత్రమే కాకుండా ఎన్ని క్యాంటీన్లు కావాలంటే అన్నీ పెట్టడానికి మన దగ్గర బడ్జెట్ కూడా ఉంది. ఎక్కడ అవసరమైతే అక్కడ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తాము. ఎక్కడైనా కూలీలు ఉదయమే 6 గంటలకే పని చేయడానికి వెళతారు. అలాంటి వారు, ఖాళీ కడుపుతో పని చేయడానికి వెళ్లకుండా టిఫిన్లు గాని, భోజనం గాని చేసి పనులకు వెళ్లాలనే ఆలోచనతో ఇప్పుడు అన్నా క్యాంటీన్లను పెట్టాము. పెద్దలు గౌరవనీయులైన సభ్యులు శ్రీ రాము సూర్యారావు గారు కూడా

ఆసుపత్రులలో కూడా ఈ రకమైన క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే బావుంటుందన్నారు. దానిని కూడా మేము పరిశీలిస్తామని తెలియజేసున్నాను.

అధ్యక్షా, ఆసుపత్రులు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్ల దగ్గర కూలీలు ఎక్కువగా ఉంటారు. కాబట్టి, ఎన్.టి.ఆర్ క్యాంటిన్‌లను అక్కడ కూడా ఏర్పాటు చేసే విషయం సబ్‌కమిటీ పరిశీలనలో ఉంది. కమిటీలో గౌరవ మంత్రులు శ్రీ పి.నారాయణ గారు, శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు గారు ఉన్నారు. మేమంతా సమావేశమై ఎన్ని క్యాంటిన్లు ఏర్పాటు చేయాలి. ఎంత మందికి ఆహారాన్ని అందించాలనే ఆలోచనలో ఉన్నాము. మన రాష్ట్రంలో, ఈ క్యాంటీన్లలో పప్పు అన్నం, సాంబారు అన్నంతో పాటు ఇంకా ఏదైనా మార్చాలనే ఆలోచనలో ఉన్నాం. అలాగే, అనంతపురంలో రాగిసంగటి కూడా పెట్టాలనే ఆలోచన ఉంది. గౌరవ సభ్యులు, పెద్దలు అడిగిన ఈ విషయానికి సంబంధించి సబ్‌కమిటీ సమావేశమై ఎప్పటిలోగా మనం అన్నా క్యాంటీన్లను ఏర్పాట్లు చేయాలనేది త్వరలోనే, దాదాపుగా మూడు నెలలలోగా అన్నా క్యాంటీన్లను ఎక్కడ అవసరమైతే అక్కడ ఏర్పాటు చేస్తామని సభా ముఖంగా తెలియజేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్: సభ్యుల యొక్క అభిప్రాయాలను మీ సబ్‌కమిటీకి తెలియజేయండి. అలానే, శ్రీ వెంకటేశ్వర్లుగారు అడిగినట్లు, సచివాలయానికి జిల్లాల నుండి వేరే ప్రాంతాల నుండి చాలా మంది వస్తారు. కాబట్టి, ఈ వెలగపూడి ప్రాంతంలో, సచివాలయ ప్రాంగణంలో అన్నా క్యాంటిన్‌ను ఏర్పాటు చేస్తే బావుంటుందన్నారు. దానిని కూడా ఆలోచించండి.

డా.ఎం.వి.వి.ఎస్.మూర్తి: అధ్యక్షా, జూన్ మాసం లోగా మొదలు పెట్టే ఏర్పాట్లు చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది.

MR. CHAIRMAN: Next question [Q.No.9496(82)] postponed at the request of the Member. Third question..

## అక్రమ రంగురాళ్ల త్రవ్వకం

ప్రశ్న నెం.9575(83)

శ్రీ పి.జె. చంద్రశేఖర రావు, శ్రీమతి టి.రత్నాబాయి, ఎం.ఎల్.సి.లు.,

గౌరవనీయులైన మహిళాభ్యుదయం మరియు శిశు సంక్షేమం, గనులు మరియు భూగర్భ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) విశాఖపట్నం జిల్లాలోని జి.మాడుగుల, పాడేరు, చింతపల్లి మరియు జి.కె..వీధి మండలాలలో రంగురాళ్ల అక్రమ త్రవ్వకాలు జరుగుతున్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, అక్రమ త్రవ్వకాన్ని నియంత్రించడానికి తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన మహిళాభ్యుదయం, శిశు సంక్షేమం, గనులు మరియు భూగర్భ శాఖమంత్రిణి (శ్రీమతి పీతల సుజాత):

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీమతి టి.రత్నాబాయి (నామినేటెడ్): అధ్యక్షా, ఈ మధ్య కాలంలో గిరిజన ప్రాంతాలలో రంగు రాళ్ల త్రవ్వకం యథేచ్ఛగా సాగుతుంది. చాలా మంది గిరిజనులు సజీవ సమాధి అయిపోతున్నారు. కాబట్టి,

గిరిజనులకు సహకార సంఘాలను ఏర్పాటు చేసి, ఆ సొసైటీల ద్వారా అక్కడ ఉన్న గిరిజనులకు ఏమైనా సహాయం చేయడానికి అవకాశం ఉందా అని మీ ద్వారా నేను మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీమతి పీతల సుజాతః అధ్యక్షా, గతంలో TRICOR అని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల ఆర్థిక సహకార కార్పోరేషన్ ఒకటి ఉండేది. దానికి అప్పట్లో కొన్ని లీజులు మంజూరు చేయడం జరిగింది. కానీ, వారు ఎక్కడా పని మొదలు పెట్టలేదు. మనకు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుండి 2015వ సంవత్సరం జూన్ నెల 12 వ తేదిన అమెండ్‌మెంట్ రూల్స్ రావడం జరిగింది. ఈ రంగు రాళ్లు ఏవైతే ఉన్నాయో వానిని మేజర్ మినరల్‌గా చేయడం జరిగింది. గవర్నమెంటు ఆఫ్ ఇండియా ఇచ్చిన రూల్స్ ప్రకారం మేజర్ మినరల్స్‌కు వేలంపాటను నిర్వహించవలసిన అవసరం ఉంది. దాని రీత్యా మనం కొత్త లీజులు ఏమీ ఇవ్వడం జరగలేదు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ఈ రంగు రాళ్ల గురించి డిపార్టుమెంటుకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని మీ ద్వారా గౌరవ సభ్యురాలికి తెలియజేస్తున్నాను.

శ్రీమతి టి.రత్నాబాయిః ఈ మధ్య కాలంలో రంగురాళ్ల త్రవ్వకం చాలా ఎక్కువగా జరుగుతోంది. దీనిని మీరు కంట్రోల్ చేయడానికి ఏమైనా చర్యలు తీసుకోండి.

శ్రీమతి పీతల సుజాతః అధ్యక్షా, ఎక్కడైనా అక్రమంగా రంగురాళ్లను త్రవ్వుతున్నట్లు, మాకు సమాచారం లభిస్తే, తప్పకుండా మేము అక్కడ చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## నర్సాపురం-సఖినేటిపల్లి రైల్వే వంతెన నిర్మాణం

ప్రశ్న నెం.9647(84)

శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన రవాణా, రహదారులు మరియు భవనాల శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) తూర్పు గోదావరి జిల్లా, అంతర్వేది వద్ద ఏర్పాటు చేయనున్న డ్రెడ్జింగ్ హార్బర్ ప్రాజెక్టులో భాగంగా నరసాపూర్-సఖినేటిపల్లి రైల్వే వంతెన నిర్మాతం కోసం ఏదైనా పథకాన్ని రూపొందించడమయిందా?

ఆ) అయితే, సదరు రైల్వే వంతెనను రైల్-కం-రోడ్ వంతెనగా మార్చే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా?

గౌరవనీయులైన రవాణా, రహదారులు మరియు భవనాల శాఖ మంత్రి (శ్రీ సిద్ధా రాఘవరావు):

అ) లేదండీ, డ్రెడ్జింగ్ హార్బర్ ప్రాజెక్టులో భాగంగా రైల్వే వంతెన నిర్మాణానికి సంబంధించి ఎలాంటి ప్రతిపాదన లేదు.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్: అధ్యక్షా, ఏదైతే నరసాపూర్ – సఖినేటిపల్లి రైల్వే వంతెన అనేది గురించి గత అర్థ శతాబ్దంగా ప్రజలు కోరుకుంటున్న వంతెన. అది నెరవేర్చాలని ముఖ్యమంత్రి గారు కృత నిశ్చయంతో ఉన్నారు. అందులో భాగంగా అంతర్వేది దగ్గర, డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలనే నిర్ణయంతో ఇది సాఫల్యం అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని అక్కడి ప్రజల అభిప్రాయం. రూ.1800 కోట్లతో డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను అక్కడ ఏర్పాటు చేస్తున్నారు. వారి అవసరాల నిమిత్తం రైల్వే కనెక్షన్లు కావాలి. ఆ రైల్వే కనెక్షన్లతో పాటు రైల్ కమ్ రోడ్ వంతెనను నిర్మిస్తే బావుంటుందని శాసన సభ్యుల ప్రతిపాదన మీద గౌరవ ముఖ్యమంత్రిగారు డ్రెడ్జింగ్ కార్పొరేషన్ వారికి

విన్నవించుకున్నారు. ఆ విధంగా మన గౌరవ ముఖ్యమంత్రి గారి కోరిక మేరకు డ్రెడ్జింగ్ కార్పోరేషన్ వారికి కూడా సూత్ర ప్రాయంగా వంతెన నిర్మాణం జరిగినప్పుడు రోడ్డు వంతెనగా కూడా మార్చడానికి ఆలోచిస్తామని రైల్వే మంత్రి గారు అంగీకరించడంతో, ఎంతో ఉత్సాహంతో నరసాపురం, సఖినేటిపల్లి ప్రజలు పండుగ చేసుకున్న సందర్భాన్ని కూడా మీ దృష్టికి తీసుకొస్తున్నాను.

అధ్యక్షా, ముఖ్యంగా రెండు ప్రశ్నలు గౌరవ మంత్రిగారిని అడగదలచుకున్నాను. కత్తిపూడి, ఒంగోలు మీదుగా జాతీయ రహదారికి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన 216 జాతీయ రహదారికి చించినాడ వంతెనను నిర్మించారు. అది నిర్మించి కూడా దాదాపుగా 20 సంవత్సరాలు అయ్యింది. దాని వెడల్పు తక్కువగా ఉంది. కాబట్టి, భవిష్యత్తులో ఆ వంతెనకు ప్రత్యామ్నాయంగా వేరే వంతెనను నిర్మించే ఆలోచన ఏదైనా ఈ ప్రభుత్వం చేస్తుందా? ఆదే రకంగా 1983లో స్వర్గీయ ఎన్.టి.రామారావు గారు ఆనాడు ముఖ్యమంత్రిగా ప్రజల కోరిక మేరకు నరసాపూర్ – సఖినేటిపల్లి రైల్వే వంతెన నిర్మాణానికి ఆయన స్వహస్తాలతో శంకుస్థాపన చేశారు. ఆనాడు ప్రజల ఆకాంక్ష మేరకు శంకుస్థాపన చేసిన నరసాపూర్ – సఖినేటిపల్లి రైల్వే వంతెనను, ఈనాటి తెలుగుదేశం ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ఆ వంతెన నిర్మాణం కోసం ఏమైనా చొరవ చూపే ఆలోచన చేస్తుందా? ఈ రెండు సమాధానాలు తెలియజేయాల్సిందిగా మంత్రి గారిని కోరుతున్నాను.

ఉ. 10.20

శ్రీ సిద్దా రాఘవరావు : అధ్యక్షా, రూ.1800 కోట్లతో నర్సాపూర్-సఖినేటిపల్లి ఏరియాలో డ్రెడ్జింగ్ హార్బర్ ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనౌన్స్ చేయడం జరిగింది. అయితే, దీనికి సంబంధించి ప్రస్తుతం మా వద్ద సమాచారం లేదు. అయినప్పటికీ, తప్పకుండా రైల్వే డిపార్టుమెంటుతో కోఆర్డినేట్ చేసుకుని, డ్రెడ్జింగ్ కార్పోరేషన్ వాళ్లతో మాట్లాడి ఇన్ఫర్మేషన్ తెప్పించి మీకు పంపించడం జరుగుతుంది.

అదేవిధంగా చించినాడ వంతెన డ్యామేజయ్యిందని మీరు అడగటం జరిగింది. ఇది ఎంక్వైరీ చేసి, ప్రపోజల్ ఏదన్నా ఉంటే సరే, లేదంటే ఆ బ్రిడ్జిని తప్పకుండా నిర్మాణం చేయడానికి కూడా వెనకాడే సమస్య లేదు. బ్రిడ్జిని నిర్మిస్తాము.

అలాగే, కత్తిపూడి-ఒంగోలు రహదారిని (ఎన్‌హెచ్-216) ఎన్‌హెచ్-5కి అనుసంధానించాలని అడిగారు. ఈ విషయంలో కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అట్లాగే, స్వర్గీయ ఎన్టీ రామారావు గారు నర్సాపురం నుండి సఖినేటిపల్లి దగ్గర బ్రిడ్జికి శంకుస్థాపన చేశారని సభ్యులు చెప్పడం జరిగింది. తప్పకుండా, ఆ బ్రిడ్జికి సంబంధించిన సమాచారాన్ని తెప్పించుకుని, అది కూడా పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని తెలియజేస్తున్నాను.

శ్రీ గౌనివారి శ్రీనివాసులు (నామినేటెడ్): అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు ఈ రైల్వే క్రాసింగ్స్ ఉన్నచోట బ్రిడ్జెస్ ఏర్పాటు చేసే విషయాన్ని గురించి చక్కగా చెప్పారు. ఇక్కడ ఒక విషయాన్ని మీ ద్వారా మంత్రి గారి దృష్టికి తీసుకువెళుతున్నాను. చిత్తూరు, కడప రూటు నేషనల్ హైవే. ఆ రోడ్డులో మూడు రైల్వే లైన్ క్రాసింగ్స్ ఉన్నాయి. గౌరవ మంత్రివర్యులు సెంట్రల్ గవర్నమెంట్‌తో మాట్లాడి, ఆ బ్రిడ్జి నిర్మాణాలు మొదలుపెడతామని ఈ మధ్య అక్కడ ఒక ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు తెలియపరిచారు. కానీ, వర్క్స్ ఇంకా టేకప్ చేయలేదు. అదేవిధంగా అత్యంత రద్దీగా ఉండే తిరుపతి పట్టణం నుండి చంద్రగిరికి వచ్చే రోడ్డులో రైల్వే క్రాసింగ్ కూడా ఉంది. అదేవిధంగా తిరుపతి నగరంలో కూడా రెండు చోట్ల అండర్‌పాసులు గానీ, లేదా ఓవర్ బ్రిడ్జిలు గానీ కట్టాల్సినటువంటి పరిస్థితి ఉంది. ఇది చాలా త్వరగా పూర్తి చేయాల్సిన పరిస్థితి ఉంది కాబట్టి, దయచేసి దీనిపైన తగు చర్యలు తీసుకుని, మంజూరైన బ్రిడ్జి పనులను త్వరగా

ప్రారంభించాలని, మంజూరు కాకుండా ఉన్న వాటిని మంజూరు చేయించడానికి సహకరించాలని మీ ద్వారా గౌరవ మంత్రి గారికి తెలియజేస్తున్నాను.

శ్రీ టి.డి.జనార్ధన్ (నామినేటెడ్)ః అధ్యక్షా, జగ్గయ్యపేట నుండి ఖమ్మం వెళ్లే రోడ్డు ఉంది. ఆ రోడ్డులో మధ్యలో రెండు అవరోధాలున్నాయి. మొదట మక్కపేట దగ్గర శిథిలావస్థలో ఉన్న పాత కల్వర్టు, రెండవదేమంటే లింగాల–వత్సవాయి మధ్యలో ఒక dead turning, narrow culvert ఉంది. ఈ రెండు కల్వర్టుల దగ్గర యాక్సిడెంట్లు అయ్యి కొంతమంది ప్రాణాలు కూడా పోయాయి. కావాలంటే గతేడాది గానీ, ఈ సంవత్సరంలో గానీ ఎన్ని యాక్సిడెంట్లు జరిగాయో మీరే చూడండి. కాబట్టి, తక్షణమే మరమ్మత్తులు చేయించి, ఆ కల్వర్టులు వైడెన్ చేయించాలని కోరుతున్నాను. రోడ్డంతా వైడెన్ అయ్యింది, బాగుంది. కనుక, ఈ కల్వర్టు వైడెనింగ్ పనులు కూడా వెంటనే పూర్తి చేయించాలని కోరుతున్నాను.

మిస్టర్ ఛైర్మన్ః సఖినేటిపల్లి డ్రెడ్జింగ్ హార్బర్ సందర్భంగా తిరుపతిలో రైల్వే క్రాసింగ్స్ విషయం కూడా వచ్చింది. మీ దగ్గర సమాచారం ఉంటే, please, pass on to the Members.

శ్రీ సిద్ధా రాఘవరావుః అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ చిత్తూరు–కడప ఎన్‌హెచ్‌రోడ్డులో ఆర్‌యుబిలు, ఆర్‌ఓబిల నిర్మాణం ఆలస్యమౌతోందని వారు అడగటం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా ఈ ఆర్‌యుబి, ఆర్‌ఓబిల మీద ఎస్టిమేషన్స్ తెప్పించి, రైల్వే డిపార్టుమెంటు వారితో మాట్లాడటం జరిగింది. తప్పకుండా అవన్నీ కూడా మా నోటీస్‌లో ఉన్నాయి. రైల్వే డిపార్టుమెంటుతో కోఆర్డినేట్ చేసుకుని షార్ట్ పీరియడ్‌లో టెండర్లు పిలవడానికి ఏర్పాట్లు చేస్తాము. అట్లాగే, సభ్యులు శ్రీ టి.డి.జనార్ధన్ గారు జగ్గయ్యపేట నుండి ఖమ్మం పోయే రోడ్డులో బ్లాక్‌స్పాట్స్ గానీ, narrow culverts గానీ ఉన్నాయని చెప్పారు. తప్పకుండా మా డిపార్టుమెంటు వారిని పంపించి ఎంక్వైరీ చేయించి, ఇమ్మీడియట్‌గా చర్యలు తీసుకుంటామని తెలియజేస్తున్నాను.

MR.CHAIRMAN: Question No's: 9432 (85), 9638 (86) are postponed at the request of the Members. Now, Question No.9513 (87) Sri. M.V.S.Sarma garu.. పాఠశాలలో ఖాళీలు భర్తీ చేయుట. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థల పాఠశాలలో 19,000కు పైగా ఖాళీలున్న విషయం వాస్తవమేనా? అదే కదా మీరు అడిగే ప్రశ్న.

శ్రీ ఎం.వి.ఎస్.శర్మ (పట్టభద్రుల నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం)ః అవును సార్.

మిస్టర్ ఛైర్మన్ః మినిస్టర్ ఫర్ హ్యూమన్ రిసోర్సెస్ గారు లేరు, విప్ గారు లేరు.

శ్రీ అంగర రామమోహన్ ( స్థానిక సంస్థలు – పశ్చిమ గోదావరి)ః ఇప్పటిదాకా ఉన్నారండీ.

మిస్టర్ ఛైర్మన్ః శర్మ గారూ, ఈ రోజు మనం మూడు ప్రశ్నలు పోస్ట్‌పోన్ చేశాము. Let me pass over those questions. I will take -up next question.

డా.ఎం.వి.వి.ఎస్.మూర్తిః సార్, మంత్రులు సభలో ఉండటం లేదు. ఈ సభంటే గౌరవముండాలి కదా. పోస్ట్‌పోన్‌మెంట్ అంటే ఎలా సార్?

మిస్టర్ ఛైర్మన్ః మీరు వినండి. పోస్ట్‌పోన్ చేయలేదు. పాస్ ఓవర్ చేశాను.

డా.ఎం.వి.వి.ఎస్.మూర్తిః ఓకే సార్.

MR.CHAIRMAN: It is only pass over, not passed over. ఉమ్మారెడ్డి గారూ, సాధారణంగా కోర్టుల్లో కేసు బెంచ్ మీదకు వచ్చినప్పుడు, ఆలస్యమైనప్పుడు సార్ పాస్ ఓవర్ చేయండి, మా సీనియర్

వస్తాడు అని జూనియర్ అడ్వకేట్లు చెబుతుంటారు. అలానే పాస్ ఓవర్ చేశాను. అంతలోపల విప్ గారు వెళ్లి మంత్రి గారిని పిలుచుకువస్తారు. మూడు ప్రశ్నలను ఒకేసారి పోస్ట్‌పోన్ చేయడం సరి కాదు. ఒకవేళ మంత్రులు లాబీల్లో ఉండొచ్చు. విప్ గారు వెళుతున్నారు. తరువాత ప్రశ్న సభ్యులు శ్రీ రాము సూర్యారావు గారిది. ఆ ప్రశ్న కూడా హ్యూమన్ రిసోర్సెస్ మినిస్టర్ గారికి సంబంధించినదే. So, I will take-up the Question No.9528 (89) – Funds for Backward Districts. Sri. Kolagatla Veerabhadra Swamy..

SRI.KOLAGATLA VEERABHADRA SWAMY (Assembly Constitutioncy) : Sir, I put the question.

MR.CHAIRMAN: Minister for Finance is not in the House. అగ్రికల్చర్ మినిస్టర్ గారున్నారు కాబట్టి, తరువాత ప్రశ్న తీసుకుందాము. MR. Muddu Krishnama Naidu garu, please put your question.

(ఈ సందర్భంలో సభ్యులు శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మరియు శ్రీ దేవసాని చినగోవింద రెడ్డి గార్లు తమ ప్రశ్న పోస్ట్‌పోన్ అయ్యిందా అని అడిగారు)

మిస్టర్ ఛైర్మన్ః శ్రీ చిన గోవింద రెడ్డి గారూ, మీ ప్రశ్నను పాస్ ఓవర్ చేశాను. ఈ ప్రశ్న పూర్తయ్యాక మీ ప్రశ్నను చర్చకు తీసుకుందాము. ఈలోపు విప్ గారు మంత్రి గారిని పిలుచుకుని రావడానికి వెళ్లారు. China Govinda Reddy garu, wait for some time. మానవ వనరుల శాఖామంత్రి గారు ఇప్పుడే వచ్చారు.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుః అధ్యక్షా, వారి ప్రశ్నలు తీసుకుంటారా?

MR.CHAIRMAN: No, No, you please continue.

## కూరగాయలకు మద్దతు ధర

ప్రశ్న నెం.9458 (90)
శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు, ఎం.ఎల్.సి.,
గౌరవనీయులైన వ్యవసాయ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) కూరగాయల పెంపకందారులు కనీస మద్ధతు ధరను పొందడం లేదన్న విషయం వాస్తవమేనా?
ఆ) అయితే, మార్కెట్ ప్రమేయ నిధి మంజూరుకు తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన వ్యవసాయం, అగ్రి-ప్రాసెసింగ్, మార్కెటింగ్ మరియు గిడ్డంగులు, పశుసంవర్ధన, పాడిపరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య పరిశ్రమల శాఖ మంత్రివర్యులు (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు)

అ) లేదండీ.
ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు (స్థానిక సంస్థలు – చిత్తూరు)ః సార్, కూరగాయల రేట్లు కూడా చాలా ఒడిదుడుకులతో ఉన్నాయి. ఒక్కోసారి టమోటాల ధర యాభై పైసలు కూడా ఉండటం లేదు. ఒక్కోసారి 15, 20 రూపాయలుంటోంది. దీనివల్ల చాలామంది రైతులు నష్టపోతున్నారు. టమోటాలకు గిట్టుబాటు ధర ఉండటం లేదు. ఇప్పుడు వంకాయలకు కూడా గిట్టుబాటు ధర లేకుండా లారీలకు లారీలు తీసుకువచ్చి రోడ్డు మీద పారబోస్తున్నారు. బెండకాయలకు, చాలా కూరగాయలకు రేట్లు తక్కువగా ఉంటున్నాయి. గతంలో రైతు బజార్లు పెట్టి రైతులే నేరుగా కూరగాయలు తీసుకువచ్చి అమ్ముకోవచ్చని పెట్టారు. కానీ, అది కూడా ఇప్పుడు వ్యాపారస్తులమయం అయిపోయింది. రైతు బజార్లలో రైతులే వచ్చి

అమ్ముకోవడానికి, వినియోగదారులు సరసమైన ధరలకు కొనుక్కోవడానికి అవకాశం ఉంటుంది, వాళ్లకు గిట్టుబాటు ధర వస్తుందని శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతుబజార్లు పెట్టారు. అవన్నీ కూడా సక్రమంగా పనిచేయడం లేదు. కొత్తగా ఏమన్నా రైతు బజార్లు పెడుతున్నారా? రెండవది వాటినేమన్నా రెగ్యులరైజ్ చేస్తున్నారా? రెగ్యులర్‌గా ఉండే వాళ్లని తీసేసి, రైతుల ద్వారా డెయిరీ పెట్టుకునే విధంగా చేస్తారా?

మూడవదేమంటే – 1987లో స్వర్గీయ శ్రీ ఎన్టీరామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కర్షక పరిషత్తులని పెట్టారు. అక్కడ పండే ధాన్యానికి రేటు నిర్ణయించుకుని, ఈ ధరకే అమ్మాలని మండల కర్షక పరిషత్తులు, జిల్లా కర్షక పరిషత్తులు, రాష్ట్ర కర్షక పరిషత్తుల ద్వారా మనం ఉత్పత్తి చేసే ధాన్యానికిగానీ, కూరగాయలకు గానీ, వేరు శెనగకు గానీ, చెరుకుకి గానీ ధర నిర్ణయించుకునే హక్కు మన చేతుల్లోనే ఉండాలని ఆ మహానుభావుడు పెట్టాడు.

ఉ.10.30

రైతులకు స్వేచ్ఛనిస్తూ కర్షక పరిషత్తును ఏర్పాటు చేశారు. గుండుసూది తయారు చేసి పది పైసలు అంటే అంతకే కొంటాము, బ్లేడు తయారు చేసి రెండు రూపాయలు అని చెబితే అంతకే కొంటాము. కానీ, రైతు మాత్రం ధరను నిర్ణయించుకునే స్థితిలో ఉండడం లేదు. Agricultural prices commission అని పెట్టి రకరకాలుగా చేస్తున్నారు. వినియోగదారునికి ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వవచ్చు. కానీ, రైతు కష్టపడి నష్టపోయి వినియోగదారుని కాపాడవలసినంత అవసరం లేదు. కర్షక పరిషత్తును మరల పునరుద్ధరిస్తారా? ఒకప్పుడు కర్షక పరిషత్తు ఛైర్మన్‌గా శ్రీ నారా చంద్రబాబునాయుడు గారే ఉన్నారు. ఆ తరువాత కాంగ్రెస్ వాళ్లు దానిని తీసేశారు . ప్రభుత్వం దగ్గర కర్షక పరిషత్తు యాక్టు ఉంది. ఇప్పుడు దానిని రివైవ్ చేస్తారా అని తమ ద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ( స్థానిక సంస్థలు – విశాఖపట్నం): నాకు తెలిసినంతవరకూ కర్షక పరిషత్తులో వివాదం జరిగినప్పుడు ఆ అంశాన్ని కోర్టు అబ్జర్వేషన్‌లో పెట్టారు. అందువల్ల ప్రభుత్వం దానిని పక్కకు పెట్టింది.

అధ్యక్షా, కూరగాయల విషయంలో అనేక విషయాలను మనం పరిశీలిస్తున్నాము. నిమ్మ, టమాట ఎక్కువగా పండినప్పుడు సరైన ధర లేకుండా రోడ్డు మీద పారబోస్తున్నారు. ప్రొడ్యూసర్‌ను కాపాడలేకపోతే కన్జ్యూమర్‌ను కూడా కాపాడుకోలేమండీ. ప్రొడ్యూసర్ గనక నాకు గిట్టుబాటు ధర లేదు నేను పండించలేను అని అనుకుంటే చాలా కష్టం. ఎందుకంటే ప్రొడ్యూసర్ పంట పండించకపోతే, అల్టిమేట్‌గా నష్టపోయేది మాత్రం కన్జ్యూమరే. అందువల్ల ప్రభుత్వం ప్రొడక్షన్ స్థాయిలో సబ్సిడీలను ఇవ్వాలి, కన్జ్యూమర్ స్థాయిలో కూడా సబ్సిడీ ఇవ్వాలి. కాబట్టి, ప్రభుత్వం వారి ఇంట్రస్ట్‌లను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు: అధ్యక్షా, కూరగాయల విషయమై కేంద్రం మద్దతు ధర నిర్ణయించలేదు. అయినప్పటికీ, శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి ప్రభుత్వంలో సెంట్రల్ మార్కెట్ ఫండ్ నుండి ఉల్లిపాయలకు రూ.200 లు ఇన్సెంటివ్ ఇచ్చి ఎప్పటికప్పుడు మార్కెట్ ధరలను గమనిస్తున్నాము. ఎప్పుడు ధరలు తగ్గినా వెంటనే సెంట్రల్ మార్కెటింగ్ ఫండ్ నుండి రూ.40 కోట్లు కేటాయిస్తున్నాము. ఉల్లిపాయల విషయంలో ఎవరైతే ఆరు రూపాయల కంటే తక్కువ అమ్ముకుంటున్నారో, వాళ్లకు రూ.2 లు చొప్పున ఇన్సెన్టివ్ ఇచ్చి కొనుగోలు చేయడం జరిగింది. టమాట మాత్రం సమస్యగానే ఉంటున్నది. ఎందుకంటే ఒకరోజు రూ.2 లు ఉంటే, రెండవ రోజు రూ.15 లు ఉంటున్నది. దానిని కంట్రోల్ చేయడానికి నిల్వ పద్ధతులను తీసుకువస్తున్నాము. చిత్తూరు జిల్లాలో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు ప్రతిపాదన ఉన్నది. ఈ

రోజు వరకు మార్కెట్ ధరలు స్థిరంగానే ఉన్నాయి. నిన్నటివరకూ మార్కెట్‌లో టమాట ధర రూ.17 నుండి 22లు వరకూ ఉన్నది. వంకాయలు రూ.18 నుండి రూ.21లు వరకూ ఉన్నది. బెండకాయలు రూ.28 నుండి రూ.34లు వరకూ ఉన్నది. ఆ విధంగా రూ.3 లు నుండి రూ.14 వరకూ ఉన్నది. ఎక్కడ తక్కువగా ఉన్నా ఇన్సెంటివ్ ఇప్పటి వరకూ కొనసాగుతున్నది. గౌరవ సభ్యులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు ప్రస్తావించిన అంశాలు వాస్తవం. ధరలను నియంత్రించేందుకు రాబోయే రోజులలో నిల్వ పద్ధతుల కొరకు ప్రతిపాదన ఉన్నది. ఆ విధంగా టమాట ఒక్కటే సమస్యగా ఉన్నది. రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని గౌరవ సభ్యులకు తమ ద్వారా తెలియచేస్తున్నాను.

వాస్తవంగా రాష్ట్రంలో ఈనాడు 2,28,046 హెక్టార్లలో కూరగాయలను వేస్తున్నారు. దాని ద్వారా సుమారు రూ.55.69 లక్షల టన్నులు వస్తున్నాయి. టమాట ఒక్కటే 1,42,000 ఎకరాలలో ఉన్నది. ఉల్లి కూడా గత సంవత్సరం ధర ఎక్కువగా ఉండేసరికి 1,14,000 ఎకరాల విస్తీర్ణానికి పెరిగింది. ఆనాడు రైతు బజార్లను తీసుకువచ్చిన ఉద్దేశమే – రైతు పండించిన పంటలకు ధర రావాలి, వినియోగదారులకు మార్కెట్‌లో సరసమైన ధరలకు పంటను అందించాలి. 87 రైతు బజార్లు ఇప్పుడు ఉన్నాయి. కొత్తవి 33 ఇప్పుడు ఇస్తున్నాము. అవి ప్రాసెస్‌లో ఉన్నాయి. కొన్ని శాంక్షన్ దశలో ఉన్నాయి, కొన్ని నిర్మాణంలో ఉన్నాయి, కొత్తవి ఇప్పుడు ఇస్తున్నాము, కొన్నిటికి ఎస్టిమేట్స్ సిద్ధం చేసి నిధులు మంజూరు చేసే దశలో ఉన్నాయి అధ్యక్షా. ప్రధానంగా కూరగాయలు పండించే రైతులకు హార్టీకల్చర్ నుండి మొబైల్ వెహికిల్స్‌కు రెండు లక్షలు సబ్సిడీ ఇస్తున్నాము. ఒక అసోసియేషన్‌గా 5 మంది రైతులు కలిసి పండించినటువంటి పంటలను రైతు బజార్లకు తీసుకువచ్చేదానికి రెండు లక్షల రూపాయల సబ్సిడీతో మొబైల్ వెహికిల్స్‌కు రెండు లక్షలు సబ్సిడీ ఇస్తున్నాము. మార్కెటింగ్ ఫండ్ నుండి మొబైల్ రైతుబజార్లను ఇస్తున్నాము. రైతులు ఎవరైనా ముందుకు వచ్చి జనకూడళ్లలో కూరగాయలు అమ్ముకుంటామని ముందుకు వస్తే మొబైల్ వాహనాలను మొత్తం అమౌంట్‌ను ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా మార్కెటింగ్ ఫండ్ నుండి ఇస్తున్నాము. ఆ విధంగా రైతు పండించిన పంట నేరుగా వారే అమ్ముకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాము. రైతు బజార్లు కూడా ఎవరు రిక్వెస్ట్ చేసినా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఇవ్వమని చెప్పడం జరిగింది. ఈ మొబైల్ వాహనాలను 200 లేదా 300 అయినా సరే అన్ లిమిటెడ్‌గా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నది. రైతు పండించిన కూరగాయలకు ధర రావడం కోసమే ఈ ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేస్తున్నాము.

అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడు గారు చెప్పిన కర్షక పరిషత్తు ఈరోజు వరకూ కూడా రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో లేదు. దాని గురించి ఆలోచన చేస్తామని నేను మీ ద్వారా తెలియచేస్తున్నాను.

శ్రీ గాలి ముద్దుకృష్ణమ నాయుడుః అధ్యక్షా, కందుల రేటు బాగా పడిపోయింది. మిర్చి రేటు కూడా తగ్గిపోయింది. దానికి మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్‌ను ఏమైనా పెడుతున్నారా? అంతకుముందు చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.400 కోట్లు పెట్టారు. ఇప్పుడు రూ.40 కోట్లు అని చెబుతున్నారు. అది ఏ మూలకు సరిపోతుంది? గతంలో ఉల్లి, టమాట ధరలు తగ్గినప్పుడు వాటిని కొని హాస్టల్స్‌కు, హాస్పిటల్స్‌కు సప్లై చేసి రైతులను ఆదుకున్న ఆనవాయితీ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి ఉన్నది. ఇప్పుడు ఆ ప్రయత్నమేమీ చేయడం లేదు. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, హాస్పిటల్స్ వాటికి ఇవ్వవచ్చు. ఇప్పుడు ఇచ్చే రూ.40 కోట్లు మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ చాలదు. దానిని పెంచే ప్రయత్నం చేస్తారా? కందులు, మిర్చికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ఏ ప్రయత్నాలు చేస్తున్నారో తెలియచేయవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుః గౌరవ సభ్యులు అడిగినటువంటి రూ.40 కోట్లు కేవలం ఉల్లిపాయలకోసం కేటాయించబడింది. మిగతా అన్నింటి కోసం కాదు. కందుల విషయానికి వస్తే మార్కెట్‌లో ఎలా ఉన్నా ఎమ్ఎస్‌పి ధర ఇస్తున్నాము. రూ.5,050/- కంటే తక్కువకు ఎవరూ అమ్ముకోవలసిన అవసరం లేదు.

ఉ.10.40

ఎందుకంటే, ఎక్కడ కొనుగోలు కేంద్రాలు కావాలన్నా మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా కొనుగోలు చేస్తున్నాము. ప్రస్తుతం 77 కేంద్రాలు పనిచేస్తున్నాయి. నిన్న చిలకలూరిపేటలో కూడా ఒక కొత్త కేంద్రాన్ని ప్రారంభించాము. రాష్ట్రంలో ఎక్కడైనా కందులుంటే, ఆ పరిసరాల్లో ఎక్కడైనా కొనుగోలు కేంద్రాలు లేవని మా దృష్టికి తీసుకువస్తే, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదు. ఎన్ని ఉన్నా రూ. 5,050/- ల చొప్పున పూర్తిగా కొనుగోలు చేయడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని నేను తమరిద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, నేను మిర్చియార్డుకు మూడు రోజుల క్రితమే వెళ్లి రావడం జరిగింది. గత పది సంవత్సరాలు మోడల్ ప్రైస్ చూసుకుంటే రూ.7,500/- లుగా ఉంది. నేడు రూ. 8,000/-లకు బెస్ట్ వెరైటీలను కొనుగోలు చేయడం జరుగుతోంది. వర్షాభావ పరిస్థితుల వల్ల తాలుగాయలు, తెల్లగాయలు ఎక్కువగా వచ్చినందువల్ల వాటిని రూ. 2,000/- నుంచి రూ.5,000/- మధ్యలో కొనుగోలు చేయడం జరుగుతోంది. గత సంవత్సరం తేజ, సూపర్ సిక్స్ 341 వంటి మేలు రకం మిర్చిని రూ.10,000/- నుంచి రూ.13,000/- రేటుతో కొనుగోలు చేయడం జరిగింది. ఈ సంవత్సరం కూడా బెస్ట్ వెరైటి మిర్చి రూ.8,000/-లకు పోతోంది. వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడి తగ్గిపోవడంతో పాటు తాలుగాయలు కూడా వచ్చాయి. తాలుగాయలను రూ.2,000/- నుంచి రూ.5,000/- లకు కొంటున్నారు. మేము బొంబాయి నుంచి ఎక్స్‌పోర్టర్లను కూడా పిలిచి మిర్చి యార్డులో వెరైటీలను చూపించి వాటి శాంపిళ్లను కూడా ఇతర దేశాలకు పంపించి మార్కెటింగ్ చేయడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని తమరిద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను. ఎందుకంటే, వారి తరఫున కూడా విల్లింగ్‌నెస్ వస్తే, మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో కూడా మార్కెటింగ్ శాఖ ద్వారా కొనుగోలు చేసే ఆలోచన కూడా ఉందని గౌరవసభ్యులు శ్రీ ముద్దుకృష్ణమ నాయుడు గారికి కూడా తమరి ద్వారా నేను తెలియజేస్తున్నాను.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుః అధ్యక్షా, మంత్రిగారు మొన్న జవాబు చెప్పేటపుడు కూడా దీనిలో మిర్చి యార్డు ధరల గురించి గత పది సంవత్సరాలలో ధరలను సగటు చేసి రూ. 7,500 లు ఉందని చెప్పారు. ఇప్పుడు రూ.8,000/- ఉంది కాబట్టి ధరలు ఏమీ తగ్గలేదనే ఒక అభిప్రాయాన్ని చెబుతున్నారు. గత పది సంవత్సరాలలో అమ్మకం ధరలను యావరేజ్‌గా తీసుకుంటే రెండు విషయాలను మీరు దృష్టిలోకి పెట్టుకోవాలి. ఒకటి, గత పది సంవత్సరాలలో పెట్టుబడులు ఏవిధంగా పెరిగాయనేది వారు పరిగణనలోకి తీసుకోవడం లేదు. రెండవది, గత పది సంవత్సరాలలో ద్రవ్యోల్బణం ఏ విధంగా ఉంది, ఆనాడు అమ్మిన రూ.10 లు, ఈనాడు అమ్మిన రూ. 10 లు ఒక్కటేనా అనేది తీసుకోవడం లేదు. రూ. 8,000/-అమ్మే తేజ వంటి నాణ్యమైన, ఎక్స్‌పోర్ట్ వెరైటీలు ఉన్నాయని నేను మొన్న కూడా చెప్పాను. రూ.8 వేలకు ఒప్పుకున్న మాట నిజమే. ఈనాటికి కూడా రూ.8,000/-రేటు ఉంది. అది మొత్తం మార్కెట్ అరైవల్స్‌లో 30 శాతం కంటే ఎక్కువ లేదు. మిగిలిన 70 శాతం లోయర్ క్వాలిటీస్ ఉన్నాయి. మొన్న వర్షాలు వచ్చినపుడు యార్డులోకి వచ్చిన మిర్చిని కూడా రైతులు కాపాడుకోలేక పోయారు. ఆ విధంగా రైతులు దెబ్బతింటూ ఉన్నారు. దానిని ప్రత్యేకమైన దృష్టితో చూడాలి. పది సంవత్సరాల యావరేజి ధర రూ.7,500 లు కాబట్టి రూ.8,000/- మంచి రేటు అనేది కరెక్టు కాదు. గత పది సంవత్సరాల నుంచి ఖర్చులు కూడా ఎలా పెరిగాయో ఆలోచించవలసిన ఆవశ్యకత ఉంది.

మిస్టర్ ఛైర్మన్‌: సార్, క్వశ్చన్ అవర్‌లో డిస్కషన్ అయితే సమయం సరిపోదు.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు: అధ్యక్షా, గౌరవసభ్యులు శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గారు అడిగిన విషయం, నేను బాగా ఉందని చెప్పడం లేదు. గత సంవత్సరం మాత్రం రూ. 10,000/- నుంచి రూ. 13,000/- వరకూ మార్కెట్ ఉంది. దానిని దృష్టిలో పెట్టుకుంటే తక్కువ అనేది నేడు పత్రికల్లో వచ్చినా, మీడియాలో వచ్చినా, రైతుల ఆలోచనల్లో ఉన్నా ఆ విధంగా ఉన్నాయని మాత్రమే నేను తమరిద్వారా గౌరవసభ్యులకు తెలియజేయడం జరిగింది. ఎందుకంటే, గత సంవత్సరం రూ. 10,000/- నుంచి రూ. 13,000/- వరకూ ఉంది. ఈ సంవత్సరం ఏరియా విషయానికి వస్తే, ఒక్క గుంటూరు జిల్లాలోనే 63,098 ఎకరాల్లో మిరప పంట ఉంది. అంటే, 37 శాతం ఏరియా కూడా పెరిగింది. రాష్ట్రం మొత్తం మీద 74,782 ఎకరాల్లో మిరప పంట ఈ సంవత్సరం పెరిగింది. ఉత్పత్తి విషయానికి వస్తే 13.64 లక్షల క్వింటాళ్ల దిగుబడి కూడా పెరిగింది. ఒక్క గుంటూరు జిల్లాలోనే 12.94 లక్షల క్వింటాళ్లు దిగుబడి కూడా పెరిగింది. ఎందుకంటే, గత సంవత్సరం ధరలను దృష్టిలో పెట్టుకుని పంటను వేయడం జరిగింది. ధర ఏది ఎక్కువ ఉంటే అటు వెళ్లడం సహజం. ఉల్లిపాయల ధర కూడా గత సంవత్సరం ఎక్కువగా ఉండడం వల్ల ఈ సంవత్సరం ఉల్లిపాయల పంట ఏరియాను కూడా పెంచారు. దానివల్ల ధర తగ్గింది. కందుల ధర ఎక్కువగా ఉంది. అందువల్ల దానిని ప్రభుత్వం కొనుగోలు చేసి వినియోగదారులకు కిలో రూ.50 లకే ఇచ్చాము. దానివల్ల సుమారు రూ.60 కోట్ల నుంచి రూ. 80 కోట్లు ప్రభుత్వం భరించడం జరిగింది. ఒక సంవత్సరం ధర ఎక్కువగా ఉన్నప్పుడు రైతు వచ్చే సంవత్సరం ఆ పంట వైపు మొగ్గు చూపడమనేది సాధారణంగా జరుగుతూ ఉంటుంది. అదేవిధంగా, ఈరోజు వరకూ చూసుకుంటే, గుంటూరులోనే 40 శాతం దిగుబడి కూడా పెరిగింది. ఈరోజు వరకూ 1.59 కోట్ల బ్యాగులు, సీజన్ మొత్తం అయితే డిసెంబరు 15 నుంచి మార్చి నెల వరకూ 53 లక్షలు అయ్యింది. కోల్డ్ స్టోరేజీలలో కూడా 40 లక్షల బ్యాగులు ఉన్నాయి. ఇంకా 70 లక్షల బ్యాగులు పెట్టుకోవడానికి కూడా అవకాశముంది. ఏదిఏమైనా మంచి ధర రావడానికి ఈ రాష్ట్రప్రభుత్వం ప్రయత్నం చేస్తూ, మిర్చి రైతులను ఆదుకుంటుంది. గౌరవసభ్యులు శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గారు చెప్పిన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని, ఒకపక్క ఎక్స్‌పోర్ట్‌కు ప్రయత్నిస్తున్నాము. మరో పక్క మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకునే ప్రయత్నం కూడా చేయబోతున్నామని తమరిద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వరు: అధ్యక్షా, మిర్చి వేరేచోట నుంచి కూడా గుంటూరుకు వస్తోంది. మిర్చి బోర్డును ఇక్కడ ఏర్పాటు చేయమనండి.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు: అధ్యక్షా, గుంటూరు మరియు చిలకలూరిపేటలో స్పైసెస్ బోర్డు కూడా ఉంది. స్పైసెస్ బోర్డు ఎక్కడో కేరళలో ఉంటే, గుంటూరులో రీజనల్ కార్యాలయం అయినా ఏర్పాటుచేయాలని మన ముఖ్యమంత్రి గారు గౌరవ కేంద్రమంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ గారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. అది కూడా పరిశీలనలో ఉంది. మిర్చి రైతులకు గతంలో ఎన్నడూ కనీస మద్దతు ధర లేదు. గతంలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేశారు. ఆ సమయంలో NAFED సంస్థ కూడా 50 శాతం షేర్ చేసుకుంటామని చెప్పడం జరిగింది కానీ, షేర్ చేసుకోలేదు. అప్పుడు కూడా రాష్ట్రప్రభుత్వమే భరించింది. తిరిగి మరలా ఇప్పుడు కూడా కేంద్రప్రభుత్వాన్ని సంప్రదిస్తూ ఉన్నాము. మార్క్‌ఫెడ్ ద్వారా, నాఫెడ్ సంస్థ ద్వారా మిర్చిని కొనుగోలు చేసి కేంద్రం, రాష్ట్రం 50:50 భరించే విధంగా చర్చలు కూడా జరుగుతున్నాయి. ఆ రకమైన ప్రయత్నాలు చేస్తున్నామని నేను తమరిద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

## వెనుకబడిన జిల్లాలకు నిధులు

ప్రశ్న నెం.9528(89)

సర్వశ్రీ కోలగట్ల వీరభద్ర స్వామి, దేవసాని చిన గోవింద రెడ్డి, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎం.ఎల్.సి.లు.,

గౌరవనీయులైన ఆర్థిక శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) 2014–15, 2015–16, 2016–17 ఆర్థిక సంవత్సరాలలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసంకేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి విడుదల చేసిన నిధుల జిల్లా వారీ వివరాలేమిటి?

ఆ) సదరు నిధులతో చేపట్టిన పనులు మరియు అయిన వ్యయానికి సంబంధించిన జిల్లావారీ వివరాలు ఏమిటి?

ఇ) నిధులను పూర్తిగా ఖర్చు చేయడమయిందా?

ఈ) లేనట్లయితే, అందుకు గల కారణాలు ఏమిటి?

గౌరవనీయులైన ఆర్థిక శాఖ మంత్రివర్యులు (శ్రీ యనమల రామకృష్ణుడు):

అ) ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి క్రింద కేంద్ర ప్రభుత్వం ఏడు వెనుకబడిన జిల్లాలు అంటే; అనంతపురం, చిత్తూరు, వై.ఎస్.ఆర్. కడప మరియు కర్నూలు (రాయలసీమ–4) మరియు శ్రీకాకుళం, విజయనగరం మరియు విశాఖపట్నం (ఉత్తర కోస్తా జిల్లాలు–3) జిల్లాలకు ఈ క్రింది విధంగా నిధులను విడుదల చేసింది.

| సంవత్సరం | | మొత్తం రూ.కోట్లలో |
|---|---|---|
| 2014–15 | – | 7 జిల్లాలలోని ప్రతి జిల్లాకు రూ.50కోట్ల చొప్పున రూ.350.00కోట్లు. |
| 2015–16 | – | 7 జిల్లాలలోని ప్రతి జిల్లాకు రూ.50కోట్ల చొప్పున రూ.350.00కోట్లు. |
| 2016–17 | – | 7 జిల్లాలలోని ప్రతి జిల్లాకు రూ.50కోట్ల చొప్పున కేంద్రప్రభుత్వం ఇటీవల రూ.350.00కోట్ల నిధులను విడుదల చేసింది. ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ క్రింద ఈ మొత్తాన్ని త్వరలోనే జిల్లాలకు విడుదల చేయడమవుతుంది. |

ఆ) 22–03–2017 నాటికి జిల్లా వారీ వ్యయ వివరాలు:–

| జిల్లా | | ఖర్చు చేసిన నిధులు (రూ.కోట్లలో) |
|---|---|---|
| శ్రీకాకుళం | – | 67.83 |
| విజయనగరం | – | 100.00 |
| విశాఖపట్టణం | – | 100.00 |
| చిత్తూరు | – | 64.33 |
| వైఎస్ఆర్ కడప | – | 71.25 |

| | | |
|---|---|---|
| అనంతపురము | – | 100.00 |
| కర్నూలు | – | 70.43 |
| | | ----------- |
| **మొత్తం** | **–** | **573.84** |
| | | ------------ |

పిఆర్ రోడ్లు, చిన్న తరహా సాగునీరు, గ్రామీణ నీటి సరఫరా, విత్తన బ్యాంకు అభివృద్ధితో సహా వ్యవసాయం, చిన్న తరహా శీతల గిడ్డంగులు మొదలైనవి, రెయిన్‌గన్స్‌తో సహా ఉద్యానవనాలు, సూక్ష్మ సేద్యం, పండ్లను మాగ పెట్టే గదులు, మొదలైనవి, పశుసంవర్థక శాఖకు సంబంధించిన పశువుల కొట్టాల నిర్మాణం, ఆర్ఎల్‌యులు, పశు వైద్య మౌలిక సదుపాయాలు మొదలైనవి, గిరిజన సంక్షేమం, రోడ్లు & భవనాలు, ఎడబ్ల్యుసి భవనాలు, నీటి నిర్వహణ పనులు, మత్స్య పరిశ్రమ, కరవు నివారణ కార్యకలాపాలు, తుఫాను నివారణా చర్యలు మొదలైన పనులను ఎస్‌డిపి నిధులతో చేపట్టడమయింది.

ఇ & ఈ)

మంజూరుల ప్రకారం, మొత్తాలను ఖర్చు చేయడమయింది. అయినప్పటికీ, కొన్ని సందర్భాలలో పని స్వభావం మరియు పురోగతిని బట్టి పనులను కొనసాగించడమవుతున్నది.

ఉ. 10.50

శ్రీ దేవసాని చిన గోవిందరెడ్డి (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ క్రింద కేంద్రప్రభుత్వం ఇచ్చే నిధులే అరకొరగా ఉన్నాయి. జిల్లాకు కేవలం రూ.50 కోట్లంటే ఏ విధంగానూ సరిపోదు. ఈ మూడు సంవత్సరాలలో మొత్తం ఏడు జిల్లాలకుగాను రూ.350 కోట్ల వంతున రూ.1050 కోట్ల నిధులు విడుదల చేశారని గౌరవ మంత్రిగారు చెప్తున్నారు. అయితే ఇప్పటివరకూ ఖర్చుపెట్టింది కేవలం రూ.573 కోట్లు. అందులోకూడా బాగా వెనుకబడినటువంటి జిల్లాలైన చిత్తూరు జిల్లాలో రూ.64 కోట్లు, వై.ఎస్.ఆర్ కడప జిల్లాలో రూ.71 కోట్లు ఖర్చుపెట్టారు. అదికూడా తుఫాను నివారణ చర్యకు ఖర్చుపెట్టామన్నారు. అసలు తుఫానులు ఎక్కడున్నాయి? మూడు సంవత్సరాలుగా తీవ్రమైనటువంటి కరవు ఉంది. కడప జిల్లాలోనైతే నీళ్ళులేక ట్యాంకర్లదగ్గర కొట్లాడుకుని చాలామంది పోలీసు స్టేషన్లకు వెళ్ళిన పరిస్థితులు ఉన్నాయి. అటువంటి స్థితిలో ఈ ఖర్చుపెట్టే విధానాన్ని చూస్తే నీరు–చెట్టు కార్యక్రమానికి రూ.1400 కోట్లు అని నిన్న చూశాము. ఇది కేవలం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నామినేషన్ పద్ధతిలో ఇచ్చే పనుల లాగానే ఉంది. ఎస్.డి.పి క్రింద వచ్చే నిధులే చాలా తక్కువగా ఉన్నాయి. ఆ ఇచ్చే రూ.50 కోట్ల నిధులను కార్యకర్తలు, రహదార్ల అభివృద్ధి వంటి కార్యక్రమాలకు ఖర్చుపెట్టేటటువంటి ఇబ్బందికరమైన పరిస్థితి.

అలాగే మత్స్య పరిశ్రమ అన్నారు. రాయలసీమలో మత్స్య పరిశ్రమ ఎక్కడుంది సార్? ఈ నిధులన్నీ కూడా మళ్ళింపబడుతున్నాయి. గత సంవత్సరం నీళ్ళులేక వ్యవసాయం చేసినవాళ్ళే లేరు. ఇటువంటి ఇబ్బందికరమైన పరిస్థితులున్నాయి. వచ్చిన నిధులు కూడా ఖర్చుపెట్టే పరిస్థితిలేదు. రూ.150 కోట్లు నిధులు వస్తే రూ.64 కోట్లు ఖర్చుపెట్టామన్నారు. ప్రజలకోసం ఖర్చుపెట్టాల్సిన ఆ నిధులన్నీ మళ్ళించబడే పరిస్థితి ఉంది. ఇవన్నీ కూడా పూర్తిగా ఒక పార్టీ కార్యక్రమానికి జరుగుతున్నాయేతప్ప నిజానికి

అక్కడ అభివృద్ధికోసం, ప్రజలకోసం జరగడంలేదని మీద్వారా గౌరవ మంత్రివర్యులకు తెలియజేసుకుంటున్నాను.

(గౌరవ సభ్యులు సర్వశ్రీ గాలి ముద్దుకృష్ణమనాయుడు, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, యం.వి.ఎస్.శర్మ గార్లు తమకు మాట్లాడడానికి అవకాశమివ్వమని కోరసాగారు).

MR. CHAIRMAN: I am going only with the printed names. You should have patience. ఇంకా రెండు ప్రశ్నలున్నాయి. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గారు మీ పేరుంది. మీరు అడగండి. Now, I am not allowing anybody. Mr. Gali Muddu Krishnama Naid, please, take your seat and I have given sufficient time to your question. Still there are two or three questions yet to be completed. Let me decide but, you can't decide. Mr. Ummareddy Venkateswarlu, put only supplementary.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వరు: అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడు జిల్లాలను వెనుకబడిన జిల్లాలుగా గుర్తించి వీటికి రూ.50కోట్లు చొప్పున ఇచ్చారు. అయితే అవి కేవలం వెనుకబడిన జిల్లాలే కాదు ఈమధ్య నిరంతరమూ కరవు జిల్లాలుగా మారిపోయాయి. చిత్తూరు, ప్రకాశం, అనంతపురం జిల్లాలు ఈ సంవత్సరం మొత్తం కరువు జిల్లాలైపోయాయి. అన్ని మండలాల పరిస్థితి ఇలాగే ఉంది. పశుగ్రాసమనేదే ఆ ప్రాంతంలో ఎక్కడా లేదు. పశుగ్రాసం కోసం కూడా వీటిని ఉపయోగించడంలేదు. ఫాడర్‌బ్యాంక్స్‌గా మెయింటైన్ చేస్తామని చెప్పారు. ఆ ఫాడర్‌బ్యాంక్స్‌కు ఎక్కడాకూడా ప్రొవిజన్ చూపించడంలేదు. ఈ జిల్లాలలో ఎక్కడా కూడా పశువులకు మేత లేకుండా ఉంది. ఈ వెనుకబడిన జిల్లాలకు, కరవు మండలాలకు ఏమైనా అదనంగా నిధులు కేటాయించి ఖర్చుపెట్టబోతున్నారా అనేది కొంచెం మంత్రిగారు చెప్పాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖరరావు (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రకాశంజిల్లాను దీంట్లో కలపడానికి నేను అడుగుతూనే ఉన్నాను. మేము ఇస్తామని ప్రభుత్వంవారు చెప్తూనే ఉన్నారు. ఈ సంవత్సరం ప్రకాశం జిల్లాలోని 53 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించారు. గత సంవత్సరం, అంతకుముందు సంవత్సరం కూడా ప్రకటించారు. కరవు మండలాలు ప్రకటించిన ఏ సందర్భంలోనూ మినహాయించబడలేదు. అదేవిషయాన్ని అడుగుతున్నాము. దానిగురించి ఏమైనా చేస్తున్నారా తెలియజేయాల్సిందిగా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ ఎం.వి.ఎస్ శర్మః అధ్యక్షా, రాష్ట్ర విభజన చట్టంలో రాయలసీమ, ఉత్తరాంధ్రకి ప్రత్యేక ప్యాకేజీ అని పొందుపరిచి ఉంది. సంవత్సరానికి జిల్లాకు రూ.50 కోట్లు మాత్రమే ఇస్తారా? లేదా ప్రత్యేక ప్యాకేజీ కింద మొత్తం ఆ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది ఏమైనా ఉందా? ఉంటే ఆ వివరాలేమిటో తెలియజేయాలని కోరుతున్నాము.

శ్రీ గాలి ముద్దు కృష్ణమనాయుడుః అధ్యక్షా, చిత్తూరు జిల్లా పెద్దజిల్లా. విస్తీర్ణం, జనాభా చాలా ఎక్కువ. మూడు సంవత్సరాలకు రూ.150 కోట్లు ఇచ్చారు కానీ అందులో రూ.64 కోట్లే ఖర్చుపెట్టారు. కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి ఇచ్చే రూ.50 కోట్లు త్రాగునీటికి, రహదార్ల అభివృద్ధికి, పశువుల మేతకు, చెరువులను లోతుచేయడానికి, కాలువలు తవ్వడానికి, నీటిపారుదల సదుపాయాలు కల్పించడానికి, నీరు-చెట్టు కార్యక్రమం ఇలా ఏ కార్యక్రమానికీ సరిపోదు. ప్రత్యేక ప్యాకేజీ కింద ఇంకా ఎక్కువ డబ్బులివ్వమని కేంద్ర ప్రభుత్వాన్ని ఏమైనా కోరుతున్నారా? లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఏదైనా మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తుందా? కొన్ని జిల్లాల్లో అయితే రూ.100 కోట్లు కూడా ఖర్చుపెట్టారు. కానీ చిత్తూరుజిల్లా చాలా తక్కువ ఖర్చుపెట్టింది. ఎందుకు ఆ మాదిరిగా జరిగింది. ఈరోజు చిత్తూరు జిల్లాలో ప్రత్యేకంగా ఒక డ్రైవ్ పెట్టి ఏమైనా చర్య తీసుకుంటారా?

శ్రీ యనమల రామకృష్ణుడుః అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వానికి మేము దాదాపు రూ.5000 కోట్లకు ప్రతిపాదన పంపించినప్పటికీ కూడా వాళ్ళకుండే పరిధిలో మూడు దఫాలుగా రూ.350 కోట్లు ఇవ్వడం జరిగింది. మొదట రూ.350 చొప్పున రెండు దఫాలుగా వచ్చిన మొత్తం, రూ.700 కోట్లు కూడా జిల్లాలకు పంపించాము. ఎందుచేతనంటే ఎస్‌డిఎఫ్ అంతా కూడా రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఉండే ప్రకారంగా ఏ జిల్లాలను గుర్తించారో ఆ ఏడు జిల్లాలకు కూడా మొదటి రెండు విడతలు వచ్చిన అమౌంట్‌నంతా పంపించడం జరిగింది. దీనికి జిల్లా కలెక్టర్ గారిని ఆథరైజ్ చేసి బాగా వెనుకబడిన కరువు ప్రాంతాల కార్యక్రమాలకు ఖర్చు చేయమని చెప్పి ఆదేశాలిచ్చాము. జిల్లా కలెక్టర్లే పనులు ఎంపిక చేసి నిధులు ఇస్తారు. మొదటి రెండు విడతల్లో ఇచ్చిన రూ.700 కోట్లలో దాదాపు రూ.573 కోట్ల వరకూ కూడా వాళ్ళు ఖర్చుపెట్టారు. ఇంకా కొంత ఖర్చుపెట్టాల్సిన అవసరముంది. మార్చి 31లోపు అవన్నీ కూడా ఖర్చుపెట్టాలి. ఎన్నికల కోడ్ నిబంధనలవల్ల కొంత ఆలస్యంగా మూడవ విడతలోని రూ.350 కోట్లు ఈ మధ్యనే వచ్చింది. చాలా ప్రతిపాదిత పనులున్నాయి. ఆ నిధులతో ఆ పనులను కూడా చేపడతారు. ఏదేమైనప్పటికీ గౌరవ సభ్యులు చెప్పినట్లు ఇంకా త్వరగా చేయాల్సిన అవసరముంది. కొంత ఆలస్యం జరిగిన మాట కూడా వాస్తవమే.

ఉ. 11.00

గౌరవ సభ్యులు శ్రీ పి.జె. చంద్రశేఖరరావు గారు ప్రకాశం జిల్లా గురించి అడిగారు. చట్టప్రకారం ఏడు జిల్లాలకు మాత్రమే కేంద్రప్రభుత్వం వారు ఇస్తున్నారు. ప్రకాశం జిల్లా గురించి కూడా కేంద్రప్రభుత్వంకు రాశాము. కానీ ఇంకా ఏ రిప్లై రాలేదు. కాకపోతే సభ్యులు శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గారు కూడా అడిగినట్లు ఈ ఏడు జిల్లాలు కాకుండా, మిగతా 6 జిల్లాలలో వెనుకబడిన ప్రాంతాలలో ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో అవి కూడా స్టేట్ గవర్నమెంట్ ఫండ్స్‌తో చేపట్టమని అన్నాము. ఈ చట్ట ప్రకారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఎలాగైతే జిల్లాకు రూ.50 కోట్లు ఇస్తున్నదో, ఆ జిల్లాలకి స్టేట్ గవర్నమెంట్ కాంపెన్సేట్ చేసే విధంగా కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నాము. తూర్పుగోదావరి, ప్రకాశం, నెల్లూరు అని కాదు ఏ ప్రాంతంలో కరవు ఉన్నా సరే ఫండ్స్ కేటాయించడంలో ఈక్వాలిటీ మెయింటైన్ చేయాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది, ఆ విధంగా చేస్తాము.

అదేవిధంగా సభ్యులు శ్రీ యం.వి.యస్. శర్మగారు అడిగినట్లుగా ప్యాకేజీకి, దీనికి సంబంధం లేదు. ఈ ప్రశ్న ఏమంటే ఎస్‌డీఎఫ్ క్రింద ఏం వచ్చింది, ఏడు జిల్లాలకు ఎంత వచ్చింది, ఎంత ఖర్చు పెట్టారు అన్నారు కాబట్టి దీనికి, ప్యాకేజీకి సంబంధం లేదు. ఇది చట్టరీత్యా ఇచ్చిన హామీ కాబట్టి చట్టరీత్యా ఇచ్చిన హామీలో మనం కొంచెం ఎక్కువ అడిగాము, కానీ వాళ్లు కొంత తక్కువ ఇచ్చారు. దాదాపు రూ.5,000 కోట్లు అడిగాము, కానీ అంత ఇవ్వలేదు. ప్రతీ సంవత్సరం ఇస్తారు, ఇచ్చినప్పుడు ఆ నిధులను బ్యాక్‌వార్డ్ ఏరియాలకు ఉపయోగిస్తాము. దానితోపాటు ఎక్కడైతే వెనుకబడిన ప్రాంతాలు ఉన్నాయో అక్కడ కూడా స్టేట్ ఫండ్స్ నుండి తీసుకుని ఖర్చుపెట్టడానికి ప్రయత్నం చేస్తాము.

## పాఠశాలలలో ఖాళీలను భర్తీ చేయుట

ప్రశ్న నెం.9513(87)

శ్రీ ఎం.వి.ఎస్.శర్మ, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు/స్థానిక సంస్థల పాఠశాలల్లో 19000కు పైగా ఖాళీలు ఉన్నాయన్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ఆ ఖాళీలను భర్తీచేయడానికి తీసుకున్న చర్యలేమిటి?

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగారు (శ్రీ గంటా శ్రీనివాసరావు):

అ) లేదండీ.

ఆ) i. 01-03-2017 నాటికి ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థల పాఠశాలల్లో 4699 ఖాళీలు మాత్రమే ఉన్నాయి.

ii. ఉపాధ్యాయుడు – విద్యార్థి నిష్పత్తి ఆధారంగా అవసరమైన పాఠశాలలకు ఉపాధ్యాయ పదవులను తిరిగి కేటాయించడానికి 2017 వేసవిలో పాఠశాలలు మరియు హేతుబద్ధీకరణకు ఉపాధ్యాయ పదవులను ప్రతిపాదించడమయింది.

iii. హేతుబద్ధీకరించిన తరువాత, ఖాళీలను గుర్తించి తగిన సమయంలో ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడమవుతుంది.

శ్రీ యం.వి.యస్. శర్మః అధ్యక్షా, విద్యాహక్కు చట్టం ప్రకారం తగినంతమంది ఉపాధ్యాయులు విద్యాసంవత్సరం ప్రారంభం అయ్యేసరికి ఉండాలి. 4,699 పోస్టులు ఖాళీగా ఉన్నప్పుడు జూన్‌లో పాఠశాలలు తెరిచే సమయానికి ఈ ఖాళీలు నింపకపోతే రాష్ట్రప్రభుత్వం విద్యాహక్కును ఉల్లఘించినట్లు అవుతుంది. ఇంతవరకూ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. అందుకని, వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ తేదీని మంత్రిగారు ఈ రోజు సభలో ప్రకటిస్తారా అనేది మొదటి ప్రశ్న. రెండవది, మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయుల ఖాళీలు కొన్ని వేల సంఖ్యలో ఉన్నాయి. ఆ ఖాళీలను నింపే విషయం మీద ప్రభుత్వం ఏ వైఖరి తీసుకుంటుంది? కాంట్రాక్టు పద్ధతులలో ఉపాధ్యాయులను నియమించడం కూడా విద్యాహక్కు చట్టం ప్రకారం సరైనది కాదు. కాబట్టి, రెగ్యులర్ ఉపాధ్యాయులతో గురుకులాలు, మోడల్ స్కూల్స్, ఎయిడెడ్ పాఠశాలల్లో నింపేందుకు ప్రభుత్వ ప్రతిపాదన ఏమైనా ఉందా? మూడవ ప్రశ్న ఇంగ్లీషు మీడియం, తెలుగు మీడియం అని రెండు పెట్టినప్పుడు విద్యార్థులు, ఉపాధ్యాయులు రేషియో సంఖ్యను బట్టి కాకుండా రెండు మీడియంలు, రెండు సెక్షన్లు అయినప్పుడు ఆ లెక్కన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. లేదంటే ఉన్న ఉపాధ్యాయుల మీద పనిభారం రెట్టింపు అవుతుంది. కేవలం విద్యార్థి, ఉపాధ్యాయుల సంఖ్య రేషియో ప్రకారం కాకుండా మీడియంను కూడా లెక్కలోకి తీసుకుని ఆ పోస్టులను నింపే ఆలోచన ఏమైనా ఉందా?

చివరి అంశం ట్రాన్స్‌ఫర్స్. రేపు కౌన్సిలింగ్ స్టార్ట్‌చేసి వారికి పోస్టింగులు ఇస్తారు, అప్పుడు ఆ ప్లేస్‌లు ఖాళీగా ఉండిపోతున్నాయి. టీచర్స్‌ను రిలీవ్ చేయమని ఆపేస్తున్నారు, లేదా విద్యార్థులకు ఉపాధ్యాయులు లేకుండా పోతున్నారు. ఈ సమస్యలు లేకుండా విద్యాసంవత్సరం ప్రారంభం అయిన తరువాత అంతరాయం లేకుండా విద్యార్థులకు చదువు బోధించేందుకు ఏదైనా ఒక స్టాండర్డ్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్నారా అని మీద్వారా మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ బొడ్డు నాగేశ్వరరావు (పట్టభద్రుల నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు): అధ్యక్షా, ఎయిడెడ్ పాఠశాలల్లో 8,957 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయనే మాట వాస్తవమేనా? ఉంటే వాటిని నింపే అవకాశం ఉందా? ఈ మధ్యకాలంలో వెయ్యి పోస్టులు ఎయిడెడ్ పాఠశాలల్లో నింపుతున్నామనే మంత్రిగారి ప్రకటనలు కూడా వచ్చాయి. కాబట్టి, వాటిని నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. రెండవది గవర్నమెంట్ హైస్కూల్స్, జిల్లా పరిషత్తు హైస్కూళ్లు, మున్సిపల్ స్కూళ్లల్లో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు అనేవారు ఒకేషనల్ టీచర్స్‌గా, పి.ఇ.టిలుగా, మ్యూజిక్ టీచర్స్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఉన్న పాఠశాలలకు

కాకుండా, కొత్తగా వచ్చిన వారికి సెంట్రల్ గవర్నమెంట్ ఇస్తున్నది. పాత హైస్కూల్స్‌లో శాంక్షన్ చేసిన పోస్టులు ఉన్నాయి. క్రాఫ్ట్ టీచర్ పోస్టులు, డ్రాయింగ్ టీచర్ పోస్టులు, ఒకేషనల్ పోస్టులు, మ్యూజిక్ టీచర్ పోస్టులు ఇవన్నీ కూడా ఉన్నాయి. ఇవన్నీ కూడా కొన్ని వేలల్లో ఉన్నాయి. అవి ఏమైనా నింపే అవకాశం ఉందా? విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థులలో co-circular activities, సహపాఠ్యానికి సంబంధించి సంపూర్ణమైన మూర్తిమత్వ వికాసాన్ని పొందాలంటే ఈ పోస్టులన్నీ నింపాల్సిన అవసరం ఉంది. అవి నింపే అవకాశం ఉందా? మూడవ అంశం మనకు విద్యాశాఖలో సి.ఆర్.టి.లు, ఐ.ఇ.ఆర్.టి. టీచర్స్, ఎం.ఐ.ఎఫ్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు పేర్లమీద అతితక్కువ వేతనానికి పనిచేస్తున్నారు. వారికి రెమ్యునరేషన్స్ పెంచే ప్రతిపాదనలు ఏమైనా ఉన్నాయా? ఉంటే సభకు తెలియజేయాలని మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

డా. యం.వి.వి.యస్. మూర్తిః అధ్యక్షా, పాఠశాల విద్య అనేది అందరికీ అందుబాటులో ఉండే విధంగా 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు ఉచిత విద్యను అందించాలని యాక్టుకూడా పాస్ అయ్యింది. మోడల్ స్కూల్స్ అనే పేరుతో పిల్లలు తక్కువగా ఉన్నారని ఎన్ని పాఠశాలలు మూసివేశారు? ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ ఏరియాలలో పిల్లలు తక్కువగా ఉన్నారని కొన్ని పాఠశాలలు మూసివేశారు. నాలుగైదు స్కూల్స్‌ని కలిపి నాలుగైదు కిలోమీటర్లు నడిచివెళ్లేలా ఒకే స్కూల్‌గా పెట్టడం వల్ల పేదవారికి విద్య దూరమైపోతోంది. అటువంటి మోడల్ స్కూల్స్ ఎన్ని మూసివేశారు?

శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్ః అధ్యక్షా, ఉర్దూ టీచర్ల ఖాళీల భర్తీ కోసం గత సంవత్సరం సెప్టెంబరు మాసంలో మంత్రివర్యులకు, ముఖ్యమంత్రిగారికి ఒక రిప్రజెంటేషన్ ఇచ్చాను. ముఖ్యమంత్రిగారు నా రిప్రజెంటేషన్ మీద స్పెషల్ ఉర్దూ డీఎస్సీ నిర్వహించమని నిర్దిష్టంగా తమ స్వహస్తాలతో రాసి పంపించారు. అది పంపించిన లెటరు కూడా సిఎంఓ ఆఫీస్ నుండి సెప్టెంబరు 28న వెళ్లింది. కాబట్టి, నా లెక్క ప్రకారం 357 ఉర్దూ టీచర్ల పోస్టులు భర్తీ కాకుండా, దాదాపు 10 సంవత్సరాల నుండి ఖాళీగా ఉన్నాయి. కాబట్టి, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్‌ను లిఫ్ట్ చేసి డీ-నోటిఫై చేసి ఉర్దూ టీచర్ల స్పెషల్ డీఎస్సీ నిర్వహించడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందనేది ముఖ్యమంత్రి గారి మాటలతో అర్థమవుతోంది. ఎప్పటిలోగా నిర్వహిస్తారని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

మరొక అంశం ఏమంటే ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల విజయవాడ వించిపేటలో ఉంది. ఆ కళాశాలకు ఒక్క ప్రిన్సిపల్‌ని మాత్రమే నియమించారు. ఇప్పటికే అది ఏర్పాటు చేసి దాదాపు 10 సంవత్సరాలైంది. విజిటింగ్ ప్రొఫెసర్స్‌ని ఏర్పాటు చేశారు. అధ్యాపకులను ఏర్పాటు చేశారు. నాలుగు సంవత్సరాల నుండి జీతాలు లేకుండా వారు పనిచేస్తున్నారు. దీనికి సంబంధించి కూడా రిప్రజెంటేషన్ ఇచ్చి నాలుగు నెలలు అయ్యింది. దీనికి కూడా మంత్రిగారు సమాధానం చెప్పాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీమతి పమిడి శమంతకమణి(శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, చిన్నప్పటి నుండే కంప్యూటర్ నాలెడ్జ్ కోసం చాలా పాఠశాలల్లో కంప్యూటర్లు పెట్టడం జరిగింది. కానీ, కంప్యూటర్ బోధించే టీచర్లు లేక విలువైన కంప్యూటర్లు అన్నీ కూడా నిరుపయోగంగా ఉన్నాయి. దొంగలు కూడా వాటిని ఎత్తుకుపోవడం జరుగుతోంది. కాబట్టి, మంత్రిగారు దయచేసి ఆ కంప్యూటర్ నాలెడ్జ్ కోసమైనా ఆ టీచర్స్‌ను నియమించాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

ఉ.11.10

శ్రీ గంటా శ్రీనివాసరావుః అధ్యక్షా, ముందుగా ఈ ఆర్.టి.ఇ యాక్టు ప్రకారం ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల నిష్పత్తి గురించి గౌరవసభ్యులు శ్రీ ఎం.వి.ఎస్.శర్మ గారు అడిగారు. ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల నిష్పత్తి ప్రైమరీ పాఠశాలల్లో 1:30, అప్పర్‌ప్రైమరీ 1:35, సెకండరీ పాఠశాలల్లో 1:40గా

ఉంది. అయితే, మన దగ్గర ఉన్న ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల నిష్పత్తి తీసుకున్నట్లయితే, చాలా మంచి నిష్పత్తి ఉంది. ప్రైమరీ పాఠశాలల్లో 1:22, అప్పర్‌ప్రైమరీ 1:26, సెకండరీ పాఠశాలల్లో 1:27 ఉంది. అలాగని నేను అన్ని పాఠశాలల్లో సరిపోయినంతమంది టీచర్లు ఉన్నారని చెప్పడం లేదు. కొన్ని పాఠశాలల్లో ఎక్కువ మంది, మరికొన్నింటిలో తక్కువ మంది ఉన్నారు. అందుకే పాజిటివ్ కన్సాలిడేషన్‌తో పాఠశాలలను రేషనలైజేషన్ చేయాలని గత సంవత్సరం ప్రయత్నం చేయడం జరిగింది. దానిలో భాగంగా కొన్ని గైడ్‌లైన్స్ పెట్టడం జరిగింది. 30మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలు, అలాగే ఊరికి కి.మీ దూరంలో పాఠశాలలు ఉండాలనేది, ఫిజికల్ బారియర్స్, ఎస్సీ, ఎస్టీ కాలనీలు లాంటి కొన్ని గైడ్‌లైన్లు పెట్టడం జరిగింది. దానిప్రకారం దాదాపు తొమ్మిదివేల పాఠశాలలు రేషనలైజేషన్‌కు అనుకూలంగా రావడం జరిగింది. అందుకే ఒకేసారి అన్ని పాఠశాలలను రేషనలైజేషన్ చేయకూడదనే ఉద్దేశంతో, కేవలం 1436 పాఠశాలలను మాత్రమే రేషనలైజేషన్ చేయడం జరిగింది.

ఈ రేషనలైజేషన్ చేసిన తరువాత మన ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 44,654 ఉండగా, 2,269 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో విద్యార్థుల సంఖ్యను తీసుకుంటే, ప్రభుత్వ పాఠశాలల్లో 37.58 లక్షల మంది, ఎయిడెడ్ పాఠశాలల్లో 2.2 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీటిలో ఉపాధ్యాయుల సంఖ్యను చూసినట్లయితే, ప్రభుత్వ పాఠశాలల్లో 1,86,345 మంది, ఎయిడెడ్ పాఠశాలల్లో 7,830 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. మొత్తం ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల నిష్పత్తి 1:20గా ఉంది. అంటే ఏదైతే పైన చెప్పిన విధంగా 1:30, 1:35, 1:40గా ఉందో, దానికంటే మన యావరేజ్ చాలా బెటర్‌గా ఉంది. కాకపోతే, గౌరవసభ్యులు చెప్పినట్లు కొన్ని పాఠశాలల్లో ఎక్కువ మంది, మరికొన్ని పాఠశాలల్లో తక్కువమంది ఉపాధ్యాయులు ఉంటున్నారు. ఆ ఇంబాలెన్స్‌ని సరిచేయడం కోసమే రేషనలైజేషన్ ప్రక్రియను మొదలుపెడుతున్నాము. మళ్లీ ఈ 2017వ సంవత్సరంలో అంటే విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే లోపే మరోసారి కొత్తగా గైడ్‌లైన్స్ ఇచ్చి, గౌరవ సభ్యులతోనూ, టీచర్ యూనియన్లతోనూ చర్చించి, దానిని ముందుకు తీసుకువెళ్లాలనుకుంటున్నాము.

అదేవిధంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకై, ప్రభుత్వం పదవిలోకి వచ్చిన కొత్తలో డీఎస్సీ నిర్వహించడం జరిగింది. దానిలో దాదాపుగా ఎనిమిదివేల ఖాళీలను భర్తీ చేశాము. ఎక్కడైతే సర్‌ప్లస్ టీచర్లు ఉంటున్నారో, వారిని వర్క్ అడ్జస్ట్‌మెంట్ కోసం పంపించడం జరుగుతోంది.

అలాగే, సభ్యులు ఉర్దూ ఉపాధ్యాయుల గురించి, పాఠశాలలు మూత పడడం గురించి అడిగారు. పాఠశాలలు ఒకట్రెండు చోట్ల ఆ గైడ్‌లైన్లకు విరుద్ధంగా మూతపడినట్లు గతంలో వార్తాపత్రికలలో రావడం జరిగింది. దానిపై విచారణ జరిపి, రెక్టిఫై చేయడం జరిగింది. కంప్యూటర్ ఎడ్యుకేషన్ గురించి గౌరవసభ్యులు అడగడం జరిగింది. ప్రభుత్వం వాటికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, అన్నిచోట్లా డిజిటల్ క్లాస్‌రూములు పెట్టడం జరుగుతోంది. అలాగే వర్చ్యువల్ క్లాస్‌రూములు పెడుతున్నాము. వీటన్నింటిమీద ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవడం జరుగుతోంది. ఉర్దూ టీచర్ల పోస్టులను కూడా తదుపరి రిక్రూట్‌మెంట్లో ప్రాధాన్యత ఇచ్చి వాటిని రిక్రూట్ చేయడం జరుగుతుంది.

శ్రీ ఎం.వి.యస్. శర్మ: అధ్యక్షా, 4,699 ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉండి, డిఎస్సీ ఎప్పుడు ప్రకటిస్తారని అడిగాము. దాని గురించి మంత్రిగారు సమాధానం చెప్పలేదు. ఇంగ్లీషు మీడియం, తెలుగు మీడియం అని రెండు పెట్టిన తరువాత 1:30 అనేది మెకానికల్‌గా అప్లై చేయకూడదు. మీడియం వారీగా టీచర్ల రిక్వైర్‌మెంట్ విషయంలో వర్కౌట్ చేయాలని అడిగాను, దానికి సమాధానం చెప్పలేదు. చేస్తామనో, చేయమనో ఏదో ఒక సమాధానం చెప్పాలి కదా సార్?

శ్రీ గంటా శ్రీనివాసరావుః అధ్యక్షా, ఇప్పుడు సభ్యులు డిఎస్సీ గురించి అడుగుతున్నారు. డిఎస్సీలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉన్నా, అవి ఐదు వేలో, ఆరు వేలో కావచ్చు, ఎన్ని ఉన్నా, వాటిని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని, రేషనలైజేషన్ చేసిన తరువాత వచ్చిన ఫిగర్‌ని బట్టి government will take a positive decision.

శ్రీ ఎం.వి.యస్. శర్మః అధ్యక్షా, నేను ఎప్పుడు భర్తీ చేస్తారని తేది అడిగాను. సమాధానం సరిగా రాలేదు సార్. We are entitled to get a proper answer.

శ్రీ గంటా శ్రీనివాసరావుః అధ్యక్షా, నేను చాలా క్లారిటీగా చెప్పడం జరిగింది. రిక్వైర్‌మెంట్ ఎంత అనేది తెలిశాక డిఎస్సీ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ఇస్తాము. ఆ రిక్వైర్‌మెంట్ తెలియాలంటే ఈ విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోపు రేషనలైజేషన్ చేయబోతున్నాము. అది చేసే ముందు సభ్యులందరితో మాట్లాడి, గైడ్‌లైన్ల గురించి చర్చించి, రేషనలైజేషన్ చేసిన తరువాత ఎన్ని ఖాళీలు ఉంటే, వాటన్నింటినీ భర్తీ చేస్తాము. అవి వందో, వెయ్యో, ఎన్ని వేలు ఉంటే అన్ని వేల పోస్టులను భర్తీ చేసే విషయంలో ఒక నిర్ణయం తీసుకుంటాము. రేషనలైజేషన్ ఫిగర్ తెలియకుండా గాలిలో దీపం పెట్టి, ఎప్పుడు చేస్తామనేది నేను ఎలా చెబుతాను సార్?

## పశ్చిమగోదావరి జిల్లాలో విద్యా వాలంటీర్లు

ప్రశ్న నెం.9528(89)

శ్రీ రాము సూర్యారావు, ఎం.ఎల్.సి.,

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

అ) పశ్చిమ గోదావరి జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను/ విద్యా వాలంటీర్లను నియమించే ప్రతిపాదన ఏదైనా ఉన్నదా?

ఆ) అయితే, ఆ వివరాలేమిటి?

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రివర్యులు (శ్రీ గంటా శ్రీనివాసరావు):

అ) లేదండీ.

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ రాము సూర్యారావుః అధ్యక్షా, ఈ ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉండడవల్ల వాళ్లు కూడా రానప్పుడు కొన్ని సమయాలలో ఇబ్బంది పడుతున్నారు. దాని గురించి శ్రద్ధ వహించి వాలంటీర్లను నియమించవలసిందిగా మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావుః అధ్యక్షా, రాష్ట్రంలో మొత్తం 6,698 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. అందులో ప్రత్యేకించి పశ్చిమ గోదావరిలో 375 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రభుత్వంలో 2015లో వచ్చిన జీవో ప్రకారం ఈ ముంపు మండలాలను కలుపుకున్నామో అప్పుడు కొన్ని పాఠశాలలు అదనంగా వచ్చాయి, అక్కడ అదనంగా 177మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించుకోమని వాళ్లకు అనుమతులు ఇవ్వడం జరిగింది. దాని ప్రకారం రేషనలైజేషన్ చేసిన తరువాత ఎక్కడ ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉంటారో వారిని, తక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న దగ్గరకు వర్క్‌అడ్జస్ట్‌మెంట్ కోసం పంపడం జరుగుతోంది. కాబట్టి తప్పకుండా భవిష్యత్తులో ఎక్కడైనా ఉపాధ్యాయులు తక్కువ మంది ఉంటే వారిని వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేస్తాము.

MR. CHAIRMAN: Now, Tea-Break for 15 Minutes.

(Then, the House was adjourned at 11.17 a.m. for 15 minutes tea-break)

* * *

మ.12.00

(After Tea-Break the House Re-assembled at 12.00 Noon)

(The Hon'ble Chairman in the Chair)

* * *

MR. CHAIRMAN: Now, Special Mention.

## 2.ప్రత్యేక ప్రస్తావన

శ్రీ ఎం.వి.ఎస్. శర్మ : అధ్యక్షా, ఒక చిన్న సమస్య. కానీ, సభ దృష్టిలో పెట్టాలనుకుంటున్నది ఏమిటంటే, నేను ఎం.ఎల్.సి.గా పదవి తీసుకున్న క్రొత్తలో ఈ సమస్య మీద ప్రభుత్వం స్పందించింది. రెండు రోజులలోనే నా పదవి అయిపోతుంది. ఇప్పటివరకూ దానిమీద కదలిక లేదు. తమరు ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి.సారించాలని కోరుతున్నాను.

శ్రీకాకుళం జిల్లాలో కవిటి మండలంలో పెదకర్రివానిపాలెం అనే మత్స్యకారుల గ్రామం ఉంది. ఆ గ్రామానికి మూడువైపుల సముద్రం ఉంది. ఒక్క వైపు మాత్రమే దారి ఉంది. సముద్రానికి ఆటుపోటులు వచ్చినప్పుడు మిగతా దారులన్నీ మూసుకుపోతాయి. అక్కడ గొనామరిగెడ్డ అని ఒక గెడ్డ ఉంది. అక్కడ సముద్రపు పోటు రాగానే పొంగుతుంది. అవతల ప్రక్కన పొలం పనులకుగానీ, మార్కెట్‌కి గానీ వెళ్ళడానికి లేకుండా దిగ్బంధనం అయిపోతుంది. ఆ గ్రామంలో దాదాపు 30 శాతం మంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారు. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న సీరియస్ గ్రామాలలో ఆ గ్రామం కూడా ఒకటి. వరదలు వచ్చినప్పుడు బయటకు ట్రాన్స్‌పోర్ట్ కూడా లేకుండా ఎప్పుడు వరదల్లో కొన్ని గ్రామాలు జలదిగ్బంధనమైపోయినట్లుగా ఈ పెదకర్రివానిపాలెం గ్రామం ప్రతి సంవత్సరం కొన్ని వారాలపాటు జలదిగ్బంధనంలో ఇరుక్కుపోతుంది. ఈ గొనామరి గెడ్డ మీద 2008లో ఒక బ్రిడ్జి కోసం శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ దానిని పూర్తి చేయలేదు. ఎన్నిసార్లు ఆ గ్రామస్తులు మొరపెట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తమరు దయచేసి ఈ సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి ఈ సమస్య తాలూకు తీవ్రతను తీసుకువెళ్ళి ఆ చిన్న వంతెన నిర్మాణం చేయించాలి. బ్రిడ్జి కోసం దాదాపు రూ.5 లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది. ఇప్పటికి దానిని చేయలేదు. పోనీ, మా నియోజక వర్గ అభివృద్ధి నిధుల నుంచి ఇద్దామంటే, మాకు నియోజక వర్గ నిధులు కూడా లేకుండా చేశారు. కాబట్టి, ఈ ప్రభుత్వం మత్స్యకారులకు న్యాయం చేసే విధంగా తమరు జోక్యం చేసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ రాము సూర్యారావు : అధ్యక్షా, ఉద్యోగులకు 2003 వరకూ కూడా పెన్షన్ విధానం సక్రమంగా ఉండేది. 2003లో compulsory contributory pension విధానాన్ని కేంద్రప్రభుత్వం (ఎన్.డి.ఎ.) ప్రవేశపెట్టడం జరిగింది. అప్పటి నుంచి ఈ క్రొత్త విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించమని అనేక విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నాము. కానీ, ఈ రోజు వరకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే అమలు

పరుస్తున్నాయి. మన రాష్ట్ర ప్రభుత్వం దానిని అమలుపరచడం లేదు. క్రొత్త విధానాన్ని అమలు పరుస్తున్నాయి. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి, క్రొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ఈ సభ ద్వారా ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతున్నాను. ఎందుకంటే, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఎంతో బాధపడుతున్నారు. ఏ ఉద్యోగి అయినా సరే, ఉద్యోగం చేస్తే, దానికి ఒక స్థిరత్వం ఉంటుందనే ఆలోచన ఉంటుంది. ఇప్పుడు ఆ స్థిరత్వం లేకుండా పోయింది. అందువల్ల దయచేసి ఈ సభ ద్వారాను, ఈ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కౌన్సిల్‌లో ఒక తీర్మానం చేయాలని కోరుతున్నాను. ఆ తీర్మానాన్ని ఈ సభ ఆమోదించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

మిస్టర్ ఛైర్మన్: మీరు ప్రొసీజర్ ఫాలో కారు. Official, Non official day you can come with a resolution. అది లేదు.

శ్రీ రాము సూర్యారావు: ఒక తీర్మానాన్ని ఈ సభ ఆమోదించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

MR. CHAIRMAN: Now, I will take-up Item No. II in the Agenda. All the papers are deemed to have been laid on the Table of the House.

## 3.PAPER TO BE LAID ON THE TABLE:

A copy of the Audit Report and Annual Accounts of the Visakhapatnam Urban Development Authority, for the Year, 2014-15, as required under sub-section (5) of Section 108 of the Andhra Pradesh Metropolitan Region and Urban Development Authorities Act, 2016.

Now, I will take-up Item No.III in the Agenda. Laying of Committee Reports on the Table of the House.

## 4. కమిటీ నివేదికలు సభా సమక్షంలో ఉంచబడినవి.

MR. CHAIRMAN: Item-III - Presentation of Committee Report. I request Sri Pilli Subhash Chandra Bose, Member of the Committee to lay on the Table copies of the Reports of the Committee on Public Accounts (2016-2017).

SRI PILLI SUBHASH CHANDRA BOSE: Chairman Sir, I beg to lay on the Table copies of the Reports of the Committee on Public Accounts (2016-2017):

"Report (Fifth) on Report of the Comptroller and Auditor General of India (G &SSA) of Government of Andhra Pradesh for the year 2013-14 pertaining to Women, Children Disabled and Senior Citizens Department."

"Report (Sixth) on Report of the Comptroller and Auditor General of India (G & SSA) OF Government of Andhra Pradesh for the year 2013-14 pertaining to Health, Medical and Family Welfare Department."

Now, we will go for Short Discussion on Drought.

## 5. రాష్ట్రంలో కరవు పరిస్థితిపై లఘు చర్చ:

శ్రీ సి. రామచంద్రయ్య (శాసనసభా నియోజకవర్గం): థాంక్యూ సార్. రాష్ట్రంలో మామూలుగా కరవు విలయ తాండవం చేస్తోంది. సహాయక చర్యలు దానికి ప్రపోర్షనేట్‌గా ఇనీషియేట్ చేయడంలో State Government appropriate efforts పెట్టలేకపోతోంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతాలలో లక్షలాది మంది వ్యవసాయదారులు, వ్యవసాయ కూలీలు వలసపోతున్నారు. ఈ వార్తలన్నీ ప్రతిరోజు పత్రికలలో ఫోటోలుగా, ఛానళ్ళలోను వస్తున్నాయి. కరవు అనేది ప్రకృతి వైపరీత్యం. మనం దానిని నివారించలేము.

కానీ, దానిని పసిగట్టి కనీసం రైతాంగానికి ముందస్తు హెచ్చరికలు ఇవ్వడం వలన వాళ్ళు ప్రత్యామ్నాయ పంటలకు వెళ్ళేటట్లుగా లేకపోతే వాళ్ళకి ఏమైనా ఫాడర్ లాండ్స్ కానీ, లేకపోతే ఏవైనా గంజి కేంద్రాలను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఎందుకంటే, ఈ ప్రాంతాలలో అది చాలా అరుదుగా ఉంటుంది. మా రాయలసీమ ప్రాంతాలలో ఇలా ఉంటోంది. మీరు కూడా రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చారు. ఇది ప్రతి సంవత్సరం జరుగుతూ ఉంటుంది. ముఖ్యంగా అప్‌లాండ్ ఏరియాలైన రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, చిత్తూరు జిల్లాలోని మదనపల్లి, అనంతపూర్ జిల్లాలో హిందూపూర్, కదిరి మొదలైన ప్రాంతాలలో ఫాడర్ కూడా లేని పరిస్థితి వచ్చేసింది. ఇది ప్రతి సంవత్సరం వస్తూనే ఉంది. 2014-15 సంవత్సరంలో దాదాపు 238 మండలాలను కేంద్రప్రభుత్వం కరవు మండలాలుగా ప్రకటించింది. 2015-16వ సంవత్సరంలో దాదాపు 664 మండలాలకు గాను, 359 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించింది. అంటే, 50 శాతం కంటే ఎక్కువ. The State was declared as a drought affected area. గత సంవత్సరం 2016-17వ సంవత్సరంలో 301 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించింది. రాయలసీమ ప్రాంతంలో దాదాపు 234 మండలాలు ఉన్నాయి. వాటిల్లో 2014-15లో 155 మండలాలు, 2015-16లో 212 మండలాలు, 2016-17లో 197 మండలాలు ఉన్నాయి. ఇది ప్రభుత్వమే ప్రకటించిన లెక్కలు. రబీ సాగు అయితే పూర్తిగా పడిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు నార్మల్ కన్నా 29 శాతం వర్షపాతం తగ్గింది. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా 10 శాతం వర్షపాతం పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో తగ్గింది. అంటే, మొత్తం మీద మనకు యావరేజ్‌గా 39 శాతం తేడా ఉంది. అంటే, ఎంత తీవ్రంగా కరవు పరిస్థితి ఉందో, అర్థం చేసుకోండి.

అధ్యక్షా, ఇందులో షార్ట్ టర్మ్ మెజర్స్, లాంగ్ టర్మ్ మెజర్స్ ఉన్నాయి. ప్రతి సంవత్సరం మనం దీని పైన చర్చిస్తున్నాము. పార్లమెంటులో ధరల పెరుగుదల గురించి ఏ విధంగా చర్చిస్తారో అదేవిధంగా కరవుకు సంబంధించి ప్రతి సంవత్సరం మనం చట్టసభలలో చర్చిస్తున్నాము. వలసలను నిరోధించేందుకు షార్ట్ టర్మ్ మెజర్స్‌ను ప్రతి సంవత్సరం కల్పించడం జరుగుతోంది. అలాగే, నరేగా కార్యక్రమం క్రింద దాదాపు 100 రోజుల పనిని కల్పించడం జరుగుతోంది. అంటే, పనిదినాలను 100లుగా ఇచ్చారు. కరవుకు సంబంధించి అయితే, ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ స్కీం క్రింద 150 రోజులు పనిదినాలు ఇవ్వాలి.

మ.12.10

ఈ దినం ఆంధ్రప్రదేశ్‌లో 46 రోజుల యావరేజ్ ఉంది. ఈ విధంగా ఉంటే వలసలు పోకుండా ఏ విధంగా ఉంటారు. లారీల లారీలు ప్రజలు వెళ్ళిపోతున్నారు. ఇక పశువుల విషయానికి వస్తే, దాదాపు 10,15 సంవత్సరాలు పశువులను పెంచి అమ్ముకొనే పరిస్థితి వచ్చిందంటే, ఆ రైతుకు ఇంతకన్న దౌర్భాగ్యం ఏం ఉంటుంది? ఈ రైతులకు పునరావాసం కల్పించాలి, దినకూలి కల్పించాలి, గంజి కేంద్రాలు పెట్టాలా, లేకపోతే, అడిషనల్‌గా ఫుడ్ సబ్సిడీ ఇస్తూ రైస్ ఇవ్వవలసి ఉంటుంది. కొన్ని ప్రాంతాలలో ఫ్రీగా సప్లయ్ చేయవలసి ఉంటుంది. కానీ, ఇక్కడ జరిగిందేమంటే ప్రభుత్వం తరఫు నుంచి, కలెక్టర్ల వద్ద నుంచి వచ్చిన నివేదికను సమ్మరైజ్ చేసిన తరువాత, దేనికి దేనికి ఎంత నిధులు అవసరం ఉందో ఒకసారి పరిశీలించాలి. కానీ, ఈ ఇన్‌పుట్ సబ్సిడీ ఇంతవరకు ఇవ్వలేదు. పంటలు నాశనం అయిపోయాయి. తరువాత పంటలు వేసుకోవడానికి ఇన్‌పుట్ సబ్సిడీ సఫిషియంట్‌గా ఇవ్వలేదు. అంటే, ఇక్కడ బ్లేమ్ గేమ్ ఆడటానికి నేను మాట్లాడటం లేదు. పరిస్థితి ఆ విధంగా ఉందని చెపుతున్నాను. ఏవైతే షార్ట్‌టర్మ్ మెజర్స్‌తీసుకోవాలో, వాటిని త్వరగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. అసలు వ్యవసాయ బడ్జెట్‌లో there is no reference about drought. కరవు గురించి గానీ, కరవు నివారణకు సంబంధించిన చర్యలు ఏమేమి తీసుకుంటామని గానీ, ఈ బడ్జెట్‌లో చెప్పలేదు. I don't find any use of submitting a separate Agricultural Budget in the absence of reference to the drought. వేరే రాష్ట్రంలో ఎవరో పెట్టారంటే, మన రాష్ట్రంలో కూడా ఒక ఫ్యాషన్‌గా పెడతామనేది కాదు. అది ఏ విధంగా మనకు ఉపయోగపడుతుందనేది

ప్రభుత్వం ఆలోచించవలసిన అవసరం ఉంది. దానిని యూజ్‌ఫుల్‌గా, పర్పస్‌ఫుల్‌గా చేయవలసిన అవసరం ఉంది. ఈ దినం అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలు దాదాపుగా అన్ని మండలాలు కరవు బారిన పడ్డాయి. ప్రకాశం జిల్లాలో అయితే ఈసారి అత్యధికంగా కరవు వచ్చింది. Short-term measures...whatever the help that is required for the persons to sustain, the Government has to make the arrangements immediately on war-footing basis.

అధ్యక్షా, సామాజికంగా దీని ప్రభావం ఎలా ఉంటుందంటే, పనిలేక ప్రక్క రాష్ట్రాలకు, ప్రక్కన ఉన్న జిల్లాలకు వెళ్ళి దొంగతనాలు చేసేటటువంటి పరిస్థితి ఉన్నది. ఎండాకాలంలో ప్రజలు బయట పడుకుంటారు. ఇది వాస్తవం. అందరికీ ఏ.సి గదులు లేవు. మా ప్రాంతాలలో అయితే, ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే 39 డిగ్రీల ఉష్ణోగ్రత దాటిపోయింది. అయితే, ఎవరూ కూడా నికృష్టమైన జీవితాన్ని గడపాలని అనుకోరు. ఎవరైనా దొంగతనాలు, దోపిడీలు చేసి బ్రతకాలని అనుకోరు. కానీ, వారు బ్రతకాలనుకుంటే ఇలా దొంగతనాలు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. అంటే ఎటువంటి పరిస్థితులకు ప్రజలు వస్తున్నారో ఒకసారి చూడండి. మనము సఫిషియంట్ ఫండ్స్‌ను అలొకేట్ చేయవలసిన అవసరం ఉంది. అఫ్‌కోర్స్ రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితి అనుకున్నంత ఆశాజనకంగా లేదు. ఇది అందరికీ తెలిసిన విషయమే. I don’t want to blame the Government. కానీ, మనం దానిని తెచ్చుకొనే శక్తి కూడా లేకుండా పోయిందనేదే బాధగా ఉంది. మహారాష్ట్రలో కరవుకి ఎంత మేరకు నిధులు ఇచ్చారు? తెలంగాణ రాష్ట్రంలో రూ.900 కోట్లు నిధులు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌కి రూ.600 కోట్లు ఇచ్చారు. మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో అయితే, It is in thousands. అంటే నేను బ్లేమ్ గేమ్ కాదు. కానీ, ఇది severe necessity. మనం కరవుకి కూడా నిధులు తెచ్చుకోలేనటువంటి పరిస్థితులలో ఉంటే ఇక ఏ విధంగా ఈ పరిస్థితిని ఎదుర్కొంటాము.

అధ్యక్షా, ఇక రెండవ అంశం ఏమిటంటే – కరవును నిత్యం లేకుండా చేయాలంటే, ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలి. మొత్తం upland areas డెల్టా ప్రాంతాలుగా మారిస్తే చేతి నిండా పని ఉంటుంది. ఇక కరవు వచ్చేటటువంటి అవకాశం ఉండదు. ఈ అంశంపై కోపగించుకోవద్దని ట్రెజరీ బెంచెస్‌కి చెబుతున్నాను. అధ్యక్షా, పంటలకి పిచికారీలు మొదలైనవి పనికి రావు. పిచికారితో నీళ్లు కొట్టి మనం పంటలను కాపాడుకోలేము. రెండు, మూడు సార్లు పిచికారి చేస్తే వాటివలన మనం పంటను కాపాడుకోలేము. అసలు పిచికారి చేయడానికి కూడా నీళ్లు లేవు. ఊరికే మనం చెప్పుకోవడానికే కానీ, ఏం ప్రయోజనం లేదు. పంటలను సేవ్ చేశామని ప్రభుత్వం చెప్పింది. In the course of next month, it has been declared as a drought affected area. మీరు ఒకసారి లాజిక్ చూడండి. ముఖ్యమంత్రి గారు పంటలను రెయిన్‌గన్స్ ద్వారా సేవ్ చేసేశామని అనంతపురం జిల్లాలో మూడు రోజులు ఉండి వచ్చేశారు. ఈ రెయిన్‌గన్స్ ద్వారా నీటిని పిచికారీ చేయడానికి కూడా నీళ్ళు లేవు. అక్కడ అటువంటి పరిస్థితులు ఉన్నాయి. కాబట్టి, ఇటువంటి కార్యక్రమాలలో ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉండాలి. మామూలుగా ఇచ్చేటటువంటి సమాధానాలు, లేకపోతే ఇంక వేరేవి చెప్పడం కాదు. ఈ సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, వాటికి పరిష్కారం ఏమిటి అనేది ఆలోచించాలి. ఈ సంవత్సరం ఇరిగేషన్‌కు ఎంత తక్కువగా కేటాయింపులు ఇచ్చారు?

అధ్యక్షా, ఇక పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి చూసినట్లయితే, దానికి నిధులు కేంద్రప్రభుత్వం నుంచి వస్తాయి. ఇక మిగిలిన ప్రాజెక్టులను ఎప్పటిలోగా పూర్తి చేస్తారు? గాలేరు– నగరి, హంద్రీ నీవా, వెలుగోడు ఇవన్నీ మెట్ట ప్రాంతాలలోను, కరవు ప్రాంతాలలోనూ వచ్చే ప్రాజెక్టులు. సర్‌ప్లస్ వాటర్ పైన ఆధారపడ్డ ప్రాజెక్టులు ఇవన్నీ. అధ్యక్షా, మన ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులను బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ యాక్సెప్ట్ చేయలేదు. మనం ఏం అడిగామంటే, మన రాష్ట్ర విభజనను దృష్టిలో పెట్టుకుని, నాలుగు రాష్ట్రాలకు నీటిని రీ–డిస్ట్రిబ్యూషన్ చేయమని అడిగాము. దానికి వాళ్ళు యాక్సెప్ట్ చేయలేదు. మనం ముందుగా వారికి

తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపించలేదు. అధ్యక్షా, మీరు ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. రెండుసార్లు నేను మిమ్మల్ని రిజల్యూషన్ పెడదామని బలవంతం చేశాను. ఎందుకంటే, తెలంగాణ రాష్ట్రం విడిపోయింది. ఈ మెట్ట ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని వాటర్ రీ-డిస్ట్రిబ్యూషన్ చేయమని చెప్పి ఒక తీర్మానం పెడదామంటే మీరు ఎవరూ ఒప్పుకోలేదు. అది ఎందుకు ఒప్పుకోలేదో నాకు తెలియదు. ఆ తరువాత తెలంగాణ రాష్ట్రం కోర్టుకి వెళ్లి ఫెయిల్ అయితే మనం కూడా కోర్ట్‌లో వేశాము. అంతవరకు కోర్టుకి వెళ్లాలని కూడా అనిపించలేదు. కృష్ణా నది నీటిపైన ఆధారం చేసుకున్న ప్రాజెక్టులు అన్నీ ఇప్పుడుండేటటువంటి అలొకేషన్ ఆఫ్ వాటర్‌లో పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి తెలుగు గంగ, హంద్రీ నీవా, గాలేరునగరీ అన్ని ప్రాజెక్టులకు అందులోంచి నీళ్ళు రావు. 854 అడుగుల వరకు నీరు ఉంటే మనకు వస్తుంది, లేకపోతే నీళ్లు రావు. కానీ, 854 అడుగుల్లోపు తగ్గిపోతోంది. కృష్ణా నది మాత్రమే కాదు, గోదావరి నది కూడా ఎండిపోయింది. దాదాపుగా 50 సంవత్సరాల్లో గోదావరి కూడా డ్రై అయిపోయింది. ఈ విధంగా కరవును పారద్రోలాలంటే లాంగ్‌టర్మ్ మెజర్స్ తీసుకుంటేనే గాని ఫలితం లేదు. లేకపోతే ప్రతి సంవత్సరం ఇలాగే మాట్లాడుకుంటాము, అరకొరగా నిధులు ఇస్తాము. ఈ కరవు వల్ల చచ్చే మనుషులు చస్తారు, పశువులు కూడా చనిపోతాయి. నిత్యం ఇది జరుగుతూనే ఉంటుంది. ఇరిగేషన్‌కు ఎందుకు ఇబ్బంది ఉందంటే ఫండ్స్ ఆగిపోయాయి. నేను ఒప్పుకుంటాను. ఈ సందర్భంగా ప్రభుత్వానికి నేను ఒక సజెషన్ ఇవ్వదల్చుకున్నాను. ఈ విషయంపై ప్రభుత్వం కొద్దిగా ఆలోచించాలి. లింకేజ్ ఆఫ్ రివర్స్‌లో గోదావరి నుండి నీటిని కృష్ణా, పెన్నా నదులకు డైవర్ట్ చేస్తున్నాము. పెన్నా నదితో కృష్ణా జలాలను అనుసంధానించడానికి గవర్నమెంట్ ప్లాన్ చేస్తున్నది. It is a good measure provided, it is achieved. ఒక ప్రాంతంలో లక్ష ఎకరాల ఆయకట్టు వస్తే, ఆ లక్ష ఎకరాల ఆయకట్టుకు ఫండింగ్ చేయడానికి మన గవర్నమెంటు ఫండింగ్ చేయవలసిన అవసరం లేదు. Banks are flooded with funds. బ్యాంకుల్లో నిధులు చాలా ఉన్నాయి. కేవలం ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు గ్యారెంటీ ఇవ్వాలి. ఆ ఆయకట్టు వచ్చేటటువంటి ప్రాంతంలో రైతుల దగ్గర ఎకరాకి ఇంత అని సెస్సు వసూలు చేయండి. Make an Act. అసెంబ్లీలో ఒక చట్టం చేసి, ఈ ప్రాంతంలో ఉండే లక్ష ఎకరాలకు గవర్నమెంటు వాటర్ ప్రొవైడ్ చేస్తుంది, మీరు ఎకరానికి ఇంత వాటర్ ఇవ్వండి. అది బ్యాంక్‌కి రీపే చేయండి. It is only a Legislative measure.

మ.12.20

మేము పార్లమెంటులో దీనికి ప్రతిపాదన చేశాము. చేసినప్పుడు అక్కడ various regional parties ఉంటాయి. కాబట్టి అవకాశం లేదు, ఒప్పుకోలేదు. కానీ, మన రాష్ట్రంలో ఒప్పుకోవచ్చు కదా? మనం మన రాష్ట్రంలో చేద్దాం. ఒక ప్రాంతంలో ఒక లక్ష ఎకరాలు ఉంది. ఆ లక్ష ఎకరాలకు ఒక ప్రాజెక్టు కడతాము. దాదాపుగా ఆ ప్రాజెక్టు రూ.1000 కోట్లు అవుతుంది. బ్యాంకులు లోన్స్ ఇస్తాయి. వాటికి రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుంది. టోల్ గేట్స్ దగ్గర ఏవిధంగా వసూలు చేస్తున్నారో, అదే విధంగా రైతుల దగ్గర నుండి వసూలు చేసి వారికి చెల్లించండి. 10 నుండి 12 సంవత్సరాలలో వారు తిరిగి చెల్లించేటట్లుగా చేస్తే ప్రాజెక్టు మనకు నిలిచిపోతుంది . తరువాత మనం ప్రాజెక్టును మెయిన్‌టైన్ చేసుకుంటాము. ఇదొక ప్రతిపాదన. దీనిని చాలా సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉంది. మన ముఖ్యమంత్రి గారు చాలా ఇన్నోవేటివ్‌గా చేస్తుంటారు.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు : అధ్యక్షా, కరవు మీద చర్చకు సంబంధించి మరికొంచెం సమయం ఇస్తే ప్రభుత్వానికి చక్కటి సలహాలు వస్తాయి. దయచేసి, మిగిలిన అంశాలకంటే కూడా దీనికి ఎక్కువ సమయం ఇవ్వాలని కోరుతున్నాను.

అధ్యక్షా, దురదృష్టం ఏమిటంటే కరవు అనేది ఆంధ్రప్రదేశ్‌ను పట్టి పీడిస్తున్నటువంటి ఒక ఇబ్బంది కరమైనటువంటి పరిస్థితి. మన రాష్ట్ర విభజన అయిపోయిన తరువాత, మన రాష్ట్రం అయితే కేవలం వ్యవసాయం మీదనే ఎక్కువగా ఆధారపడి ఉంది. మన రాష్ట్రంలో అధిక శాతం వ్యవసాయ ఆధారిత ప్రాంతం ఉంది. మనకున్నటువంటి ఈ 13 జిల్లాలలో వ్యవసాయ పరిస్థితులు, వర్షపాతం లేకపోతే పంటల సాగు, పంటల దిగుబడులు, ఆ పండిన పంటలకు వచ్చేటటువంటి.....

(At that juncture, the Hon'ble Deputy Chairman in the Chair)

శ్రీ సి. రామచంద్రయ్య : ఒక ఐదు నిముషాలు ముందు వచ్చి ఉంటే, I would have been the beneficiary.

MR. DY. CHAIRMAN: Why?

SRI C. RAMACHANDRAIAH: Then, you might have allotted more time to me and I need not request the Chair for allotting some more time.

శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుః అక్కడ తగ్గించినది ఇక్కడ నాకు యాడ్ చేయండి. టోటల్‌గా అది కాంపన్‌సేట్ అవుతుందేమో. అధ్యక్షా, పై అంశాలకు సంబంధించి మనం ఒకసారి కూలంకషంగా ఆలోచించుకున్నట్లయితే, ఈ సంవత్సరం 13 జిల్లాలలో కరవు మండలాలను ఒకసారి చూస్తే చాలా దారుణమైన పరిస్థితులు కూడా ఉన్నాయి. వరుసగా 2014-15 సంవత్సరాల నుంచి చూస్తుంటే, రాష్ట్రంలోని దాదాపు 664 కరవు మండలాలకు గాను, 2014-15లో కరవు మండలాలుగా ప్రకటించినవి 238 మండలాలు. అంటే, 35.8 శాతం మండలాలు కరవుతో కొట్టుమిట్టాడుతున్నాయి. దాని తరువాత 2015-16వ సంవత్సరంలో అది 359 మండలాలకు పెరిగింది. అంటే దాదాపుగా 54 శాతానికి కరవు పెరిగింది. సగంపైన ప్రాంతాలన్నీ కూడ కరవు మండలాలుగా ఉన్నాయి. 2016-17 సంవత్సరంలో కూడా దాదాపు 301 కరవు మండలాలుగా ఉన్నాయి. అంటే, 45.33 శాతం మండలాలను కరవు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. అంటే, వాస్తవంగా చూస్తే, ఆ ప్రాంతంలోని ప్రజానీకం గానీ, ప్రజా ప్రతినిధులు కానీ, కేవలం ప్రభుత్వం ప్రకటించిన మండలాలు కాకుండా ఎక్కువ మండలాలలోను, ఎక్కువ ప్రాంతాలలోను కరవు ఉంది. ఇంకా ఎక్కువ మండలాలను కరవు మండలాలుగా ప్రకటించమని ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురావడం జరుగుతోంది. ఈ సంవత్సరం అయితే దాదాపు 400 మండలాల వరకు కరవు ఉందని చెప్పే రిప్రజెంటేషన్లు ప్రభుత్వానికి వస్తున్నాయి. అయితే, కేవలం 301 మండలాలను మాత్రమే కరవు మండలాలుగా ప్రకటించారు. ఇది ఇంతవరకు రాష్ట్రం మొత్తం మీద అయితే, రాయలసీమ ప్రాంతంలోని 4 జిల్లాలలోని మండలాలను చూస్తే, కరవు ఎంత దారుణంగా ఉందంటే, ఈ నాలుగు జిల్లాలలోని దాదాపు 234 మండలాలు కరవు బారిన పడ్డాయి. వీటిల్లో 2014-15వ సంవత్సరంలో అయితే, దాదాపు 155 మండలాలు అంటే, రాయలసీమ మండలాలను 66 శాతం కరవు మండలాలుగా ప్రకటించారు. 2015-16వ సంవత్సరంలో అయితే, 212 మండలాలను అంటే 90.5 శాతం మండలాలను కరవు మండలాలుగా ప్రకటించారు. అంటే, దాదాపు రాయలసీమ ప్రాంతంలోని నాలుగు జిల్లాలు కూడా దుర్భర కరవు పరిస్థితులలో ఉన్నాయి. 2016-17లో, 197 మండలాలు అంటే దాదాపుగా 87 శాతం మండలాలు కరవులోనే కొట్టుమిట్టాడుతున్నాయి. అక్కడ చాలా తీవ్రమైన పరిస్థితులు ఉన్నాయి.

అధ్యక్షా, తమ ద్వారా ఇంత వివరంగా సభ దృష్టికి తీసుకువచ్చానంటే, కరవు అనేది పెరుగుతోందే తప్ప ఎక్కడా తగ్గడం లేదు. ఇంక ఈ సంవత్సరం మూడు జిల్లాలు అయితే జిల్లాలకు జిల్లాలే కరవు జిల్లాలుగా ప్రకటించడం జరిగింది. అనంతపురం, చిత్తూరు, ప్రకాశం జిల్లాలలో అన్ని మండలాలను అంటే, జిల్లాలకు జిల్లాలనే కరవు జిల్లాలుగా ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. అయితే, ఇందులో మనం చూస్తే, ఈ కరవు మండలాలు ఒక ప్రక్కన చాలా threat-force చేసి ఉంటే మరొక ప్రక్క బీడు పొలాలు కూడా

చాలా ఉన్నాయి. ఈ సంవత్సరం నీళ్ళు లేకపోవడం కానీ, కాలువలలో నీళ్ళు తగ్గడం కానీ, లేకపోతే వర్షాభావం వల్ల కానీ, ఈ సంవత్సరం దాదాపుగా 10 లక్షల హెక్టార్లు బీడుపొలాలుగా ఉన్నాయి. మరొక 10 లక్షల హెక్టార్లు వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితులు కూడా ఉన్నాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని నేను ఉజ్జాయింపుగా లెక్కలు వేస్తే, రైతు కూలీలకు, పొలాల మీద ఆధారపడినటువంటి వ్యవసాయ కూలీలకు ఆదాయం ఎంత నష్టమో ఆలోచించండి. 10 లక్షల బీడు పొలాలు ఉంటే, వాటిల్లో సగటున ఒక్కొక్క కూలీకి 100 రోజుల పని పెట్టే పరిస్థితి వస్తే, దాదాపుగా వారికి రావలసిన రూ.3,000 కోట్లు ఆదాయం నష్టం వస్తోంది. అదే ఎండిపోయిన పొలాలు చూస్తే, కొన్ని రోజులు పని ఉండి, మరికొన్ని రోజులు పని లేకపోతే, సగటున 50 రోజులు పని లేకపోయినా కూడా దానికి సంబంధించి వారికి దాదాపు రూ.1500 కోట్ల ఆదాయం నష్టం వస్తోంది. బీడు పొలాలు ఉండడం వలన కానీ, పంటలు ఎండిపోయిన కారణంగా కానీ, వారికి దాదాపుగా రూ.4,500 కోట్లు ఉపాధి వలన రావలసిన డబ్బు రావడం లేదు. తద్వారా వారికి ఆదాయం లేక పేదరికంలో ఉండిపోతున్నారు.

అధ్యక్షా, వీటికి తగ్గట్లుగా ఎన్‌జిఆర్ఐ క్రింద వారికి ఉపాధిని ఏ మేరకు కలగజేశారనేది ఒకసారి పరిశీలిస్తే, అది కూడా అంత ఆశాజనకంగా మాత్రం లేదు. సంవత్సరాల వారీగా చూసుకుంటే ఒక్కొక్కరికి 100 రోజులు పనిదినాలు కల్పిస్తుంటే, సగటు వచ్చేసరికి 46 పనిదినాలే ఒక్కొక్క కూలీకి వచ్చిన దాఖలాలు ఉన్నాయి. దీనిలో కూడా 46 రోజులకు, దీనికి గౌరవ మంత్రిగారు కరక్టు చేయాలి. వారందరికీ దాదాపు రూ.300 కోట్లు బకాయిలు ఉన్నట్లుగా సమాచారం ఉంది. ఇది పని చేసిన కూలీలకు సంబంధించినది. ఇది వాస్తవమో, కాదో నాకు తెలిసిన అంకెల ప్రకారం చెప్పాను. అది కూడా మనం ఒకసారి చూసుకోవలసినటువంటి పరిస్థితి ఉన్నది. ఈ కరవు మండలాలు, కరవు పరిస్థితులు ఈ విధంగా ఉంటే, పంటలు వేసినటువంటి తీరు చూస్తే, సాగు చేసేటటువంటి భూములు 2014-15వ సంవత్సరంలో సహజంగా మనకున్నటువంటి సగటు సాగు భూమి 43.86 లక్షల హెక్టార్లు సాధారణ సాగు అవ్వాలి. అయితే, 2014-15వ సంవత్సరంలో 40.96 శాతం సాగు అయ్యింది. అంటే, -2.96 శాతం అంటే, 93 శాతం వరకే సాగు అయ్యింది. 2015-16వ సంవత్సరంలో 36.34 శాతం భూమిని ఖరీఫ్ సాగు నిమిత్తం సాగు చేయడమయింది. అంటే, 83 శాతం మాత్రమే. 2016-17వ సంవత్సరం వచ్చేసరికి 88 శాతం, అంటే 38.62 లక్షల హెక్టార్లు దానికి సాగు అయ్యింది. అంటే -5.24 శాతం సాగు అయ్యింది. రబీ సాగులో అయితే, 27.26 లక్షల హెక్టార్లే సాగు కావలసి ఉంటే, 2014-15వ సంవత్సరంలో 23.19 లక్షల హెక్టార్లు, 2015-16లో 22.76 లక్షల హెక్టార్లు, 2016-17లో 19.4 లక్షల హెక్టార్లు ఉన్నది. ఈ విధంగా మన రాష్ట్రంలో పంట సాగు పూర్తిగా దిగజారిపోయిన పరిస్థితి ఉన్నది.

మ. 12.30

అధ్యక్షా, ఇందులో ఒకసారి దిగుబడులను కనుక పరిశీలిస్తే, ఈ సంవత్సరం చాలా బాగా దిగుబడులు ఉన్నాయని మనం చెప్పుకున్నటువంటి నేపథ్యంలో, ఆ దిగుబడులు మనకు ఆశాజనకంగా మాత్రం లేవు. ఆహారధాన్యాల దిగుబడులు చూసినట్లయితే, అవి బాగా తగ్గిపోయినటువంటి పరిస్థితి ఉన్నది. 2014-15వ సంవత్సరంలో 160 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాలు పండాయి. మనకు పంటలు బాగా పండితే, ఆ సంవత్సరం బాగా పంటలు పండాయని అనుకున్నాము. 2015-16లో 143.78 లక్షల మెట్రిక్ టన్నులకు దిగుబడి పడిపోయింది. 2016-17వ సంవత్సరం చూస్తే 156.85 లక్షల మెట్రిక్ టన్నులు పండింది. గత సంవత్సరం కంటే కొంచెం మెరుగ్గా ఉన్నా కూడా 2014-15వ సంవత్సరంతో పోల్చి చూసుకుంటే, 160 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 156.85 లక్షల మెట్రిక్ టన్నుల పంట పండింది. అంటే రానురాను ఆహారధాన్యాల దిగుబడి పడిపోతోంది.

అధ్యక్షా, మన రాష్ట్రంలో ప్రధాన పంట వరి. ఆ వరిసాగు కనుక చూసినట్లయితే, దాదాపుగా 17.5 లక్షల హెక్టార్లలో వరి సాగు కావలసి ఉంటే, కేవలం 14.7 లక్షల హెక్టార్లలో మాత్రమే వరి పంట సాగయ్యింది. ఈ సంవత్సరం ఒక్క మిర్చి పంట తప్ప, గత సంవత్సరం ధరలు బాగా ఉన్నాయని, మిర్చిలో కొన్ని ప్రాంతాల వారీగా ధరలు పెరిగాయి కానీ, మిగతా అన్ని ప్రాంతాల పంటలన్నింటిలో దాదాపు పంట విస్తీర్ణం తగ్గింది. కేవలం విస్తీర్ణం తగ్గడం ఒకటే కాదు, దురదృష్టం ఏమిటంటే, ఈ సంవత్సరం పండించిన ఆహారధాన్యాలకు రేట్లు మాత్రం పడిపోయాయి. అందుకనే ఈ మధ్య వ్యవసాయ శాఖా మంత్రిగారి సమాధానంలో ఆహార ధాన్యాల ధరలు బాగానే ఉన్నాయని చెపుతూ సంతృప్తిని వ్యక్తం చేశారు. గత 10 సంవత్సరాల పంటల ధరల సగటు వేసుకుంటే, ఈ సంవత్సరం బాగానే ఉన్నాయి, పెద్ద తేడా ఏమీ లేదని వారు అన్నారు. అధ్యక్షా, నేను కూడా వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినే. నేను వ్యవసాయ శాస్త్రం చదువుకున్నాను. గత 10 సంవత్సరాలలో పంటల పెట్టుబడులను కనుక మనం చూసుకుంటే, సంవత్సరానికి 7 నుంచి 13 శాతం పెట్టుబడులు ఎక్కువయ్యాయి. మనకు పంటలు పెరగలేదు. పెట్టుబడులు మాత్రం ఆ రకంగా పెరిగాయి. అలా అని దీనిలో ధరలు ఎక్కడ చూసినా కూడా ఈ స్వామినాథన్ కమిటీ సిఫారసులు కానీ, కనీస మద్దతు ధరల పెంపు కానీ చూస్తే, 3.25 శాతం మాత్రమే కనీస మద్దతు ధరలు పెరిగాయి. పెట్టుబడులు పెట్టిన మేరకు ఈ పంటల ఉత్పత్తులు పెరగడం లేదు. ఒక్కొక్కసారి ద్రవ్యోల్బణం చూసుకుంటే 5 నుంచి 8 శాతం వరకు ఉంది. ఈ ద్రవ్యోల్బణానికి తగ్గట్టుగా ధరలు పెరుగుతున్నాయా అంటే, అవి పెరగడం లేదు. అందుకని, చాలాసార్లు దీనిగురించి పంటలు పండాలి, రైతుకు వ్యవసాయం ద్వారా ఆదాయం రావాలంటే, రెండు, మూడు విషయాలను మనం చాలా స్పష్టంగా ఆలోచించాలి.

అధ్యక్షా, రైతులు పంటలలో పెట్టుబడి ఎంత పెట్టారో, వ్యవసాయంలో ఎంతైతే రైతులు కష్టపడతారో, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీలో పంటలకు గిట్టుబాటు ధరలు వస్తేనే అది నికర ఆదాయం అవుతుంది. ఎకరానికి 30 బస్తాలు పంట పండి, ఒక్కొక్క బస్తాకి దాదాపు రూ.2,000ల చొప్పున ఆదాయం వస్తే, రూ.60,000లు ఆదాయం వస్తుంది. 30 బస్తాల పంట పండినా వాటి ధర రూ.1,500 ఉంటే, ఆదాయం రూ.15,000లకు పడిపోతుంది. అందువల్ల పంటలు పండడం ఒక ఎత్తైతే, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావడమనేది మరొక ఎత్తు.

అధ్యక్షా, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో ప్రభుత్వం అనేక కమిటీలను వేయడం జరిగింది. వాటిల్లో స్వామినాథన్ గారి కమిటీ ఒకటి. అసలు ఆ కమిటీ సిఫార్సులు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియదు. 2005వ సంవత్సరంలో కేంద్రప్రభుత్వం ఈ కమిటీని వేసింది. 2006వ సంవత్సరంలోనే ఆ కమిటీ నివేదిక కూడా ఇచ్చింది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చెప్పాయి. రైతుకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా, లాభసాటి వ్యవసాయం చేయాలని, ఈ దేశానికి ఆహారభద్రత కలుగచేయాలని, అతను కూడా బ్రతకాలని, అతని పిల్లలు సక్రమంగా ఉండాలని, అతని కుటుంబపోషణ సక్రమంగా ఉండాలని అనుకుంటే వ్యవసాయంలో ఆదాయం రాకుండా ఉంటే మాత్రం దానివల్ల ఉపయోగం లేదు. ఈ దిశగా ప్రభుత్వం తగిన ఆలోచనలు చేయాలి. అందువలనే మిగిలిన రాష్ట్రాలుకూడా వాళ్ళ బడ్జెట్‌లో కనీసం 10 శాతానికి ఎక్కువగా కేటాయించారు. ఈనాడు మన దేశంలో కానీ, రాష్ట్రంలో కానీ, 67 శాతం వరకు జనాభా ఈనాటికి కూడా వ్యవసాయం మీదనే ఆధారపడుతున్నారు. అసలు బడ్జెట్‌లో కేటాయింపులు ఎంత ఇస్తున్నాం సార్? ఈ సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 5.9 శాతం మాత్రమే వ్యవసాయ రంగానికి కేటాయించారు. ఆ కేటాయింపుల్లో ఏమిచ్చారు, ఏం కలిపారు అంటే ఋణమాఫీని కూడా తీసుకువచ్చి, దాదాపు రూ.3,600 కోట్లు వ్యవసాయ బడ్జెట్‌లో కలిపారు. అది రెవెన్యూ వారికి, ఫైనాన్స్ డిపార్టుమెంటు వారికి పోవలసిన కేటాయింపు. అంతేకానీ, ఈ వ్యవసాయ కేటాయింపుల్లో సేద్యం చేసేటటువంటి ఈ ఖర్చుల్లో మాత్రం కాదు. దీనిలో మరొక కోణం కనుక చూసినట్లయితే, రేట్లు

పడిపోవడమే కాకుండా, వీటి పర్యవసానం ఏమిటండీ? ఎప్పుడైతే కరవు వస్తుందో, ఎప్పుడైతే కరవు మండలాలు ప్రకటించబడుతున్నాయో, ఎప్పుడైతే ఆదాయం తగ్గుతుందో చూడాలి. ఎందుకంటే, ఆకలి అనేది ప్రతి వాళ్ళకి ఒకటే. కోట్లు ఉన్న వాళ్ళకి అయినా ఆకలి ఒకటే. కడు పేదవాడికి అయినా ఆకలి ఒకటే. ఆకలిని చల్లార్చుకోవటానికి వాళ్ళు చేసేదేమిటి? స్థానికంగా వాళ్ళకి ఎక్కడా ఉపాధి లేకపోతే, వలసలు పోతున్నారు. ఈ సంవత్సరం వలసలు ఎంతండీ? ఎంత దారుణంగా ఉన్నాయి? ప్రత్యేకంగా అనంతపూర్ కానీ, మిగతా జిల్లాలను చూస్తే, దాదాపు నాలుగు లక్షల మంది వరకు పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళ్ళారు. వాళ్ళు అక్కడ పేవ్‌మెంట్ మీద పడుకుని, కొందరు బిచ్చగాళ్ళలాగా ఉన్నారు. ఇంతకు ముందు శ్రీ సి. రామచంద్రయ్యగారు చెప్పినట్లుగా కొంతమంది వేరే మార్గాలను అనుసరించారు. ఏదోవిధంగా నాలుగు రూపాయలు సంపాదించుకోవడం, ఆకలి తీర్చుకోవడం అనే పరిస్థితులలో ఉన్నారు. ఎంతో దారుణమైన పరిస్థితులలో వారు వలసలు పోతున్నారు. దాని గురించి ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవడం లేదు.

అధ్యక్షా, దురదృష్టం ఏమిటంటే నిన్న, మొన్న మీడియాలో కొన్ని వార్తలు వినపడ్డాయి. అవి ఏమిటంటే – ఈ వలస వెళ్ళిన రైతులు మాదకద్రవ్యాలకు అలవాటు పడిపోతున్నారనే వార్తలు వచ్చాయి. ఆ రైతాంగంలో ఇబ్బందులు రావడం లేదన్న హామీలు ప్రభుత్వం వద్ద నుంచి వస్తుంటే, ఇది చాలా దారుణమైన పరిస్థితి ఉంది. అదేవిధంగా, ఇక్కడ వసతులు చాలక, మెరుగైన వసతుల కోసం కూడా వలసలు పోతున్నారనే మాట అన్నారు. ఇది ఎంత దారుణమైనదో ఒకసారి ప్రభుత్వం ఆలోచించాలని తమ ద్వారా కోరుతున్నాను. ఈ పరిస్థితులలో మనం దీర్ఘకాలిక ప్రయోజనాలు ఎట్లా, ఏమిటి అనేది చూసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ దీర్ఘకాలిక ప్రయోజనాల గురించి సభ్యులు సి. రామచంద్రయ్య గారు వివరంగా చెప్పారు. ఆ విధంగా మనకున్నటువంటి నీటి వనరులను ఎట్లా సద్వినియోగం చేసుకోవాలన్నది చూడాలి. అవసరమైతే మనం పోరాడైనా మన రాష్ట్రానికి తెచ్చుకోవాలి. బ్రిజేష్ కుమార్ కమిటీ సిఫారసులలో మనకు అన్యాయం జరిగింది. దానిని మనం సక్రమంగా ఛాలెంజ్ చేసుకోలేకపోతున్నాము. వాటిని సక్రమంగా తెచ్చుకోలేనటువంటి పరిస్థితి అక్కడ ఉన్నది. గతంలో మనకు రెండు రాష్ట్రాలు ఉండేవి. ఇప్పుడు మూడవ రాష్ట్రం వచ్చింది. ఇప్పుడు మనం మూడు రాష్ట్రాలతోను పోరాడవలసిన పరిస్థితి ఉంది. గోదావరి నదికి సంబంధించైతే, పొరుగున ఉన్న మహారాష్ట్రతో కూడా మనం పోరాడవలసిన అవసరం ఉంది. అందులో మనకు రావలసినటువంటి వాటాను మనం దక్కించుకునే ప్రయత్నంలో ప్రభుత్వం అకుంఠిత దీక్షతో పనిచేయాలి. ఇప్పుడున్న ప్రభుత్వం ఒక్కటే కాదు, రాబోయే ప్రభుత్వాలు కూడా మనకు రావలసిన నీటి కోసం పోరాడాలి. ఎందుకంటే, ప్రస్తుతం ఆ నీటి విషయాల్లో మనం సమర్థవంతంగా పోరాడి, నికర జలాలను మన రాష్ట్రానికి తెచ్చుకోవడంలో విఫలం చెందామనే ఆలోచన నాకు ఉన్నది సార్. అందువలనే, ఈరోజున రైతాంగం, రాష్ట్రంలోని కరవు మొదలైన వాటన్నింటి గురించి ఆలోచించివలసిన అవసరం ఎంతైనా ఉంది.

మ.12.40

రాష్ట్రం తీవ్రమైన కరవు పరిస్థితుల్లో ఉన్నది. దీనికి మనం అడ్డుకట్ట వేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం బడ్జెట్ కేటాయింపులు పెంచామని అన్నారు. గత సంవత్సరం వ్యవసాయానికి సవరించిన బడ్జెట్ ప్రకారం రూ.8,496 కోట్లు. ఈ సంవత్సరం రూ.9,900 కోట్లు పెంచామని అన్నారు. పెంచలేదు అధ్యక్షా. గత సంవత్సరం టోటల్ బడ్జెట్‌లో వ్యవసాయానికి చూస్తే 6.4 శాతం ఉండగా, ఈ సంవత్సరం టోటల్ బడ్జెట్‌లో వ్యవసాయానికి 5.79 శాతం కేటాయించారు. రాష్ట్రంలో 60 శాతం వ్యవసాయం మీద ఆధారపడిన వారు ఉన్నప్పుడు బడ్జెట్‌లో వ్యవసాయానికి పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

పశుగ్రాసం లేక పశువులు ఇబ్బంది పడుతున్నాయి. ఎండుగడ్డిని ఎక్కడో కొనుక్కుని వాళ్ల ప్రాంతాలకు బళ్లమీద తీసుకువెళుతున్నారు. ఈ సంవత్సరం ఒక్కో ఎకరం ఎండుగడ్డిని రూ.8,000లు నుండి రూ.10,000లకు అమ్ముతున్నారు. ప్రభుత్వం గతంలో పశుగ్రాసం కొరకు జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పింది. పశుగ్రాసం కొరకు ఫాడర్ బ్యాంకులు, క్యాటిల్ హాస్టల్స్ ఓపెన్ చేస్తామని చెప్పారు. ఇప్పుడు ఎక్కడ ఉన్నాయి? మంచినీటి సరఫరా సక్రమంగా ఉందా? ఫాడర్ సప్లై ఉందా?

అధ్యక్షా, రెయిన్ గన్స్ ఎక్స్‌పెరిమెంట్ కేవలం మైక్రో ఇరిగేషన్‌లో మాత్రం వాడేవాళ్లు. మిగతాచోట్ల రెయిన్‌గన్స్ ఎక్కడా కూడా సక్సెస్ అయిన దాఖలాలు లేవు. మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఇజ్రాయిల్ వెళ్లి డ్రిప్ ఇరిగేషన్ వంటి విషయాలను అధ్యయనం చేసి, నీళ్లు తక్కువగా ఉన్నప్పుడు వాటిని సమర్థవంతంగా ఎలా వాడుకోవాలనేదానిని చూశారు. ప్రతి నీటి బొట్టును ఏ విధంగా వినియోగించుకోవాలనేది క్యాలిక్యులేట్ చేస్తున్నారు. వాటివరకు సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తే బాగుంటుంది తప్ప ఇవాళ రెయిన్ గన్స్‌తో పిచికారీ అనే ప్రక్రియ సక్సెస్‌ఫుల్ కాలేదు. ఇదేదో ప్రచారానికి పనికివస్తున్నది తప్ప మరేమీ లేదు. అనంతపురంలో 9 లక్షల హెక్టార్లలో వేరుశనగ పంట వేస్తే, దాదాపు 80, 85 శాతం ఎండిపోయింది. రెయిన్ గన్స్ వాడినప్పటికీ ఎండిపోయింది. ఆ డబ్బును వేరే దానికి ఉపయోగిస్తే బాగుండేది. నాకు పేరు గుర్తుకు రావడం లేదు గానీ, రాజస్థాన్‌లో ఎడారిలో ఒకరు నీటిని ఏ విధంగా దాచుకుని వినియోగించాలో ప్రాక్టికల్‌గా చూపించారు. వర్షపాతం బాగా తక్కువ ఉన్నచోట ఆ విధంగా చేసి చూపించారు. అటువంటి టెక్నాలజీని, మేధోసంపదను మనం కూడ వినియోగించుకుని అనంతపురం వంటి ప్రాంతాలలో తక్కువ వర్షపాతం ఉన్నచోట ఉపయోగించుకోవాలి. అనంతపురం వంటి జిల్లాలో ప్రయోగాత్మకంగా మనం ఎందుకు చేయకూడదు? ఆ విధంగా చేసినట్లయితే భూగర్భ జలాలు కూడ పెరుగుతాయి. అటువంటి ప్రయోగాలు చేసి ఈ రాష్ట్రంలో కరవు నివారణకు చర్యలు తీసుకోవాలి.

కేంద్రప్రభుత్వం వెనకబడిన జిల్లాలకు సంవత్సరానికి రూ.50 కోట్లు ఇస్తుందని తృప్తిపడి ఊరుకుంటే సరిపోదు. దానికి రెండింతలు మ్యాచింగ్ గ్రాంట్‌ను పెట్టి కరవు నివారణకు ప్రయత్నం, వెనకబడిన జిల్లాల్లో జాగ్రత్తలు తీసుకుంటేనే ప్రజానీకం సుభిక్షంగా ఉంటారు, వలసలు పోకుండా ఉంటారు. అధ్యక్షా, రైతుల ఆత్మహత్యలు ఏ రోజుకారోజు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వమేమో ఆత్మహత్యలను తక్కువగా చూపిస్తున్నది. దానికి అనేక కారణాలున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, నేషనల్ క్రైమ్ రిపోర్టు బ్యూరో ఇచ్చిన లెక్కలను పరిగణనలోకి తీసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నాను. ఈ కరవు మండలాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిందిగా మేము డిమాండ్ చేస్తున్నాము.

శ్రీమతి పమిడి శమంతకమణి : అధ్యక్షా, ఈ నూతన రాజధాని శాసన పరిషత్తులో తమరిని ఆ స్థానంలో చూడడం నాకు సంతోషంగా ఉన్నది. కరవుపై మాట్లాడేందుకు నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు.

అనంతపురం జిల్లా వాసిగా ముఖ్యంగా నిరంతరం కరవుతో బాధపడే పౌరురాలిగా నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మరొకసారి ధన్యవాదాలు. మా జిల్లాలోని ప్రజలు వరదలకు భయపడరు. ఎందుకంటే, మాకు వరదలు రావు. సునామీలు అసలే రావు. చలికి కూడ భయపడరు. కేవలం కరవుకు భయపడుతున్నారు. అక్కడ ఉన్న వాతావరణం అటువంటిది. వర్షపాతం చాలా తక్కువగా ఉంటుంది. దేశంలో జైసల్మేర్ తరువాత అనంతపూర్‌లోనే అతి తక్కువ వర్షపాతం ఉంటుంది అనడంలోనే కరవు యొక్క బాధ ఎటువంటిదో తమకు అర్థమవుతుంది అధ్యక్షా. జిల్లాలో ఉన్న 63 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించారు అంటేనే అర్థమవుతుంది. కరవు విలయ తాండవాన్ని చూసి, అక్కడ పరిస్థితులను చూసి 63 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించారు. ఏది ఏమైనా ఈ నూతన రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి శ్రీ

నారా చంద్రబాబు నాయుడు గారు కరవును పారద్రోలాలనే సంకల్పంతో కరవు నివారణా చర్యలు చేపట్టడం జరిగింది.

అధ్యక్షా, మొట్టమొదటగా మా అనంతపురం జిల్లాకు రుణమాఫీ చాలా మేలు చేసింది. మన ముఖ్యమంత్రిగారు సుదీర్ఘ పాదయాత్ర చేసినప్పుడు 17 రోజులు అనంతపురంలో పర్యటించడం జరిగింది. అప్పుడు అక్కడున్న పంటల పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలు స్వయంగా చూశారు. ఆయన మేధ ఒక కంప్యూటర్ అని నేను భావిస్తాను. ఆయనకు తెలియని విషయమంటూ ఏదీ లేదు. ఆయన పాదయాత్ర చేస్తూ అక్కడ దారి పక్కనున్న పంట పొలాలలోకి వెళ్లి రైతులను పరామర్శించి మీకు ఏం కష్టం ఉన్నది అని అడిగేవారు. ఈనాడు ఇక్కడ మాట్లాడిన వారు దానికి ఇంత కేటాయించవచ్చు, దీనికి ఇంత కేటాయించకూడదా అని అడిగారు. అసలు రూ.16,000కోట్లు లోటు బడ్జెట్ ఉన్నా ముఖ్యమంత్రిగారు తీసుకున్న చర్యలు చాలా గొప్పవి. అధ్యక్షా, కాంగ్రెస్‌కు ఒకే ఒక మగదిక్కు ఉన్నది. వైయస్ఆర్‌కు ఒక పెద్ద దిక్కు ఉన్నది. ఈ ఇద్దరు ఇగ్గలేక ఇగ్గలేక బండిని నడుపుతున్నారు. అయినా వాళ్లెవరు? మా పార్టీ నుండి వెళ్లినవారే. ఆత్మ ఇక్కడుంది, కట్టె అక్కడుంది. అంతే. ఏదో మమ్మల్ని విమర్శించాలి, మా యొక్క ఉనికిని కూడా చూపించాలి అని మాట్లాడుతున్నారు. ఏమన్నా, మమ్మల్ని దూరం పెట్టారు అని మాకు ఒకసారి జ్ఞాపకం చేయడానికి మాట్లాడుతున్నారు. మాకు సూచనలు ఇస్తున్నారు. ఆ విమర్శలను మేము సద్వినియోగపరుచుకుంటాము.

కరవును పారద్రోలాలనే ముఖ్యోద్దేశముతో మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు నదులను అనుసంధానం చేశారు. అది చాలా చరిత్ర. ఆనాడు కాటన్ దొరగారు గోదావరి పరిసరాలను చూసి ధవళేశ్వరం దగ్గర ప్రాజెక్టును కడితే బాగుంటుందని అక్కడ ప్రాజెక్టును కట్టారు. వృధాగా సముద్రంలో కలిసే నీటిని సద్వినియోగం చేసుకోవాలి, పోలవరం డ్యాం కట్టే లోపల ఆ నీటిని ఎందుకు వృధా పరచాలి అనే ఒక మంచి ఉద్దేశంతో పట్టిసీమను నిర్మించడం జరిగింది. నేను ప్రభుత్వానికి విన్నవించేదేమంటే ధవళేశ్వరం దగ్గర గోదావరి బ్యారేజీ కట్టినందుకు కాటన్ దొరగారికి ఒక విగ్రహాన్ని పెట్టడం జరిగింది. ఎందుకంటే ఈయన వల్ల ఈ ప్రయోజనం కలిగింది అని భావి తరాలకు తెలియడం కోసం విగ్రహాన్ని పెట్టడం జరిగింది. అలాగే, చంద్రబాబునాయుడు గారి విగ్రహాన్ని పట్టిసీమ దగ్గర పెట్టించాలి. పట్టిసీమ ద్వారా సముద్రంలోకి వృర్థంగా పోయే నీటిని మళ్లించి కృష్ణాకు అనుసంధానం చేసి శ్రీశైలం ద్వారా రాయలసీమకు నీళ్లందించడం చాలా గొప్ప విషయం.

నాగార్జునసాగర్ మీరు కట్టారా, శ్రీశైలం మీరు కట్టారా అని అడిగారు అధ్యక్షా. మేమేమన్నా గుడ్డోళ్లమా, పిచ్చోళ్లమా? అలా ఎందుకు అంటాము అధ్యక్షా? శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ గారి పాలనలో నాగార్జున సాగర్ ప్రాజెక్టును కట్టడం జరిగింది. శ్రీ నీలం సంజీవ రెడ్డి గారి పుణ్యమా అని శ్రీశైలం డ్యాం కట్టడం జరిగింది.

మ.12.50

కానీ, ఇప్పుడు అవి చెప్పుకుని వీళ్లు తృప్తిపడుతున్నారు. మా ప్రాంతంలో "మా తాతలు నేతులు త్రాగారు, మా మూతులు వాసన చూడండి" అనే ఒక సామెత ఉంది. మా మూతులు వాసన చూడమని చెబితే, ఇప్పుడు ఏముంది, ఏమీలేదు. కేవలం విమర్శలు మాత్రమే చేస్తున్నారు. రాష్ట్ర విభజన ఎలాగూ జరిగిపోయింది. ఈనాడు ఇన్ని విమర్శలు, ఇన్ని సలహాలు ఇస్తున్న పెద్దలు ఆనాడే విభజన జరిగిన మరుసటి రోజే కట్ట కట్టుకుని ఢిల్లీకి వెళ్లి, "అమ్మా, నువ్వు రాష్ట్రాన్ని విభజించావు, ఆర్థిక వనరులన్నీ వాళ్లకే ఇచ్చావు, సంపదంతా అక్కడే పెట్టావు, మాకు అప్పులు మిగిల్చావు, మాకు వనరులు లేవు, మాకు వనరులు ఏర్పాటుచేయండి" అని వారు అడిగి ఉండవచ్చు కదా? అదేమీ చేయలేదు. ప్రకాశం జిల్లాలో

రాజధాని నగరం వస్తుందని అక్కడ భూములు కొన్నారు గానీ, రాబోయే తరాలకు ఏవిధంగా ఉండాలనేది వారు ఏనాడూ ఆలోచన చేయలేదు.

అధ్యక్షా, ఈరోజు నదుల అనుసంధానం చేయడంతో మా జిల్లా ఎంత బాగుపడిందంటే, జీడిపల్లి వద్ద నీరు రావడం జరిగింది. మన జలవనరుల శాఖ మంత్రి గారు జీడిపల్లి వద్దకు చాలాసార్లు నెలకు రెండు, మూడు సార్లు రావడం జరిగింది. అక్కడున్న పరిస్థితులను అధికారులతో అనేకసార్లు సమీక్షించి త్వరితగతిన జీడిపల్లికి నీరు రావడానికి ఆయన చేసిన కృషికి నేను వారిని అభినందిస్తున్నాను. ఈరోజు జీడిపల్లి నుంచి గొల్లపల్లి వరకూ నీరు రావడం జరిగింది. ఆరోజు ఆ మహానుభావుడు హంద్రీనీవా సుజల స్రవంతి అని ఎంతో చక్కని పేరు పెట్టారు. ఈరోజు ఆ కాలువ వెంబడి ఉన్న భూములన్నీ కూడా సస్యశ్యామలం అవుతున్నాయి. అది కరవు నివారణ కాదా? రెండు పంపులకు నీళ్లు తెచ్చినదానికే ఆనాడు రెవెన్యూశాఖ మంత్రిగా ఉన్న శ్రీ రఘువీరారెడ్డి గారు అపరభగీరథుడు అని వారం రోజులపాటు పేపర్‌లో వేయించుకున్నారు. కానీ, అప్పుడు నీళ్లు ఎక్కడా కూడా రాలేదు. ఈరోజు గొల్లపల్లి వరకూ నీరు వచ్చి అనంతపురం జిల్లాలో ముఖ్యంగా ఆరోజు రాయలు గారు కట్టించిన పెద్ద పెద్ద చెరువులకు నీళ్లు రావడం తద్వారా అక్కడున్న బోర్లలో నీరు శాతం పెరగడం, అక్కడ సాగునీటికి, త్రాగునీటికి చాలావరకూ సౌలభ్యంగా ఉండడం జరుగుతోంది. కరవు మనల్ని చూసి భయపడాలి, కరవును చూసి మనం భయపడకూడదు, కరవును పారద్రోలాలని మన ముఖ్యమంత్రిగారు అనంతపురం జిల్లాకు వచ్చిన ప్రతిసారి చెబుతూ ఉంటారు. నిజమే, ఈనాడు కరవు నివారణ కోసం చేపట్టిన కార్యక్రమాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా, నీరు - చెట్టు కార్యక్రమం వల్ల ఈరోజు చెరువుల్లో ఎప్పుడో పది సంవత్సరాల క్రితం ఎండిపోయి బీటలు వారిన చెరువులకు పూడికలు తీయడం వల్ల వర్షాలు వచ్చినపుడు, కాలువ నీరు వచ్చినపుడు ఆ చెరువులు నింపుకుని, ఆ చెరువుల క్రింద వున్న భూముల్లో ఉన్న బోర్ల యొక్క నీటి శాతం పెరగడం వల్ల పది ఎకరాలున్న రైతు కనీసం ఐదు ఎకరాలైనా సాగుచేసుకోవడానికి అవకాశముంటోంది.

అధ్యక్షా, ముఖ్యమంత్రిగారిది ఈనాటి ఆలోచన కాదు. అప్పట్లోనే వ్యర్థంగా పోతున్న వర్షం నీటిని వాడుకోవాలని ఇంకుడుగుంతలు, అనేక చెక్ డ్యాములను నిర్మించడం జరిగింది. మా అనంతపురం జిల్లాలో లక్ష farm ponds త్రవ్వడం జరుగుతోంది. వర్షపు నీటిని స్టోర్‌చేసుకుని ఆ భూమిలో చుట్టూ ఉన్న పంటలకు ఉపయోగకరంగా ఉండడానికి farm ponds ను త్రవ్వించడం జరుగుతోంది. నీరు - చెట్టు కార్యక్రమంలో కాలువలలో ఉన్న పూడికలను తీసివేయడం, కాలువలలో ఉన్న కంప చెట్లను తీసివేయడం వల్ల చిట్టచివర ఉన్న ఎకరా భూమి వరకు కూడా నీరు సరఫరా కావడం జరుగుతోంది.

అధ్యక్షా, సంవత్సరం క్రితం గడ్డిపాక నుంచి పులివెందులకు నీరు రావాలనే ఉద్దేశ్యంతో మీరు గడ్డం పెంచుకోవడం జరిగింది. అది ఎక్కువ కాలం లేకుండా గౌరవ ముఖ్యమంత్రి గారి సంకల్పం వల్ల, ముఖ్యమంత్రి గారి ఆలోచన వల్ల మీరు ఒక్క సంవత్సరానికే గడ్డం తీసేయడం జరిగింది.

(సభలో హర్షధ్వానాలు)

అధ్యక్షా, అది అభివృద్ధి కాదా? అది కరవును పారద్రోలడం కాదా? వారు ఈరోజు చూడలేకపోతున్నారు. "భర్త కొట్టిన దానికి కాదంట ఏడ్చేది, తోడికోడలు నవ్వినదానికి ఏడుస్తారంట" అనే సామెత మా ప్రాంతంలో ఉంది. నేటి ప్రతిపక్షాల ధోరణి ఆ విధంగా ఉంది.

అధ్యక్షా, ఈరోజు వ్యవసాయానికి కావలసిన స్ప్రింక్లర్లు గానీ, డ్రిప్ ఇరిగేషన్ గానీ ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈరోజు నేను ప్రభుత్వానికి విన్నవించుకునేది ఏమంటే, ఇంతకుముందు డ్రిప్

ఇరిగేషన్‌కు 90 శాతం మన అనంతపురం జిల్లాలో సబ్సిడీని ఇచ్చేవారు. ఇప్పుడు 50 శాతం అని అంటున్నారు. ప్రభుత్వం దానిపై దృష్టిపెట్టి 90 శాతం సబ్సిడీని ఇస్తే, అనంతపురం రైతులు మరింత ముందుకు రావడానికి అవకాశముంటుంది.

అధ్యక్షా, ఈరోజు ఉద్యానవన శాఖ కరవు నివారణలో భాగంగా, పంట రుణాలను ఇవ్వడమే కాకుండా, నష్టపోయిన ఉద్యానవన పంట రైతులకు కూడా నష్టపరిహారం ఇవ్వడం జరిగింది. దీనికోసం మా అనంతపురం జిల్లాకు రూ.17 కోట్లు ఇవ్వడం జరిగింది. ఒక్క సింగనమల నియోజకవర్గానికే రూ.10 కోట్లు ఇవ్వడం జరిగింది. అది కరవు నివారణ కిందనే వస్తుంది. ఈ రోజు మీరు తింటున్న ప్రతి పండు కూడా అనంతపురం జిల్లాలో కూడా పండుతుంది. ఒక చిన్న రేగుపండు నుంచి పుచ్చకాయ వరకూ కూడా అనంతపురం జిల్లాలో పండుతాయి. ఆయన తీసుకున్న చర్యల వల్ల అనంతపురం జిల్లా నేడు ఉద్యానవనం హబ్‌గా మారింది. మన జిల్లాలో చీనీ తోటలు చాలా బాగా పెంచుకుంటాము. మంచి ఆరోగ్యాన్ని ఇవ్వడానికి, మంచి ఫలాలు ఇవ్వడానికి లాభసాటి అయిన పంటగా దానిని చెప్పవచ్చు. గత ప్రభుత్వంలో వేలకొలది చీనీ తోటలన్నీ కొట్టివేయడం జరిగింది. ఈరోజు గండికోట ద్వారా మీరు పులివెందులకు నీళ్లు ఇచ్చినపుడు శింగనమల నియోజకవర్గంలో ఉన్న ఎల్లనూరు, పుట్లూరు మండలాల్లో 1,500 అడుగుల లోతుకు వెళ్లినా కూడా నీటిలభ్యత లేదు. అక్కడున్న ఏటిలో 20 మీటర్ల వరకూ భూమి అకస్మాత్తుగా కుంగిపోవడం జరుగుతోంది. దానిని బట్టి చూస్తే, అక్కడ కరవు ఎంత ఘోరంగా ఉన్నదో మనకు అర్థమవుతోంది. అటువంటి చోట గొడ్డుమర్రి వద్ద ఎత్తిపోతల పథకం ద్వారా మీరే వచ్చి నీటిని విడుదలచేయడం జరిగింది. ఈరోజు ఆ రెండు మండలాల్లో ఉన్న ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారంటే ఇంతకాలానికి మేము ఈఏటిలో నీళ్లు చూస్తున్నామని వారెంతో సంతోషపడడం జరుగుతోంది.

అధ్యక్షా, ఈరోజు అనంతపురం జిల్లాలో ఉన్న అనేక గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమలులో ఉంది. 150 పనిదినాలతో అక్కడ ఉపాధి హామీ జరగడం, రోడ్ల చుట్టూ ఉన్న కంపలు కొట్టి చెట్లు నాటడం జరుగుతోంది. అశోకుడు చెట్లు నాటించెను, అశోకుడు రోడ్లు వేయించెను అని ఆనాడు మనం చరిత్రలో చదువుకున్నాము. మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మంచి రోడ్లు వేయించడం, నీడకు కావలసిన చెట్లను నాటించడం జరుగుతోంది. ఈ ఉపాధిహామీ పథకం ద్వారానే ఆ పనులన్నీ కూడా చేయించడం జరుగుతోంది. ఈరోజు వ్యవసాయానికి కావలసిన విత్తనాలు, ఎరువులు సబ్సిడీ క్రింద ఇవ్వడం జరుగుతోంది.

మ. 01.00

అధ్యక్షా, అంతేకాదు తీసుకుంటున్న పనులు కరువు నివారణకు ఎంతో ఉపయోగంగా ఉన్నాయి. ఈరోజు రైతనేవాడు మా ప్రభుత్వముంది ఏదోవిధంగా మమ్మల్ని ఈ నష్టాలనుంచి బయట పడేస్తారు, ఈ నష్టాలనుంచి మేము బయటపడతామని అనుకోవడం జరుగుతోంది. ఈరోజు మానవుడు ఆశాజీవి. కరువుప్రాంతాలైన పల్లెల్లో పొద్దున్నుంచి సాయంకాలంవరకూ పనిచేసినా రూ.150 మాత్రమే వస్తుంది కనుక అక్కడ ఉండడంకన్నా ఇతర రాష్ట్రాలకు వెళ్ళి ఒకరోజు కూలి రూ.500 వరకూ వస్తుంది కాబట్టి అక్కడికెళ్ళి కూలిపని చేసుకోవాలనే ఆలోచనతో ఉంటారు పల్లె ప్రజలు. ఆ రాష్ట్రానికి వెళ్తే సాయంకాలానికంతా రూ.500వరకూ వస్తుందనే ఉద్దేశంతో వారు వెళ్ళడం జరుగుతోందే కానీ ఇక్కడేదో ప్రభుత్వం చాలా బలహీనంగా ఉందనేదేమీ లేదు. వారికి కావాల్సిన అనేక వసతులు ఈరోజు రాష్ట్ర ముఖ్యమంత్రిగారు కల్పించడం జరుగుతోంది.

హంద్రీనీవా సుజలస్రవంతి కాలువను వెడల్పుచేస్తే మన నాలుగు రాయలసీమ జిల్లాలకు ఇంకా ఎక్కువ నీరు రావడం జరుగుతుంది. ఆ జిల్లాలలో ఉన్న చెరువులన్నింటినీ నింపడానికే ఆ కాలువను

తీసుకొస్తున్నారు. అది తప్పకుండా నెరవేరుతుంది. మనం కరువును పారద్రోలుతాం. అప్పుడు కరువే మనల్ని చూసి భయపడుతుందని నేను సగర్వంగా మీద్వారా తెలియజేసుకుంటున్నాను.

(గౌరవ సభ్యుల హర్షధ్వానాలు)

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్: మంత్రిగారూ, రెయిన్‌గన్స్ విషయంలో సరైన సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ఎంత చేసినా కూడా వృథానే. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకునే చర్యలేవైతే ఉన్నాయో ఏదైనా ఒక్క రెయిన్‌ఫాల్ మధ్యలో ల్యాప్స్ అయినా కూడా we are bound to get drought. ఆ ఒక్క రెయిన్‌ఫాల్ తప్పించాలనే ఉద్దేశంతో రెయిన్‌గన్స్ ద్వారా పంటకు నీరు అందచేస్తున్నాము. కానీ, గత సంవత్సరం మనకు వచ్చినటువంటి ఇబ్బందులు ఈ సంవత్సరం రాకుండా ముందే it needs meticulous planning. ముందే కూర్చుని ఏ ఏ ప్రాంతాల్లో వర్షపాతం తక్కువ ఉందనే అంచనాలను యుద్ధ ప్రాతిపదికన చేయాలి. ఒక వారం, పదిరోజులు ఆలస్యంగా రెయిన్‌గన్స్‌తో నీరు ఇచ్చినా ప్రయోజనముండదు. గత సంవత్సరం మనం ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృతం కాకుండా ఈసారి అవసరమైనచోట్ల సరైన సమయంలో రెయిన్‌గన్స్‌ను ఉపయోగిస్తే బాగుంటుంది.

I came from a drought prone area. We have learned so many lessons during the last time. గతంలో ఎవరూ ప్రయత్నం చేయలేదు. కరువుంటే కరువును మనం జయించవచ్చు. లేదూ కరువును ఈరకంగా ఎదుర్కొనే ఆలోచన ఇంతకుముందు ఎవరికీ రాలేదు. ఇది మంచి ఆలోచన అయినప్పటికీ ఆచరణలో కొన్ని లోపాలుంటున్నాయి. ఇందాక గౌరవ సభ్యులు చెప్పినట్లుగా అక్కడక్కడా నీటి లభ్యత లేదు. ఎకరాకు ఎన్ని ట్యాంకర్లు పడతాయనే అవగాహన లేకపోవడం వల్ల కూడా కొన్నిచోట్ల విఫలమయ్యాయి. ఈ సంవత్సరం అవి పునరావృతం కాకుండా ఒకవేళ కరువు వచ్చినా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ పి.జె.చంద్రశేఖరరావుః అధ్యక్షా, కరువు, కరువుపరిస్థితి అనే రెండూ ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉండే అంశాలైనప్పటికీ, వీటికి ఉండే అవినాభావ సంబంధాన్ని చూస్తే కరువనేది వర్షంతో కూడినదనే విషయం తెలిసిందే. అయితే వర్షాలు పడకపోవడంవల్ల వ్యవసాయపనులు జరగకపోవడంతో ఉపాధి, ఆదాయం లేకపోవడంవల్ల వచ్చేదే కరువు అనే ఒక పరిమితమైన అర్థంలో, రిజర్వ్‌బ్యాంకు మార్గదర్శకాలు, కేంద్రప్రభుత్వం మార్గదర్శకాలు తీసుకుని ఎక్కడ వర్షాభావం ఉన్నదీ, ఎక్కడ ఎన్ని మిల్లీమీటర్ల వర్షం పడిందీ అనే పారామీటర్స్‌తో కరువు మండలాలను పంపించడమనేది అంత హేతుబద్ధంగా లేదని దేశంలోని మేధావులంతా అంటున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించినంతవరకూ కరువుయొక్క అంచనాను మరియు అన్వయాన్ని మండలాల వారీగా చూడాలి. అసలు ఎన్ని మండలాలలో కరువు ఉంది? ఎన్ని మండలాలలో లేదు? అనే వివరాలను చూడాలి. గతంలో ఈ కరువు మీద జరిగినటువంటి చర్చలో అధ్యక్షా మీరు గౌరవ సభ్యుల స్థానంలో కూర్చుని మాట్లాడేటప్పుడు "ఈ పద్ధతి బాగాలేదని అంటూ, ఒక మండల పరిధిలోని పది గ్రామాలకుగాను ఎనిమిది గ్రామాల్లో అత్యల్ప వర్షపాతం, రెండు గ్రామాల్లో అధిక వర్షపాతం నమోదై, ఆ వర్షపాతం సరాసరి అధికంగా ఉన్నప్పుడు వర్షపాతం తక్కువగా నమోదైన ఎనిమిది గ్రామాలూ కూడా కరువు మండలాలకు సంబంధించిన నిధుల కేటాయింపుల నుండి మినహాయింపబడడం జరుగుతోందని" చెప్పారు. నాకు గుర్తుంది. అయితే దానిని ప్రభుత్వమెక్కడా పరిగణనలోకి తీసుకున్నది లేదు.

ఇదే సందర్భంగా నేను మనవి చేసేదేమంటే, మనకి అనంతపురంతో సహా మన రాష్ట్రంలో ఎక్కడా కూడా సరాసరి 400 మిల్లీమీటర్లకంటే తక్కువ వర్షపాతం ఎక్కడా నమోదుకాలేదు. అయితే ఒకసారి పరిశీలనచేసినట్లయితే అరబ్, ఇజ్రాయిల్, దక్షిణ ఆఫ్రికా వంటి కొన్ని దేశాలలో 200 మిల్లీమీటర్లకంటే

తక్కువ వర్షపాతం నమోదవుతుంది. అంటే వాళ్ళ సరాసరి వర్షపాతం 200 మిల్లీమీటర్లు మాత్రమే ఉంటుంది. అయినా వారు శాస్త్రీయమైన పద్ధతుల్లోనూ, ఆధునికమైన పద్ధతుల్లోనూ నీటి వినియోగం చేయడం వల్ల ఇబ్బంది ఉండేదికాదు.

ఇంతకుముందు పెద్దలు వెంకటేశ్వర్లుగారు చెప్పినట్లు పర్ యూనిట్ ఆఫ్ వాటర్‌కు ఎంత ప్రొడక్షన్ మనం తీసుకున్నామనే దానితోపాటు స్ప్రింక్లర్లతో, డ్రిప్ ఇరిగేషన్ పద్ధతితో ఆ నీటి వినియోగాన్ని మరింత శాస్త్రీయంగా చేసుకోవాలి. అదేవిధంగా వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాలమీద ప్రత్యేకంగా కేంద్రీకృతం చేసి, అక్కడ శాస్త్రీయమైన పద్ధతుల్లో నీటివినియోగం చేయాలనే ఆలోచనకు ప్రభుత్వం స్వీకారం చుట్టాల్సిన అవసరమెంతైనా ఉంది. ఒక ప్రాంతంలో నీళ్ళుండి ఇంకోదగ్గర లేకపోతే అప్పుడు నీళ్ళు తీసుకుపోయి రెయిన్‌గన్‌లతోటి కొట్టడం సాధ్యమవుతుంది. ఒకవేళ మొత్తం రాయలసీమ ప్రాంతంలోనే నీళ్ళు లేకపోతే కృష్ణా, గోదావరి జిల్లాల నుంచి లారీలతో, ట్యాంకర్లతో నీళ్ళు తీసుకుపోవడంకూడా ఖర్చుతో కూడుకున్నదేమీ కాదు. ఏదో ఒక ప్రయోగంలాగా చేస్తే చేసి ఉండవచ్చు. But that is not a remedy at all.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ః చంద్రశేఖరరావుగారూ, ఇప్పుడు పెద్ద ఎత్తున ఫార్మ్‌పాండ్స్ తవ్వుకోవాల్సిన అవసరముంది. వర్షం పడినప్పుడు ఆ నీటిని ఫార్మ్ పాండ్స్‌లో నిలవచేసుకుంటే కరువు వచ్చినప్పుడు వాడుకోవడానికి అవకాశముంటుంది.

శ్రీ పి.జె.చంద్రశేఖరరావు: అధ్యక్షా, ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశంజిల్లాలోని మెట్టప్రాంతాలలో ప్రతి పది, ఇరవై, నలభై ఎకరాలకు కుంట చెరువులు ఉంటాయి. ఆ కుంట చుట్టూ చెట్లు వేయడం, ఆ కుంటలలో ఎప్పుడూ నీళ్ళు ఉండడం, అక్కడి పొలాల్లో పనిచేసేవాళ్ళు ఆ కుంట దగ్గరికి వెళ్ళి ఆ చెట్లకింద ఉండి భోజనాలు చేసి సేదదీరడమనేది సాంప్రదాయకమైన వ్యవహారం. అదేమీ కొత్త విషయంకాదు. మెట్ట ప్రాంతాలలో ఈ రకమైన విధానముంది.

మ. 01.10

రాయలసీమ గిరిజన ప్రాంతాలలో ప్రభుత్వం కూడా పరిశీలించాల్సిన అంశం ఏమంటే గొలుసు చెరువులు అనే ఫిలాసఫీ ఉంది. పైనున్న ప్రాంతాలలో వర్షం పడినప్పుడు ఆ చెరువు నిండితే అది అలుగు పారడం అంటారు. అలుగు పారిన నీళ్లు అక్కడి నుండి ప్రవహించి క్రింద గ్రామంలో ఉన్నటువంటి చెరువు నింపుతుంది. అక్కడ కూడా వర్షం పడుతుంది కాబట్టి గొలుసు చెరువులు నింపడం అనే కాన్సెప్ట్ వెనుకటి నుండి ఉంది. దీనిని మరింత మోడ్రనైజ్ చేసి, మరింత ఛానలైజ్ చేసి పడుతున్న ఆ వర్షాన్ని కూడా ఏదో కాలువలోకి వెళ్లిపోయి, అటు ఇటు వెళ్లి నిరుపయోగంగా మారేకంటే భూగర్భ జలాలను అభివృద్ధి చేసేందుకు వాటన్నింటినీ ఒక గ్రామంలోని చెరువు నుండి మరో గ్రామంలోని చెరువులోకి తీసుకువెళ్లేందుకు చేసుకోవడం అవసరమని, దానిమీద కూడా ప్రభుత్వం నీటిపారుదల నిపుణులతో పరిశీలన చేయవలసిన అవసరం ఉంది. ఏదేమైనా సైంటిఫిక్‌గా, టెక్నలాజికల్‌గా వాటన్నింటి మీద ఆధారపడి చేయవలసిన అంశం కాబట్టి నేను ఎక్కువగా చెప్పదలచుకోలేదు.

నేను మనవి చేయదలచుకున్నదేమంటే, 2013–14వ సంవత్సరంలో చూసినట్లయితే అప్పటికి 36 శాతం వర్షాభావం ఉంది. ఇప్పుడు మనకు 28, 29 శాతం వర్షాభావం ఉంది. అంటే 2013–14వ సంవత్సరం నుండి 2016–17వ సంవత్సరం వరకు వరుసగా నాలుగు సంవత్సరాలు రాయలసీమ జిల్లాలు మరియు ప్రకాశం జిల్లాను పరిశీలన చేస్తే, ప్రకాశం జిల్లాలో 56 మండలాలు ఉంటే అందులో 53 కరవు మండలాలు. గతంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. అనంతపురం, చిత్తూరు జిల్లాలతో పాటు గత నాలుగు సంవత్సరాల నుండి ప్రకాశం జిల్లాలో కూడా కరవు వుంది. కానీ, ప్రకాశం జిల్లా వెనుకబడిన జిల్లాల లిస్ట్‌లో

లేదు, రూ.50 కోట్లు ఇచ్చే జిల్లాల్లో పెట్టి అశాస్త్రీయంగా ఆ రూ.50 కోట్లు కేంద్రప్రభుత్వం వారు ఇస్తున్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్లి మాకు రూ.2,300 కోట్లు కావాలని అభ్యర్థన పెట్టడం జరిగింది. జిల్లాకు రూ.50కోట్లు కంటే ఎక్కువ ఇచ్చే పరిస్థితి లేదని, 7 జిల్లాలకు పరిమితి చేసింది. ప్రకాశం జిల్లాను పట్టించుకోవడం మానేశారు. ప్రకాశం జిల్లా గురించి ఇందాక ఆర్థికశాఖ మంత్రిగారు కేంద్రప్రభుత్వంకు రాశామన్నారు. రాస్తే ఏమైంది సార్? ఏమీ కాలేదు. శ్రీమతి పమిడి శమంతకమణి గారు దొనకొండకు ముఖ్యపట్టణం వస్తుందన్నారు. ముఖ్యపట్టణం లేదు, వెనుకబడిన జిల్లాగా లేదు, వర్షపాతం ఉండదు, కరవు నిరంతరంగా కొనసాగుతున్నది. ఇంత నిర్లక్ష్యం ఉండాల్సిన అవసరం లేదు. ప్రజల యొక్క ఆలోచనలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మన దగ్గర లెక్కలు, డేటా ఉన్నప్పటికీ కూడా ఏవిధమైన పట్టింపు లేకపోవడం బాగాలేదు. అసలు రూ.50 కోట్లు ఏమిటి? ఎప్పుడో నాలుగు సంవత్సరాల క్రితం రూ.50 కోట్లు ఇచ్చి, ఐదు సంవత్సరాల తరువాత కూడా ఆ యాభై కోట్లే ఇస్తామని అంటే real value purchasing capacity of the 50 crores ఏవిధంగా డిక్రీజ్ అవుతోంది, డిప్రిసియేట్ అవుతోంది అనేది పరిశీలన చేసినా సాధ్యం కాదు. ప్రభుత్వం అడిగిన రూ.2,350 కోట్లకు, కేంద్రప్రభుత్వం ఇచ్చిన రూ.350 కోట్లకు ఎంత వ్యత్యాసం ఉంది? స్పెషల్ అసిస్టెన్స్, స్పెషల్ ప్యాకేజీ, ప్రత్యేక హోదా రకరకాల పేర్లు వస్తున్నాయి. వాటికి సంబంధించిన సబ్జెక్టు కాకపోయినప్పటికీ కరవు నివారణకు శాశ్వతమైన చర్యలు ఏం చేపడుతున్నారు? గౌరవ హోంమంత్రి శ్రీ ఎన్. చినరాజప్ప గారు ఇచ్చిన పేపర్ మొత్తం ఓపికగా చదివాను. (పేపర్ చూపిస్తూ) దీనిలో శాశ్వతమైన చర్యలు ఏమీ లేవు. శాశ్వత చర్యలు లేనప్పుడు వరుసగా కరవు వస్తూనే ఉంటుంది, ఏదో తాత్కాలికంగా చేస్తూ ఉంటాము, మీరు ఇలాగే ఏడుస్తూనే ఉండండి, మీ కన్నీళ్లు తుడుస్తాము అంటే ఇదెలా సాధ్యం అధ్యక్షా. ఇది సరైన వైఖరి కాదు. మన రాష్ట్రంలో 60 శాతం మంది ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి ఉంటారు. జి.డి.పిలో 30 శాతం వ్యవసాయం నుండి వస్తుంది. ఆ వ్యవసాయానికి కేటాయింపులు పర్సంటేజ్ పరంగా చూసుకుంటే తగ్గిపోతున్నాయి. వ్యవసాయంలో వచ్చే దుర్భిక్షం, వర్షాభావం వలన ప్రజలు వలసలు వెళ్లిపోతున్నారు. వలసలు వెళ్లిన వారి పరిస్థితి పరమ ఘోరంగా ఉంది. వర్ణించడానికి వీలులేని విధంగా ఉంది. మా పార్టీ తరఫున మేము ఢిల్లీకి వెళ్లాము. మొన్న మాపార్టీ సెక్రటరీ శ్రీ రామకృష్ణగారు, రైతు సంఘ నాయకులు, కేరళలోని కొచ్చిన్, కర్నాటకలో బెంగుళూరు నగరాలకు వెళ్లి వలస వెళ్లిన వాళ్లందరిని కలిసాము. పేపర్‌లో కూడా వచ్చింది, మీ అందరూ చూశారో లేదో తెలియదు. అక్కడుండే మరుగుదొడ్ల ప్రక్కన, ఈ కలర్‌షీట్స్‌తో గుడారాలు పెట్టుకుని ఉంటే మున్సిపాలిటీ వాళ్లు, పోలీసులు వచ్చి చుట్టుప్రక్కల ఎక్కడ దొంగతనం జరిగినా వాళ్లను తీసుకుని వెళ్లి పోలీస్ స్టేషన్లలో పెడుతున్నారు. ఇటువంటి కేసులు గురించి అనంతపురం వాళ్లు మాకు ఫోన్ చేస్తే మేము మళ్లీ కేరళలో ఉన్న పార్టీ నాయకులతో మాట్లాడి, ఆ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన దయనీయమైన పరిస్థితి ఏర్పడుతోంది. కాబట్టి నేను మనవి చేసేదేమంటే దీనిని సెన్సిటైజ్ చేసి, దాని నుండి ఏదో ప్రయోజనం పొందడం కాదు. శాశ్వతంగా వలసలను ఎలా నిరోధిస్తారు? ఈ శాశ్వతమైన నిరోధంకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ప్రణాళిక ఉంది? రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం వారి నుండి శాశ్వత పరిష్కారంగా ఏం కోరుతున్నారు? దీనిని ప్రజలకు చెప్పాల్సిన అవసరాన్ని ఈ పత్రం విస్మరించిందనే విషయాన్ని నేను మనవి చేస్తున్నాను. అలాగే కరవు అంటే కేవలం నీటికి సంబంధించిన అంశమే కాదు. విద్యకు, ఆరోగ్యానికి, వలసలకు, ఉపాధికి సంబంధించిన అంశం, కనీస జీవనానికి సంబంధించినది. ప్రజల యొక్క ఆత్మగౌరవాన్ని కోల్పోతున్న పరిస్థితులలో, అప్పులు తీర్చుకోలేని పరిస్థితులలో, ఈ చండాలమైన జీవనం గడపలేక పోతున్నామనే పరిస్థితులలో ఆత్మహత్యలకు పురిగొల్పుతున్న పరిస్థితులుగా మనం దీనిని పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. వర్షం పడుతోందా, తక్కువ పడుతోందా, ఎక్కువ పడుతోందా కాలువలు త్రవ్వామా, హంద్రీనీవాలో నీళ్లిచ్చామా, ఆయన బొమ్మ పెడదామా, ఈయన బొమ్మ పెడదామా అని చెప్పాల్సిన అవసరం లేదు. పేర్లకి, ఊర్లకి, షికార్లకు అలవాటు పడిన వాళ్లకి పెడితే పెట్టుకోండి, మాకు ఏ

అభ్యంతరం లేదు. కానీ, ప్రజల జీవితానికి, వలసలకు, విద్యకు, అనారోగ్యానికి, ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంగా ఆలోచించినప్పుడు నిష్పక్షపాతంగానే మనం ఆలోచించుకోవాలి. ఈ ప్రభుత్వం ఏం చేసింది, ఆ ప్రభుత్వం ఏం చేసిందని కాదు. ఏ ప్రభుత్వం వచ్చినా గాని ప్రజలు ఏవిధంగా ఉన్నారనే ప్రాతిపదిక మీద మనం ఆలోచించాల్సిన ఆవశ్యకత ఉంది.

ఇప్పుడు రుణమాఫీ ఎందుకు చేయలేక పోయారు? రుణమాఫీ చేస్తే చాలా మందికి రిలీఫ్ దొరుకుతుంది కదా? రుణమాఫీ చేయడం అనేది ప్రభుత్వం చేతిలోనే ఉంది కదా? మీరు చెప్పిన దాని ప్రకారం రూ.13,000 కోట్లు మాత్రమే కదా ఇంకా రుణమాఫీ చేయాల్సింది. మీరు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి తీసుకుని రావచ్చు. లేదంటే మీరే తీర్చేసి రైతులకు పూర్తిగా రుణమాఫీ చేస్తున్నాము అని చెప్పి ఉండొచ్చు. కరవు నివారణకు అది ఉపయోగపడుతుంది. రైతుల యొక్క ఆత్మగౌరవాన్ని పెంచేందుకు ఉపయోగపడుతుంది. రైతులు వలసలు పోకుండా ఉండేందుకు ఉపయోగపడుతుంది. అలాంటివి ఏమీ చేయకుండా "వండిన అన్నం వండినట్టే చట్టిలో ఉండాలి, పిల్లాడు మాత్రం దొడ్డుగా ఉండాలి" అనంటే అదెలా సాధ్యం? మీరు ఇచ్చే రాయితీలన్నీ పారిశ్రామిక వేత్తలకు, డబ్బున్నవాళ్లకు, వ్యాపారస్తులకు, విదేశీ పెట్టుబడిదారులకు, కార్పోరేట్ సెక్టారుకు ఇచ్చి, రైతులకు, వ్యవసాయ కూలీలకు ఇచ్చేదేమిటి అధ్యక్షా?

అధ్యక్షా, నేను ఒక విషయానికి వస్తాను. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరేగా) ఉంది. ఎవరికైనా జాబ్ కార్డు ఇచ్చి, 15 రోజులలో పని కల్పించలేక పోతే వారికి 75 శాతం జీతం ఇవ్వాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దానిని ఆమోదించలేదు, దానిని అమలు చేయడం లేదు. రూల్స్ ఫ్రేమ్ చేసి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వలేదు. ఎంతమందికి జాబ్‌కార్డులిచ్చారు అధ్యక్షా? నేను అనంతపురం జిల్లాకు వెళ్లాను. మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎలక్షన్ల సందర్భంగా రాయలసీమలో మూడు జిల్లాల్లో బాగా తిరిగాను. నేను మనవి చేస్తున్నాను, మీ జిల్లా (కడప జిల్లా) నుండి కర్నూలు జిల్లాకు పోయే సందర్భంలో ఒక గ్రామానికీ, మరో గ్రామానికీ వేరే పరిస్థితులు ఉంటాయి. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు చూస్తే ఒక గ్రామానికీ, మరో గ్రామానికీ మధ్య దాదాపు 2,3 కిలోమీటర్ల దూరం ఉంటుంది.

మ1.20

అక్కడ ఒక గ్రామానికి మరొక గ్రామానికి మధ్య సంబంధం ఉండదు. ఆ ప్రాంతంలో ఎక్కడా కూడా పక్షులు కనిపించవు. పక్షులు కూడా నీళ్లు తాగాలి కదా? పక్షులే లేవు. నేను మనవి చేసేదేమంటే, ఒక భౌగోళిక ప్రదేశంలో ఉండే ప్రజల యొక్క జీవన పరిస్థితులు, నీటి మీద ఆధారపడి ఉంటాయి అనే దానికి ఇదొక ఉదాహరణ. అలాగే ఉపాధిహామీ పథకంలో 150 రోజులు ఎంతమందికి ఉపాధిని కల్పించారు? ఎన్ని జాబు కార్డులు ఉన్నాయి? ఒక్క అనంతపురం జిల్లాలోనే ఎనభైవేల జాబుకార్డులు ఉన్నాయి. వాటిలో ఒక్కరోజు కుడా పని ఇవ్వని జాబుకార్డులెన్ని? 100 రోజులు పనిచ్చిన జాబుకార్డులెన్ని? ఇవన్నీ లెక్క చూస్తే, ఇది ఒక బోగస్ వ్యవహారం లాగా తేలిపోతుంది. దానిలో వారికిచ్చే వేతనాలు లెక్కకట్టే విధానంలో తేడాలు ఉన్నాయి. మినిమమ్ పనికి వందరూపాయలు అంటున్నారు, కానీ, వందరూపాయలు ఇవ్వడం లేదు. వాళ్లుచేసిన పని లెక్కలేసి వాటిలో యంత్రాలకి 40%, మనిషి 60% అని ఉంటే, ఇప్పుడు యంత్రాలు 60%, మనిషి 40% అని లెక్కలు మార్చేసి వాళ్లకు వచ్చే డబ్బుల్ని తక్కువ చేసి సుమారుగా 60 నుంచి 70, 80 రూపాయల కంటే ఎక్కువ రావడంలేదు. అది కూడా ఆ వ్యక్తి నాలుగైదు కిలోమీటర్ల దూరం వెళ్లాలి. ఆ నాలుగైదు కిలోమీటర్లు సద్దికట్టుకుని, నడిచి వెళ్లి, అందులోనూ రాయలసీమ ప్రాంతమైన మా ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో గడ్డపార వేస్తే దిగదు, టంగుమని మోగిద్ది, దాని నుంచి నిప్పులు కూడా వస్తాయి. నేను ప్రభుత్వానికి మనవిచేసేదేమంటే, ఈ నరేగా (NREGA) స్కీములో గాని, నీటి కేటాయింపులకు సంబంధించి గానీ, రుణమాఫీకి సంబంధించిన అంశంలో గాని, పాఠశాలల నుంచి వలసలు నివారించే

అంశంలో గాని, శాశ్వత నివారణకు సంబంధించిన అంశాలు గానీ లేనటువంటి ఈ డాక్యుమెంటు ప్రజల కరవు నివారణలో ప్రభుత్వానికి సీరియస్‌నెస్ లేదు అనడానికి ఒక తార్కాణంగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విషయమై మేధావులతో చర్చించి, అవసరమైతే అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటుచేసి, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితులు వచ్చినప్పుడు దీనిని ఎలా ఎదుర్కొనాలి? కేంద్రప్రభుత్వం నుంచి ఏవిధమైన సహాయం తీసుకోవాలి? మనం ఎటువంటి ముందు జాగ్రత్తలు ఏమి తీసుకోవాలి? వలసల్ని ఎలా అరికట్టాలి? విద్యార్థులు, వృద్ధుల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అని విడివిడిగా చర్చించి ఒక సమగ్రమైన విధానాన్ని రూపొందించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి. లేకపోతే ప్రతిసంవత్సరం కరవులనేవి వస్తూనే ఉంటాయి, ప్రభుత్వంలో ఇలాంటి తాత్కాలికమైన చర్చలు జరుగుతూనే ఉంటాయనే పాసివ్ ధోరణి ఏదైతే ప్రభుత్వానికి ఉందో, అది ప్రజల్ని తక్కువ అంచనా వేయడమవుతుంది, ప్రజల యొక్క కష్టాల ఎడల నిర్లక్ష్యమైన భావానికి ఉదాహరణగా మిగులుతుంది. కాబట్టి, మీ ద్వారా నేను ప్రభుత్వాన్ని కోరేదేమంటే, ఈ అంశాల మీద సీరియస్‌గా మైండ్ అప్లై చేసి, సైంటిఫిక్‌గా మిటిగేట్ చేసే అవగాహనతో మనం ముందుకు వెళదాం.

Last but not the least, I request the Government of Andhra Pradesh that ప్రకాశం జిల్లాని ఈ వెనుకబడిన జిల్లాల జాబితాలోకి చేర్చి ప్రకాశం జిల్లా ఎడల ప్రత్యేకించి ఒక అప్రోచ్‌మెంట్‌ని ప్రభుత్వం ఇవ్వాలి. మేము కేంద్రానికి వెళుతున్నాము, ఉత్తరాలు రాస్తున్నాము, అయినా వాళ్లు పట్టించుకోవడం లేదు అనే ఒక ఊకదంపుడు ఉపన్యాసాన్ని నాలుగైదు సంవత్సరాల నుంచి నేను వింటున్నాను. కాంగ్రెస్ గవర్నమెంటు అదే ఉపన్యాసం ఇచ్చింది, ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం కూడా ఇస్తోంది. అంటే మీకు ప్రకాశం జిల్లా అంత పనికి మాలిన జిల్లాగా కనపడుతుందా? ప్రకాశం జిల్లా ప్రజలు ఏదో మెత్తగా ఉంటారు, చూపులకి ఎలానో ఉంటారనే భావనతో ఈ ప్రభుత్వం ఉంటే అది చాలా ప్రమాదకరం. ప్రకాశం జిల్లా ప్రజల మనోభావాలతో చెలగాటమాడడానికి వీలు లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిని సీరియస్‌గా తీసుకుని, దీని గురించి ఆలోచించి, వెనుకబడిన జిల్లాల లిస్టులోకి ప్రకాశం జిల్లాని కూడా చేర్చి, వెనుకబడిన జిల్లాలకు తూ.తూ మంత్రంగా ఇచ్చే యాభైకోట్లరూపాయల్ని తప్పనిసరిగా గతంలో ప్రభుత్వం డిమాండు చేసిన రీతిలో మనం దీనిని సాధించేందుకు, కేంద్రప్రభుత్వంపై సమిష్టిగా మనందరం రాజకీయాలకు అతీతంగా ఒత్తిడి తీసుకువద్దామని మనవి చేస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవుతీసుకుంటున్నాను.

డెప్యూటీ ఛైర్మన్: తిప్పేస్వామిగారూ... మీరు ఎప్పుడు కరవు గురించి చర్చ జరిగినా ముందుంటారు, ఈసారి మీపేరు లాస్ట్‌లో ఇచ్చారు విప్.

శ్రీ పి.జె.చంద్రశేఖర రావు: ఆయన్ని సరిగ్గా చెప్పుకోనివ్వండి సార్, ఆయన పరిస్థితి సభ్యులు శ్రీమతి పి. శమంతకమణి గారి లాంటిది కాదు కదా?

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్: చంద్రశేఖర్ రావు గారూ... మనం కరవు గురించి మాట్లాడుకున్నాము కదా, మీరు మాట్లాడినప్పుడు నాకు కూడా చాలా ఆవేదన కలుగుతోంది. వాస్తవానికి నేను కూడా కరవు ప్రాంతం నుంచి వచ్చిన వాడినే. అక్కడ ఏం కార్యక్రమాలు జరుగుతున్నాయో, ఆ కరవు ప్రాంతం నుండి వచ్చిన సభ్యులందరికీ కూడా తెలుసు. వాస్తవానికి పూర్తిగా భిన్నంగా మాట్లాడుతునప్పుడు, ఒక్కొక్కసారి మనం ఎందుకు ఇలా మాట్లాడుతున్నామనే ఆవేదన వస్తుంది. మీరు ఇంతకు ముందు రూ.50లు, రూ.60లు ఇస్తున్నారని మీరు చెప్పారు. మా ప్రాంతంలో నేను చూస్తున్నాను, రూ.160 నుంచి రూ.170లు దాకా కంటిన్యూస్‌గానే వస్తున్నాయి. 150 రోజులు ఇస్తున్నాము. ఎంతమంది అడిగినా దానిని ఆపేదేలేదు. నేను పర్సనల్‌గా ఫీల్డ్‌లెవెల్ వరకు వెళ్లి ఎంక్వైరీ కూడా చేస్తున్నాను. వాళ్లంతట వాళ్లు రాకపోతే

తప్ప, ప్రభుత్వం ఖచ్చితంగా 150 రోజులు పనిదినాలు కల్పిస్తుంది. నిజంగా ఉన్న సమస్యలని మనం హైలైట్ చేస్తే ప్రభుత్వం ఎక్కడెక్కడ కరెక్టు చేయాలో చేస్తుంది.

SRI P.J.CHANDRA SEKHARA RAO: Sir, This is not my own calculation and this is the calculation given by the Government.

SRI VENKATA SATISH KUMAR REDDY SINGA REDDY: But, being a Member of this House and I am also living in that area. సభ్యులు ఉమ్మారెడ్డిగారు చెప్పినట్లు, కంటిన్యూస్‌గా మూడునాలుగేళ్లు కరవు ప్రభావిత ప్రాంతంలో ఉన్న వ్యక్తిగా నేను చెబుతున్నాను. మీరు చెప్పిన వాటిలో కొన్ని వాస్తవానికి దూరంగా ఉన్నాయి. మీరు మాట్లాడేప్పుడు కూడా కరెక్టుగా ఉండేవి మాట్లాడితే, it will make some relevance.

శ్రీ గుండుమల తిప్పేస్వామి (శాసనసభా నియోజకవర్గం): అధ్యక్షా, ఈనాటి కరవుపై చర్చలో ఈ సభద్వారా ప్రభుత్వానికి విన్నవించేందుకు ఈ అవకాశమిచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అధ్యక్షా, మీరు కూడా నాతో పాటు కరవు ప్రాంతం నుంచి వచ్చిన వాళ్లే. కరవు గురించి మా కంటే బాగా తెలిసిన వ్యక్తి మీరు. అందుకోసమే దీర్ఘకాలిక చర్యలో భాగంగా, కరవు నివారించడానికి మీరు ఒక శపథాన్ని తీసుకుని, గడ్డాన్ని పెంచి నీళ్లు వచ్చేంతవరకు గడ్డం తీయనని శపథం చేసి సాధించిన నేత మీరు. మీకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, కరవు అంటే అనంతపురం, అనంతపురం అంటే కరవు. కరవుకు కేరాఫ్ అడ్రస్ అనంతపురం. ఈరాష్ట్రంలోనే కాక, దేశంలోనే కరవుకు నెలవైనది అనంతపురం. మన ప్రియతమ నాయకులు, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబునాయుడు గారు గతంలో ఎప్పుడూ లేనివిధంగా, నేను అనేకమంది ముఖ్యమంత్రులను చూశాను, అనేక ప్రభుత్వాలను చూశాను, ఎప్పుడూ ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా, వారం రోజులు అనంతపురంలోనే ఉండి, వారితోబాటు కేబినెట్ మంత్రులందర్నీ కూడా అనంతపురానికి తీసుకువచ్చి, వారినేకాక ఈ రాష్ట్రంలో ఉన్న ఐఏఎస్ అధికారులందర్నీ కూడ అక్కడకు తీసుకువచ్చి ప్రతి పంచాయితీకి, గ్రామానికి, మండలానికి మంత్రులని, ఐఏఎస్ అధికారుల్ని పంపించి మరి వేరుశెనగ పంటను ఏవిధంగానైనా కాపాడాలని కృషి చేయడం జరిగింది. ఒక అనంతపురం జిల్లాలోనే పదహేను లక్షల ఎకరాలలో వేరుశెనగ పంట వేయడం జరిగింది. బహుశా, దేశంలోనే మొట్టమొదటి స్థానం అనంతపురానిది. ఆ పంటను కాపాడాలని, రెయిన్‌గన్‌లనే అధునాతనమైన సాంకేతిక పరికరాలు తీసుకోవడం జరిగింది. కానీ, దురదృష్టవశాత్తు రెయిన్‌గన్ టెండర్లను పిలిచినప్పుడు, ప్రతిపక్ష పార్టీల వారు, అనవసరంగా కోర్టులకి వెళ్లడం వల్ల ఆలస్యం జరిగి, ఆ ప్రక్రియ అనంతపురం జిల్లాలో ప్రారంభించడం ఆలస్యం జరిగింది. కానీ అనుకున్న ఫలితాలను సాధించలేకపోయినా, రైతాంగంలో ఒక మనోధైర్యాన్ని కల్పించిన నేత మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు.

అనంతపురం నుండి ముఖ్యమంత్రి అయిన ఏ ముఖ్యమంత్రి కూడా వారం రోజులు అనంతపురంలో ఉన్న రోజులు లేవు. కానీ, మన ముఖ్యమంత్రిగారు చిత్తూరు జిల్లా నుంచి ముఖ్యమంత్రి అయినప్పటికీ, వారం రోజులు అనంతపురంలో క్యాంపు ఏర్పాటు చేసి కేబినెట్ మంత్రుల్ని, ఐఏఎస్ అధికారుల్ని తీసుకువచ్చి, కరవు నుంచి ఈ అనంతపురం జిల్లాను కాపాడడానికి చాలా ప్రయత్నం చేశారు. దురదృష్టవశాత్తు వర్షాలు రాకపోవడంతో పంట నాశనమైంది. దాదాపు 63 మండలాలలో తీవ్రమైన కరవు ఉంది. మరి కరవు నివారణకు స్వల్పకాలిక , దీర్ఘకాలిక ప్రణాళికలు ఉన్నాయి. స్వల్పకాలిక ప్రణాళికలో భాగంగా అనంతపురంలో హార్టీకల్చర్ మరియు సెరీ కల్చర్ ఉన్నాయి. ఈ రోజు రాష్ట్రంలో సెరీ కల్చర్ అనేది అనంతపురం జిల్లాలో అందులోనూ మడకశిర, హిందూపురంలో ఎక్కువగా ఉంది. ఈ రోజు అనంతపురం జిల్లా పంటలకు మంచి రేటు ఉంది, రైతులకు చాలా అనుకూలంగా ఉంది. దాదాపు కిలో రూ.500 నుంచి

రూ.600 వరకు పట్టుకి రేటు ఉంది. ఆ విధంగా మంచి లాభం వస్తుంది. కానీ, దురదృష్టవశాత్తు నీళ్లు లేవు. అందుకోసమే ప్రభుత్వం ఎక్కువ డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ ద్వారా నీళ్లు ఇవ్వడం జరిగింది. కానీ, మీద్వారా సెరీకల్చర్ రైతుల తరఫున కోరేదేమంటే, పంట ఉత్పత్తి పెంచడానికి విరివిగా పంటకు సబ్సిడీ రేట్లు ఇవ్వాలి. ఇప్పటికీ ఉపాధిహామీ పథకంలో షెడ్ల నిర్మాణానికి రెండు నుంచి మూడు లక్షల వరకు ఇస్తున్నారు. కానీ, లిమిటెడ్ సంఖ్యలో ఇస్తున్నారు. ప్రధానంగా అనంతపురం దక్షిణ ప్రాంతం ప్రజలు సెరీకల్చర్‌పైన ఆధారపడినవారు కాబట్టి ప్రతి రైతుకు కూడా ఈ పట్టు పరిశ్రమ ద్వారా ఈ షెడ్లను నిర్మించి ఇవ్వాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మ. 01.30

అధ్యక్షా, హార్టీకల్చర్‌కు సంబంధించి అనంతపురం జిల్లాలోని పండ్లకు ఢిల్లీలో కానీ, కోల్‌కతాలో కానీ, బొంబాయిలో కానీ, మంచి గిరాకీ ఉంది. ఆ పళ్లు మంచి రుచిగా ఉంటాయి. కానీ, ఆ ప్రాంతంలో నీళ్ళే లేవు. దానికి డ్రిప్ సౌకర్యం ఎక్కువ చేయాలని కోరుతున్నాను. అదేవిధంగా, అనంతపురం జిల్లాలోనే వేరుశనగ పంట కూడా ఎక్కువ పండుతుంది. దానికి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వర్తించడం లేదు. ఇది చాలా దురదృష్టకరం. ఈ మధ్యకాలంలోనే కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకురావడం జరిగింది. దయచేసి మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరేదేమిటంటే, మా అనంతపురం జిల్లాలోని రైతులకు ఈ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వర్తించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్ః అనంతపూర్ ఒకటేనా లేక రాయలసీమ అంతానా...

శ్రీ గుండుమల తిప్పేస్వామిః రాయలసీమ అంతా సార్. వేరుశనగ పంట ఎక్కువగా పండేది అక్కడే. పశ్చిమ గోదావరి జిల్లాలో ఎక్కువగా వరి పంటను పండిస్తారు. ఎక్కడైతే వేరుశనగ పంట పండిస్తారో ఆ పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఇప్పుడు ఉన్నటువంటి పథకాలు ఏమీ పనిచేయడం లేదు. It is a failure scheme. ఈ సంవత్సరం ఎవరైతే వేరుశనగ పంటను వేసుకుని నష్టపోయారో, వారికి ముఖ్యమంత్రిగారు పెద్ద మనసు చేసుకుని, పంట నష్టపరిహారం క్రింద మొట్టమొదటిసారిగా హెక్టారుకు రూ.15,000లు ఇచ్చారు. నిజంగా ఈ సభ తరఫున గౌరవ ముఖ్యమంత్రిగారికి ప్రత్యేకంగా ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. ఆవిధంగా ఈ సంవత్సరం ఒక్క అనంతపురం జిల్లాకు రూ.1,000 కోట్లు అంచనా ప్రకారం పంపించారు. అంటే, 6 లక్షల హెక్టార్లకు దాదాపు 15 లక్షల ఎకరాలకు వెయ్యి కోట్లు కావాలని పంపడం జరిగింది. అయితే, ఇది స్వల్పకాలికమే. ప్రస్తుత సమస్యల వరకే చూశారు. అదేవిధంగా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ గురించి కూడా ఆలోచించాలి.

అధ్యక్షా, ఈ సమస్యలకు శాశ్వత పరిష్కార చర్యలు కావాలంటే ఏకైక మార్గం కృష్ణా నది నీటిని తీసుకురావడమే. శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా హంద్రీనివా సుజల స్రవంతి ద్వారా నీటిని అందించాలి. అది శ్రీ నందమూరి తారక రామారావుగారి స్వప్నం అది. ఈ మధ్యకాలంలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులను ఈ ప్రాజెక్టుల కోసం పరిగెత్తించినప్పుడు ఈ కరవు జిల్లాలను హంద్రీనివా సృజల స్రవంతి ద్వారా కాపాడడానికని అర్థమవుతోంది. ఆ విధంగా చరిత్రలో మొట్టమొదటిసారి ఈ హంద్రీనివా సృజల స్రవంతి పథకం ద్వారా రాయలసీమ జిల్లాలకు నాకు తెలిసినంతవరకు దాదాపు వంద టిఎంసిల నీరు ఇచ్చారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు గోదావరి జలాల ద్వారా రాయలసీమ ప్రాంతాలకు మళ్ళించిన నేత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారే. దాదాపు 3,4 పంటల వరకు నీళ్ళు వచ్చాయి. కొన్ని వందల చెరువులను నింపాము. ఇంకా హిందూపూర్, మడకశిర, కదిరి ప్రాంతాలకు కూడా నీటిని తీసుకురావలసిన అవసరం చాలా ఉంది.

అధ్యక్షా, అనంతపురం జిల్లాలో దాదాపు 1500 అడుగుల వరకు బోర్లు వేసినా కూడా నీళ్ళు రావడం లేదు. అనంతపురం జిల్లాలో దాదాపు 10, 15 ఎకరాలు ఉన్న రైతులు కూడా బెంగుళూరు ప్రాంతాలకు వలసపోయారు. వారి పరిస్థితి హృదయవిదారకంగా ఉంది. వారికి కనీసం కూలిపనులు అన్నా దొరుకుతాయన్న ఉద్దేశ్యంతో బెంగుళూరుకు వలసపోయారు. వారందరిని మళ్ళీ గ్రామాలకు, స్వస్థలాలకు రప్పించే ఏకైక కార్యక్రమం ఈ హంద్రీనీవా సుజల స్రవంతి పథకం. ఈ పథకం వస్తేనే మా జిల్లా బ్రతుకుతుంది, లేకపోతే గ్రామాలకు గ్రామాలు, జిల్లాలకు జిల్లాలే ఖాళీ అయ్యేటటువంటి పరిస్థితి వస్తుంది. ముఖ్యమంత్రిగారు మరింత చొరవ తీసుకుని ఈ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతున్నాను. అంతేగాకుండా, గొల్లపల్లి రిజర్వాయరుకు కూడా నీటిని వదలడం వలన ఆ ప్రాంతాలకు నీరు రావడం వలన అక్కడి రైతులకు ఒక మనోధైర్యం ఏర్పడింది. ఎందుకంటే, శ్రీశైలం నుంచి గొల్లపల్లి వరకు నీళ్ళు వచ్చాయంటే, ఈ ప్రాంతం కేవలం 100 కి.మీ.ల లోపే ఉంది. దాదాపు ఆరు నెలలలోపే పూర్తిస్థాయిలో నీళ్ళు వస్తాయనే మనోధైర్యంతో ఆ ప్రాంత ప్రజలు ఉన్నారు.

అధ్యక్షా, అందుకనే ఆ ప్రాంతాలలో నీళ్ళు లేకపోయినా ట్యాంకర్ల ద్వారా నీటిని తోడి, హార్టికల్చర్ విధానాన్ని ప్రారంభించారు. ఎందుకంటే, జూలై, ఆగష్టు మాసాలలో నీళ్ళు వస్తాయని, దాదాపు 6, 7 నెలలు పంటలను జాగ్రత్తగా కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో అక్కడ మిగిలిన రైతులు చాలా వ్యయప్రయాసల కోర్చి ట్యాంకర్ల ద్వారా నీటిని జాగ్రత్తగా ఉపయోగించుకుంటున్నారు. తమ ద్వారా ప్రభుత్వాన్ని ఏమి కోరుతున్నానంటే, హార్టికల్చర్ క్రాప్ మరియు వక్క తోటలు అక్కడ ఎక్కువగా ఉన్నాయి. ఈ వక్క తోటలకు కూడా ప్రభుత్వం ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాను. ఎందుకంటే, ఒక్కొక్క ట్యాంకరు నీరు దాదాపు రూ.1,000ల చొప్పున తీసుకుంటున్నారు. ఈ ట్యాంకర్ల వలన రైతులకు విపరీతమైన ఖర్చు ఎక్కువగా అవుతోంది కాబట్టి, ప్రభుత్వమే ఈ హార్టికల్చర్ తోటలకు, వక్క తోటలకు ఉచితంగా నీటిని అందించవలసిందిగా రైతుల తరఫున తమ ద్వారా ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, మా ప్రాంతంలో హార్టికల్చర్‌తో పాటు సెరీ కల్చర్ కూడా బాగా పనిచేస్తోంది. దానిమ్మ తోటలు కూడా ఎక్కువగా ఉన్నాయి. తమ ద్వారా ఒక విషయం మనవిచేసేది ఏమిటంటే – ఆ దానిమ్మ తోటలకు బాగా వైరస్ చేరింది. ఆ దానిమ్మ తోటలకు కనుక వైరస్ లేకపోతే, ఆ రైతులు కోటీశ్వరులు అవుతారు. కానీ, దురదృష్టవశాత్తు దానిమ్మ తోటలలో వచ్చిన వైరస్‌ను ఏ విధంగా నిర్మూలించాలో ఇంతవరకు కనుక్కోలేకపోయారు. ఇంత అధునాతనమైన పద్ధతులు వచ్చినా, దేశంలో కానీ, రాష్ట్రంలో కానీ, ప్రపంచంలో కానీ, దానిమ్మకు వచ్చే వైరస్‌ను ఎవరూ నివారణ చేయలేకపోయారు. దాదాపు ఒక ఎకరం దానిమ్మ పంట పండితే, ఒక్కొక్క పంటకు దాదాపు రూ.3 లక్షల నుంచి 5 లక్షలు వస్తుంది. నేనే పది ఎకరాలకు ఇన్‌పుట్ పెట్టాను. మూడు సంవత్సరాల పాటు పంట వచ్చింది. దాదాపు రూ.60, 70 లక్షల రూపాయల వరకు ఆదాయం వచ్చింది. ఆ తరువాత మొత్తం పోయింది.

మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్: ఆ ప్రాంతంలో ఎకరాకు రూ.10,00,000ల వరకూ ఆదాయం వచ్చింది.

శ్రీ గుండుమల తిప్పేస్వామి: అవును. మీరు చెప్పింది నిజమే. ఆ రకంగా ఈ ప్రభుత్వం దానిమ్మకు సంబంధించి రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ పైన ప్రత్యేక శ్రద్ధ కనపరచి ఆ వైరస్‌ను కనుక నివారించగలిగితే రైతులకు ఉపయోగం చేసినట్లు అవుతుంది. ఎందుకంటే, వీటికి ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వవలసిన అవసరం లేదు. దానిమ్మ పంటపైన తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అలాగే, కూలీలకు ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా పనులు కల్పిస్తున్నారు. ప్రభుత్వం ఏమి చెపుతోందంటే, farm ponds తీసుకోమని చెపుతోంది. కేవలం ఈ ఫార్మ్‌పాండ్స్ ద్వారా water conservation activities ఏవైతే ఉన్నాయో, వాటికి గట్లు వేయడం కానీ, గనాలు వేయడం కానీ, చెక్‌డ్యామ్‌లు మొదలైనవి చేయవలసిన అవసరం ఉంది. ఆ

విధంగా, ఈ ఫార్మ్‌పాండ్స్‌తో పాటు వాటర్ కన్జర్‌వేషన్ యాక్టివిటీస్‌ను కూడా పెద్ద ఎత్తున చేపడితే, అప్పుడు రైతాంగానికి కానీ, కూలీలకు కానీ ఉపయోగంగా ఉంటుంది. ఆ విధంగా చేయాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, ఇక పశువుల మేత లేక చాలా ఇబ్బంది అవుతోంది. ఈపాటికే ప్రభుత్వం సరఫరా చేయవలసి ఉంది. 75 శాతం సబ్సిడీతో వెంటనే పశుగ్రాసాన్ని సరఫరా చేయవలసి ఉంది. ఇప్పటికే పశువులన్నీ కబేళాలకు తరలిపోతున్నాయి. వెంటనే పశుగ్రాసం ఇప్పించవలసిందిగా తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఇక త్రాగునీటికి సంబంధించి చూస్తే, కొన్ని వందల బోర్లు డ్రై అయిపోయాయి. పి.ఎ.బి.ఆర్. నుంచి పథకం ఉన్నా, సరిగ్గా ప్రజలకు అందుబాటులో లేకుండా పోతోంది. దాని ద్వారా పెద్దగా ప్రయోజనం లేదు. కానీ, ఈనాడు గ్రామాలకు గ్రామాలే నీటికోసం కొన్ని వందల కిలోమీటర్లు దూరం పోతున్నాయి. ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని చెబుతోంది. రైతులేమో వారికి నీళ్ళు ఇస్తే, రైతుల తోటలు ఎండిపోతున్నాయని అంటున్నారు. ఇంక నీటిని ఎక్కడ నుంచి రవాణా చేస్తారు? అందువల్ల నేను ఏమి సజెస్ట్ చేస్తున్నానంటే – ఒకటి కాదు, రెండు కాదు, ఐదు కానీ, పది కానీ బోర్లు వేయండి. ట్రాన్స్‌పోర్ట్ చేయడానికి రైతులకు నీళ్ళు ఇస్తే, నా తోటలు ఎండిపోతున్నాయని, మా తాతల కాలం నుంచి కాపాడుకుంటూ వస్తున్న వక్క తోటలను, అరటి తోటలను నేను వదులుతానా? ఈరోజున మీకు నీళ్ళు ఇస్తే నేను నష్టపోతాను కావున నీళ్ళు ఇచ్చేది లేదని అంటున్నారు. ఈ ట్యాంకర్ల వాళ్ళేమో ఒక ట్యాంకరుకు రూ.450లు ఇస్తారు. అది ఏ మూలకు కాదు. తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరేది ఏమిటంటే – ఎక్కడైతే నీళ్ళు లేవో, అక్కడ యుద్ధ ప్రాతిపదికన బోర్లను త్రవ్వండి. ప్రభుత్వం యొక్క ప్రధాన బాధ్యత కనీస అవసరాలైన త్రాగునీరు, సాగునీరు ఇవ్వవలసిన బాధ్యత ఉంది. అనంతపురం జిల్లా దక్షిణ తాలూకాలో హంద్రీనివా ద్వారా వచ్చిన నీళ్ళ వల్ల ఉరవకొండ, గుంతకల్లు, ధర్మవరం, సింగనమల మొదలైన ప్రాంతాలలో కొంతవరకు ఫరవాలేదు, చెరువులలో నీళ్ళు వచ్చాయి. భూగర్భ నీటిమట్టం కూడా పెరగడం వలన ఆ ప్రాంతాలు కొంతవరకు అభివృద్ధి చెందాయి. మిగతా ప్రాంతాలైన హిందూపూర్, మడకశిర, పెనుగొండ, కదిరి, పుట్టపర్తి ప్రాంతాల్లో తీవ్రమైన, వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడి నెలకొని ఉంది.

అధ్యక్షా, మనకు ప్రస్తుతం పండగలు వస్తున్నాయి. రాయలసీమలో ఉగాది పెద్ద పండగ. కోస్తా ప్రాంతంలో ఏ విధంగా సంక్రాంతి పండగ పెద్దదో, రాయలసీమలో ఉగాది పండగ అంత పెద్దది. పండగ దినంలోనైనా నీళ్ళు ఇవ్వరా అని మాకు రోజూ ఫోన్లు వస్తున్నాయి. సంవత్సరానికి ఒకసారి వచ్చే పండగ. నీళ్ళు లేకపోతే ఎలా? ఇంత దౌర్భాగ్యమైన పరిస్థితి ఉంటే ఎలా? అని అక్కడి ప్రజలు మమ్మల్ని నిలదీస్తున్నారు. కావున ఈ ప్రభుత్వం దానిని యుద్ధప్రాతిపదికపైన నీళ్ళ సౌకర్యానికి ఏ మాత్రము లిమిట్ లేకుండా రాయలసీమ ప్రాంతానికి నీటికోసం వెంటనే కావలసిన నిధులను కేటాయించ వలసిందిగా తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, ఏదిఏమైనా ఈరోజున కరవుపైన మాట్లాడించినందుకు చాలా సంతోషం. కరవుకు సంబంధించి శాశ్వత ప్రాతిపదికన నివారించడానికి వెంటనే హంద్రీనీవా కాలువను నంద్యాల నుంచి జీడిపల్లి వరకు వెంటనే మంజూరు చేశారు. అందుకు ముఖ్యమంత్రిగారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. దానిని కూడా వెంటనే వెడల్పు చేసే కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయాలి. జూలై, ఆగష్టు, సెప్టెంబరు మాసాల లోపల మిగతా ప్రాంతాల్లో చెరువులకు నీటిని అందిస్తేనే ఆ ప్రాంత ప్రజలు, పంటలు కూడా బతుకుతాయి. లేకపోతే బ్రతకడం చాలా కష్టమవుతుంది. దానితోపాటు మాకు రాజధాని ప్రాంతం కూడా చాలా దూరంగా ఉంది. ఇది కరవుతో సంబంధం లేకుండా ప్రశ్న అడుగుతున్నాను. మేము రాజధానికి రావాలంటే దాదాపు 750 కి.మీ. దూరం ఉంటోంది. దాదాపు 14 గంటల ప్రయాణం. అక్కడ నుంచి ఒకటే రైలు ఉంది. మీరు అమరావతి నుంచి అనంతపురానికి ఎక్స్‌ప్రెస్ రైలు అని అంటున్నారో, అది వెంటనే వచ్చేట్లుగా

చేయవలసిందిగా కోరుతున్నాను. ఎందుకంటే, సభలో సంబంధిత మంత్రిగారు కూడా ఉన్నారు కాబట్టి చెబుతున్నాను. ఆయన చాలా సౌమ్యుడు, మంచి మంత్రి. శ్రీ సిద్ధా రాఘవగారు పాజిటివ్‌గా స్పందిస్తారు కాబట్టి తమ ద్వారా ఆయనని కూడా అడుగుతున్నాను. కరవుకు సంబంధించి ఏ విధంగా అడుగుతారో, అలాగే అనంతపురం నుంచి అమరావతికి వచ్చే రైలు కూడా త్వరితగతిన వచ్చేలా చేయాలని కోరుతున్నాను. రాష్ట్రంలో రాజధానికి సుదూరంగా ఉన్న రాష్ట్రం కేవలం అనంతపూరే. దానితోపాటు కరవుకు సంబంధించి శాశ్వత నివారణ చర్యలను యుద్ధప్రాతిపదికపైన చేపట్టి కృష్ణా నది నీటిని అనంతపురం జిల్లాకు అలాగే, రాయలసీమ, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు కూడా మళ్ళించే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని తమ ద్వారా కోరుతున్నాను. అధ్యక్షా, ఈ విధంగా కరవుకు సంబంధించి సభలో మాట్లాడే అవకాశం కల్పించినందుకు మీకు, ప్రభుత్వానికి కూడా ధన్యవాదాలు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

మ.1.40

శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు(ఉపాధ్యాయ నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం): అధ్యక్షా, కరవుపై మాట్లాడేందుకు నాకు ఈ అవకాశమిచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నేను రెండో సారి ఈ శాసన పరిషత్తులో సభ్యునిగా పనిచేస్తున్నాను. నేను సభ్యునిగా ఇక్కడకు వచ్చినప్పటి నుంచి అంటే సుమారు మూడు నాలుగు సార్లు ఈ కరవుపైన చర్చిస్తున్నాము. అయితే టెక్నాలజీ పెరగడం వల్ల, కరవు తీవ్రతను ముందుగానే అంచనా వేసి వచ్చే నష్టాలను తగ్గించుకోగలుగుతున్నాము కానీ, అసలు కరవు అనే పదం వినపడకుండా శాశ్వత పరిష్కారాన్ని మాత్రం మనం అందుకోలేకపోతున్నాము. మరి ముఖ్యమంత్రి గారు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కొరకు దోమలపై దండయాత్ర ప్రకటించడం జరిగింది. అందరిలో ఒక అవేర్‌నెస్‌ని కూడా తీసుకురాగలిగారు. అలాగే, కరవుపై కూడా ఒక దండయాత్రని ప్రకటించి ప్రజలలో అవేర్‌నెస్‌ని తీసుకువచ్చి పూర్తిగా ఈ కరవు లేకుండా చేయాలి. అంతేగాక, ప్రతిఒక్కరికీ దీనిలో భాగస్వామ్యం ఉందనే అవేర్‌నెస్ తీసుకురావడం ద్వారా దీనిని పరిష్కరించే అవకాశం ఉంటుందని నేను భావిస్తున్నాను. ఎందుకంటే, ఇప్పుడు కరవు అనే సరికి మన మంత్రిగారు కరవు ఎక్కడెక్కడ, ఎన్నిమండలాలలో ఉందనే రిపోర్టు ఇచ్చారు. కరవు వచ్చిన తరువాత ఆ కరవు గురించి చర్చిస్తున్నాము తప్ప అసలు కరవు మీద నోట్ ఇవ్వడానికి అవసరం లేనివిధంగా ఏర్పాట్లు చేయడానికి ఆలోచించాల్సిన అవసరం ఉందని నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. వాతావరణ ప్రభావం వల్ల, భౌగోళిక స్వరూపం వల్ల, వెనుకబాటు తనం వల్ల, ప్రతి పౌరుడి బాధ్యతా రాహిత్యం వల్ల, పరిశ్రమలు మూతపడడంవల్ల, నిరుద్యోగులు పెరగడం వల్ల కరవు వస్తుంది. కనుక కరవుకి మనం వివిధ రకాల నిర్వచనాలు ఇవ్వచ్చు. కాబట్టి వీటన్నింటినీ అడ్రస్ చేసేవిధంగా, అరెస్ట్ చేసే విధంగా శాశ్వత పరిష్కార చర్యలను మనం తీసుకోవాలని నేను మీ ద్వారా కోరుతున్నాను.

అధ్యక్షా, అదేవిధంగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ముందుగానే టెక్నాలజీ తెలిసినవారు కావడం వల్ల విశాఖపట్నంలో హుద్‌హుద్ తుఫాను వచ్చినప్పుడు, అక్కడకు వచ్చి వారం రోజులు బస్సులోనే ఉండి చర్యలు చేపట్టడం వల్ల కొంతవరకు నష్టాన్ని నివారించి, మరల వారం రోజులలోనే యథాస్థితికి తీసుకురాగలిగారు. అలాగే, నెలల తరబడి సమయం పడుతుందనుకున్న విద్యుత్ సమస్యను పది రోజులలోనే పరిష్కరించి, ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేసి కరెంటు ఆదా చేయడమే కాకుండా, లోటులో ఉన్న విద్యుత్‌ని మిగులు విద్యుత్‌కు తీసుకువచ్చారు. ఏ రాష్ట్రంలో ప్రమాదం జరిగినా, అక్కడ చనిపోయిన వారిలో గానీ, క్షతగాత్రులలో గానీ తప్పనిసరిగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల వారు ఉంటారు. అంటే మా జిల్లాల వారికి కష్టపడే తత్వం ఉందని తెలుస్తుంది. మా జిల్లాలో ప్రజలకు ఆకలి తీరేందుకు సరైన మార్గం లేకపోవడం వల్ల, వారికి ఆ కరవుని అధిగమించే శక్తి కానీ, ప్రత్యామ్నాయం కానీ లేకపోవడం వల్ల బతుకుతెరువు కోసం కుటుంబాలను వదిలి దూర ప్రాంతాలకు వలస వెళ్లి అక్కడ

ప్రమాదాలకు గురవుతున్నారు. మరి ఎక్కడికక్కడ మనం వివిధ రకాల కార్యక్రమాల ద్వారా వారి అవసరాలకి తగిన విధంగా అక్కడి వాతావరణాన్ని మార్చగలిగినట్లైతే వలసలు తగ్గుతాయి. పలు జిల్లాలలో గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు పట్టణాలకు వలస రావడం వల్ల గ్రామీణ ప్రాంతాలలో జనాభా తగ్గి, పట్టణాలలో పెరిగిపోతున్నారు. ఈ రకమైన అసమతుల్యత వల్ల మనకు త్రాగునీరు గానీ, ఆహారపదార్థాలు గానీ అధికంగా అందకపోవడం కరవు ప్రాంతాలకు దారి తీస్తుంది. చివరకు రైతు వ్యవసాయం చేయకుండా, దానికన్నా ప్రత్యామ్నాయంగా వేరే ఏమైనా చేస్తే లాభం వస్తుందని, రైతులందరూ ఉపాధికోసం వెళ్ళి, ఉపాధి దొరకక ఇబ్బందులు పడుతున్నారు. తద్వారా వ్యవసాయ ఉత్పత్తులు తగ్గి, కరవు ఏర్పడుతుంది. చాలా మంది రైతులు పట్టణాలకు దగ్గరగా ఉన్న తమ భూముల్ని వ్యవసాయానికి ఉపయోగించకుండా, రియల్ఎస్టేట్ భూములుగా మార్చడం జరుగుతోంది. అందువల్ల ఆ భూమి వ్యవసాయానికి గానీ, ఇటు నివాసంగా గానీ మారకుండా ఖాళీగా ఉంటుంది. దానివల్ల కూడా దిగుబడి తగ్గిపోతుంది. ఆ పరిస్థితుల్లో ధరలు పెరిగి అది కూడా కరవుకి దారితీస్తుందని నా భావన. కాబట్టి ఇవన్నీ కూడా సమగ్రంగా అధ్యయనం చేయాలి.

అధ్యక్షా, ఇప్పుడు వేసవికాలం వచ్చేస్తోంది. ఈ మూడు నెలల్లో అధికారులు బోరుబావులు బాగు చేయాలని, నీరు అందించాలని ఇప్పుడు ఆలోచిస్తారు. అలాకాకుండా ముందుగానే దానిని గురించి ఆలోచించి, ప్లాన్చేసుకుని, దానికి బడ్జెటు కేటాయించి, చర్యలు తీసుకుంటే, ఈ వేసవికాలంలో త్రాగునీటికి గానీ, ఇతర కార్యక్రమాలకు గానీ, ఎద్దడి లేకుండా ఉంటుంది. ప్రజలు బిందెలతో దూరప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకునే దుస్థితి నుండి బయట పడడానికి అవకాశం ఉంటుందని కూడా మీ ద్వారా నేను మనవి చేస్తున్నాను. మరి మనం ఇవన్నీ చేయాలంటే ఉద్యోగులు కూడా ఎక్కువ మంది ఉండాలి. ఈరోజు ఆర్.డబ్ల్యు.ఎస్లో గాని, పంచాయితీ రాజ్శాఖలో గాని ఎంతమంది ఈ బోరుబావులకు సంబందించి వర్కు ఇన్స్పెక్టర్లు, టెక్నీషియన్లు ఉన్నారు? ఎంతమంది పని చేస్తున్నారు? ఇంకా రిక్వైర్మెంట్ ఎంత ఉంది? దానిని పూర్తిచేయడానికి ఏమేమి చర్యలు తీసుకోవాలనేది ఆలోచన చేయాలని మీ ద్వారా నేను కోరుతున్నాను. పూర్వం భూసార పరీక్షలకు సంబంధించి, రైతులకు సూచనలు ఇవ్వడం కోసం అంటే నీరు ఎంత ఉంది, భూమిలోని పోషక విలువల శాతాన్ని గురించి తెలియజేయడానికి జియోలజిస్టులు ఉండేవారు. కానీ, ఇప్పుడు వాళ్లు కూడా తగ్గిపోయారు. రిక్రూట్మెంట్ కూడా చేయడం లేదు. అదేవిధంగా గతంలో వ్యవసాయానికి వ్యవసాయ అధికారులు కూడా ఎక్కువ మంది ఉండేవారు, వారి సంఖ్య కూడా రానూ రానూ తగ్గుతుంది. కాబట్టి, మనం దీనిని బ్యాలెన్స్ చేసుకోవాలి. ఈరోజు మన ప్రజలకు సేవలు అందించే టెక్నీషియన్స్, మిగతా సిబ్బంది తగ్గుతున్నారు. మనం ఎప్పటికప్పుడు వారిని రీజనరేట్ చేస్తూ, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వారు అప్డేట్ అయ్యేవిధంగా చూడాలి, కానీ అది కొరవడింది. మన ముఖ్యమంత్రిగారు రైతు పక్షపాతి కాబట్టి వారు నీటికి సంబంధించిన కార్యక్రమాల్లో ముందుచూపుతో అనేక రకాల చర్యలు తీసుకుని, పట్టిసీమ ప్రాజెక్టుని తీసుకువచ్చి ముందుకు వెళుతున్నారు. ఇటువంటి విషయాలలో శ్రద్ధ వహించి, తప్పనిసరిగా అధికారులను నిరంతరం ప్రోత్సహించి, కరవుకి శాశ్వత పరిష్కారం కనుక్కోవాలని చెబుతున్నాను.

అదేవిధంగా వెనుకబడిన జిల్లాలకు స్పెషల్ డెవలప్మెంట్ ప్యాకేజి కింద ఏడు జిల్లాలకు కలిపి యాభై కోట్ల రూపాయల చొప్పున ఇచ్చారు. దాని గురించి పెద్దలందరూ చెప్పారు, నేను కూడా చెబుతున్నాను, మన వెనుకబాటుతనాన్ని పారద్రోలే కార్యక్రమాలను పూర్తి చేయడానికి ఈ డబ్బులు సరిపోవు కాబట్టి, కేంద్రంతో చర్చించి దానికి నిధులు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా నేను కోరుతున్నాను. కేంద్ర సహాయం కోసం ప్రభుత్వం ఇచ్చిన నోట్లో సుమారు రూ.2,241 కోట్ల అమౌంట్ కేంద్రప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అంచనా వేశారు. కానీ, మన అంచనాల ప్రకారం సుమారు రూ.3,173కోట్లు

అవసరం ఉంది. ముఖ్యమంత్రి గారు చాలా సార్లు కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాము, మన అంచనా ప్రకారం ఇచ్చిన నిధులు మంజూరు అయితే దానిని జిల్లాలకు డిస్ట్రిబ్యూట్ చేస్తామన్నారు, ఒకవేళ రానట్లయితే దానిని రాష్ట్రప్రభుత్వ నిధులు నుంచి ఖర్చు చేస్తామని వారు చెప్పారు. కానీ కేంద్రం నుండి రావాల్సిన నిధులు రాలేదని మన రాష్ట్రప్రభుత్వ నిధుల నుంచి ఖర్చు పెడితే, వేరే కార్యక్రమాలకు నిధులు తగ్గుతాయి కనుక, కేంద్రం మీద ఒత్తిడి పెంచి మనకు రావాల్సిన నిధులను కేంద్రంతో మనకున్న సత్సంబంధాలు, సమన్వయంతో వేగవంతం చేసి, నిధులు తెచ్చుకునే విధంగా కృషిచేయాలని నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మ.1.50

కేంద్రం మీద ఒత్తిడి పెంచి మనకు రావల్సిన నిధులను తెచ్చుకునే విధంగా మనకు ఉన్నటువంటి సత్సంబంధాలను, సమన్వయాన్ని వేగవంతం చేసి నిధులను తెచ్చుకోవలసినదిగా నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ప్రతీది మనకు కేంద్రంతో లింక్అప్ అయ్యి ఉంది కాబట్టి, కేంద్రంలో కూడా మన ప్రభుత్వం తరఫున కొంత మంది అధికారులు పనిచేస్తున్నారు. అలా కాకుండా వేరే యంత్రాంగాన్ని ఆలోచించి నిరంతరం కేంద్రంతో మనకు రావాలసినటువంటి, ఇక్కడ జరగవలసినటువంటి కార్యక్రమాలు ఏవైతే ఉన్నాయో వాటన్నిటికి ఒక అధికార బృందాన్ని పర్మినెంట్‌గా ఢిల్లీలో ప్రత్యేకంగా పెట్టుకోగలిగితే వారు ఎప్పటికప్పుడు పర్స్యూ చేయడం ద్వారా వారికి రావాల్సిన నిధులు ఆలస్యం కాకుండా, వేగంగా రావడానికి ఇతర రాష్ట్రాల కంటే ముందుగానే తెచ్చుకోవడానికి మనకు అవకాశం ఉంటుంది. అందువలన ఆ దిశగా ఆలోచన చేయాలని ప్రభుత్వానికి సూచిస్తూ నాకు ఇచ్చిన సమయంలో ఈ రకంగా మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదములు తెలియజేసుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఎం.వి.యస్.శర్మ: అధ్యక్షా, రాష్ట్రంలో మనం పంట వేసే విస్తీర్ణం క్రమంగా తగ్గుతుంది. పంట విస్తీర్ణం 67.26 లక్షల హెక్టార్ల నుండి 62 లక్షల హెక్టార్లకు తగ్గింది. మనకు 2 లక్షల హెక్టార్లు ఈ 7 మండలాలకు కలిసాయి. అది తీసేస్తే మనం పంట పండించే ఏరియా 7 లక్షల హెక్టార్లు తగ్గింది. 13 లక్షల ఎకరాల భూమిని పరిశ్రమలకు అధనంగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నప్పుడు పంట విస్తీర్ణం తగ్గడం అనేది కొనసాగుతుంది. మన రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి విషయంలో దీని వల్ల చాలా ఒత్తిడి వస్తుంది. దీనికి సంబంధించి మన ప్రభుత్వానికి ఎటువంటి ఒక long range plan ఉన్నట్లు కనపడడం లేదు. భవిష్యత్తులో ఇది ఆందోళన కలిగించేటువంటి సీరియస్ ఇష్యూ. ఎందుకంటే, నెట్ ఏరియా తగ్గిపోవడం అంటే దాదాపుగా ఒక జిల్లా మొత్తం వ్యవసాయం ఎగిరిపోయినట్లే. ప్రకాశం జిల్లా వ్యవసాయ విస్తీర్ణం దాదాపు 6 లక్షల హెక్టార్లు, చిత్తూరు 3.71, అనంతపురం 8.5 లక్షల హెక్టార్లు. అంత, అంత విస్తీర్ణంలో వ్యవసాయం చేసేది. దాదాపు అంత ఏరియాలో క్రమంగా వ్యవసాయం తగ్గిపోతుంటే ఇది చాలా సీరియస్ ఇష్యూ. భవిష్యత్తులో ఆహార కరవుకు, ఆహార అభద్రతకు దారి తీస్తుందని నా అభిప్రాయం.

అధ్యక్షా, రెండవది 301 మండలాలలో ఏదైతే కరవు మండలాలు ఉన్నాయో, ఈ మండలాలలో మొత్తం కరవు సంభవించే విస్తీర్ణం చూసుకుంటే 30 లక్షల హెక్టార్ల మేరకు పంట లేకుండా పోయింది. అంటే దాదాపు సగం రాష్ట్రం ఈ కరవు వల్ల పంట లేకుండా పోయే పరిస్థితి ఉంది. ఇది చాలా క్లిష్టమైన సమస్య. దీనికి ప్రాధాన్యత ఇవ్వాలి. కేవలం కరవు అంటే మంచినీళ్లు, పశువులకు నీళ్లు, గడ్డి ఇస్తున్నారా లేదా మెడికల్ క్యాంపులు పెట్టామా లేదా అనేది చూస్తున్నారు తప్ప ఆహారం కొరత ఏర్పడినప్పుడు దానికి లాంగ్ రేంజ్ ప్రభావం ఎంత ఉంటుంది అనే దాని మీద ప్రభుత్వం సీరియస్‌గా భవిష్యత్తులో అయినా దృష్టి పెట్టాలి. ఈ రోజు నిర్దిష్టంగా ప్రతిపాదనలలో మొదటిది మన సర్వే ప్రకారం రాష్ట్రం అంతా గ్రౌండ్ వాటర్ నిల్వలు తగ్గినా, ఉత్తరాంధ్ర ప్రాంతంలో నెట్ రైజింగ్ గ్రౌండ్ వాటర్ లెవెల్స్ 0.26 మీటర్లు. మన దగ్గర నీళ్లు ఉన్నాయి.

ఉత్తరాంధ్ర ప్రాంతంలో గ్రౌండ్ వాటర్ నిల్వలు పెరిగాయి. నీళ్లు ఉండి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో కరవు ఉందంటే దానికి కారణం ప్రభుత్వం దృష్టి పెట్టడంలేదనేది నా విమర్శ. అక్కడ చిన్న చిన్న కమతాల రైతులు, అర ఎకరం, పావు ఎకరం ఉండి అది కూడా రెండు మూడు చోట్ల డివైడ్ అయ్యి ఉన్నందువలన, రైతులు సొంతంగా బోర్‌వెల్స్ వేసుకోవడానికి చొరవ చూపించరు. రాయలసీమలో ఏవిధంగా రెయిన్‌గన్స్‌ను చేపట్టారో, అదే విధంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో బోర్‌వెల్స్ వేయడానికి ప్రభుత్వం ఒక సహకార వ్యవస్థను ఏర్పాటు చేయాలి. రైతుల చొరవకు వదలి పెడితే ఎప్పటికీ బోర్‌వెల్స్ వేసుకోరు. మనకు 8,9 మీటర్ల క్రిందన నీరు పుష్కలంగా దొరుకుతూ కరవు ఉండవలసిన అగత్యం లేదు. అందుచేత, ఉత్తరాంధ్ర, గ్రామీణ ప్రాంతంలో బోర్‌వెల్స్ వినియోగం చాలా తక్కువగా ఉంది కాబట్టి, ప్రభుత్వం బోర్‌వెల్స్ వేయడానికి అవసరమైన ఒక స్కీమ్‌ను ప్రవేశపెట్టి, సహకార స్కీమ్‌ను ఏర్పాటు చేసి రైతులను అందులో సభ్యులుగా పెడితే ఉత్తరాంధ్రలో కరవు తాకిడిని చాలా సులువుగా తట్టుకోవచ్చు అనేది మొదటి ప్రతిపాదన.

అధ్యక్షా, రెండవది, జంజావతి ప్రాజెక్టును చాలా త్వరితగతిన పూర్తి చేయవచ్చు. కానీ, ఒరిస్సా తో ఉన్న వివాదం వలన దానిని వదులుకుంటున్నాము. దాని మీద దృష్టి పెట్టడం లేదు. దాని ప్రస్తావన ఎక్కడా రావడం లేదు. గ్రావిటేషన్ వలన విజయనగరం జిల్లా మొత్తం కవర్ అవుతుంది. అందువలన, జంజావతి ప్రాజెక్టుకు ప్రయారిటీ ఇవ్వాలనేది, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు గురించి ప్రతీ సమావేశంలోనూ ప్రస్తావిస్తున్నాను. సక్సెస్‌ఫుల్‌గా ఈ ప్రభుత్వం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును అటకెక్కించారు. ప్రతిపాదనే లేదు. ఇదివరకు ప్రతిపాదన ఉండేది. Viability ఉందా, లేదా పరిశీలిస్తామని గతంలో చెప్పారు. ఇప్పుడు మొత్తం యాక్షన్ ప్లాన్‌లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రస్తావన ఎక్కడా లేదు. నీళ్లు సముద్రంలో కలసిపోతున్నప్పుడు లిఫ్ట్ చేసి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేస్తే 7.5 లక్షల ఎకరాలకు రెండు పంటలు పండే అవకాశం ఉంటుంది. కాబట్టి దానికి ప్రైయారిటీ ఇవ్వాలి.

అధ్యక్షా, చివరి అంశం ఏమిటంటే, విజయనగరం జిల్లాలో ముఖ్యంగా జూట్, ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడినవి. అవి మూత పడడం వలన వలసలు పెరుగుతున్నాయి. అందువలన వీటికి ప్రత్యేక సహాయం అందించినట్లయితే ఆ ప్రాంతాల్లో వలసలు తగ్గుతాయి. జూట్ వ్యవసాయ ఆధారిత పరిశ్రమ. దానికి ప్రత్యేక సహాయం అందించాలని కోరుతున్నాను.

అధ్యక్షా, కరవు మీద జరిగే సమీక్షా సమావేశాలు 15 రోజులకు ఒక సారి చేస్తున్నామంటున్నారు. కానీ, ప్రజాప్రతినిధులను ఎక్కడా ఇన్‌వాల్వ్ చేయలేదు. భవిష్యత్తులో అయినా weekly or fortnightly reviews పెట్టి, elected representatives ను పిలిచి proactive role ను ప్లే చేసే దానికి అవసరమైన అవకాశం కల్పించాలని కోరుతున్నాను.

మ. 02.00

MR. CHAIRMAN: Now, the Hon'ble Deputy Chief Minister will give the reply.

శ్రీ నిమ్మకాయల చినరాజప్ప: అధ్యక్షా, ఈ చర్చపై గౌరవ సభ్యులు సర్వశ్రీ సి. రామచంద్రయ్య, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శ్రీమతి పమిడి శమంతకమణి, శ్రీ గాదె శ్రీనివాసులు నాయుడు గారు, శ్రీ జి. తిప్పేస్వామి, శ్రీ పి.జె. చంద్రశేఖర రావు, శ్రీ ఎం.వి.ఎస్. శర్మ గారు మాట్లాడారు. వారు అనేక మంచి సూచనలు, సలహాలు చేశారు. అందుకు నా ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రి అయిన తరువాత కరవును పారద్రోలాలని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, నదుల అనుసంధానం చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నారు. మనకు వర్షపాతం చాలా తక్కువగా ఉన్నది. ఈ సంవత్సరం 4 శాతం లోటు నమోదయింది. గత సంవత్సరం 5.4 శాతం నమోదయింది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని జిల్లాల కలెక్టర్ల నుండి నివేదికలను కోరగా, మూడు

విడతలుగా మొత్తం 301 కరవు మండలాలను ప్రకటించడం జరిగింది. కమిటీ నివేదికలను పరిశీలించిన తరువాత జీవోనెం. 2,9 మరియు 10 ప్రకారం కరవు మండలాలను ప్రకటించడం జరిగింది. శ్రీకాకుళం, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు, విజయనగరం ఈ 8 జిల్లాలలోనూ కలిపి 301 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించడం జరిగింది. తేది 30.12.2016న కేంద్రప్రభుత్వానికి కరవు నివేదికను పంపడం జరిగింది. రాష్ట్ర నిబంధనల ప్రకారం రూ.3,173 కోట్లు, కేంద్ర నిబంధనల ప్రకారం రూ.2,281 కోట్లు సిఫారసు చేస్తూ కేంద్రానికి పంపడం జరిగింది. శ్రీ అమితాబ్ గౌతమ్ నేతృత్వంలో 10 మంది సభ్యులతో కూడిన కేంద్రబృందం కూడా పర్యటన చేసింది. 2017, జనవరి 23 నుండి 25వ తేదీ వరకు క్షేత్రస్థాయి సందర్శనను పూర్తి చేసింది.

కరవు నివారణ చర్యల నిమిత్తం ప్రభుత్వం జిల్లా, డివిజన్ స్థాయిలో ప్రభుత్వం ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి హెల్ప్‌లైన్ నెంబర్లను తెలిపి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతోంది. 10, 15 రోజులకొకసారి కరవు పరిస్థితిపై నివేదికను పంపవలసిందిగా జిల్లా అధికారులకు ఆదేశాలను జారీ చేసింది. కరవుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్‌ల ద్వారా, సమావేశాల ద్వారా సమీక్షించడం జరుగుతోంది. కరవు తీవ్రత ఎక్కువగా ఉన్న 6 జిల్లాలలో ఆరుగురు ఐఎఎస్ అధికారులను ప్రత్యేకంగా నియమించడం జరిగింది. అలాగే ప్రభత్వం వివిధ శాఖల ఆధ్వర్యంలో కరవు పరిస్థితిని తగ్గించేందుకు ఒక కార్యచరణ ప్రణాళికను కూడా సిద్ధం చేసింది. గ్రామీణ నీటి సరఫరా శాఖ త్రాగు నీటి సమస్యను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గాను రూ.132 కోట్లతో తాత్కాలిక ప్రణాళికను రూపొందించడం జరిగింది. కేవలం 730 హాబిటేషన్లకు మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. దీనికోసం రూ.34 కోట్లు విడుదల చేసి జిల్లాలకు ఇవ్వడం జరిగింది. మరొక రూ.38 కోట్లు మళ్లీ విడుదల చేయడమైనది. మొత్తం రూ.73 కోట్లు గ్రామీణ నీటిపారుదల శాఖకు విడుదల చేయడం జరిగింది. అలాగే, గ్రామీణ నీటిసరఫరాలో నలుగురు చీఫ్ ఇంజనీర్లను ప్రత్యేక అధికారులుగా నియమించి ఎక్కడా కూడా మంచినీటికి ఇబ్బంది లేకుండా చూడమని ఆదేశాలివ్వడం జరిగింది.

పట్టణ నీటిసరఫరా గురించి 2016వ సంవత్సరానికి తాత్కాలికంగా రూ. 89 కోట్లను కరవు ప్రభావిత మున్సిపాలిటీలకు ఇవ్వడం జరిగింది. ఇది కాక 66 పట్టణాలలో స్థానిక సంస్థలలో నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి రూ.52 కోట్లకు నివేదికనిచ్చింది. మొత్తం రూ.141 కోట్లతో తాత్కాలిక ప్రణాళిక రూపొందించగా, అత్యవసరంగా రూ.25 కోట్లను రిలీజ్ చేసింది. 28 పట్టణ స్థానిక సంస్థలలో రోజుకు రెండు సార్లు, 60 పట్టణ స్థానిక సంస్థలలో రోజుకు ఒకసారి 21 పట్టణ స్థానిక సంస్థలలో రెండు రోజులకు ఒకసారి గిద్దలూరులో మూడు రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేయడమవుతున్నది.

వ్యవసాయానికి సంబంధించి ఖరీఫ్ కాలంలో కరవు వల్ల 14.7 లక్షలమంది రైతులకు చెందిన 12.73 లక్షల హెక్టార్ల పంట నష్టం జరిగింది. దానివల్ల దాదాపు రూ.1760 కోట్ల నష్టం వాటిల్లింది. వర్షాభావ పరిస్థితిని అధిగమించేందుకు ప్రభుత్వం భూసార సంరక్షణ చర్యలు చేపట్టడం జరిగింది. అలాగే, రెయిన్ గన్స్, స్ప్రింక్లర్లు, వాటర్ క్యారీయింగ్ పైపులను వినియోగించి అనావృష్టి పరిస్థితులను తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నాము. వాటర్ షెడ్స్ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సహజ స్థానీయ భూసార సంరక్షణ పనులను చేపట్టడమవుతున్నది. అలాగే రక్షిత సాగునీటిని సమకూర్చడానికి డీజిల్ పంప్‌సెట్ల సరఫరా నిమిత్తం రూ.14 కోట్లను ఇవ్వడమయింది. సాగు కుంటల లైనింగ్ నిమిత్తం రూ.1430 లక్షలు , వాడకంలో లేని బోరు బావుల చుట్టూ రీఛార్జ్ కట్టడాలను నిర్మించే నిమిత్తం రూ.1380 లక్షలను వినియోగించడమయింది.

2016-17 కాలంలో పిఎంకెఎస్‌వై పథకం క్రింద దాదాపు 15000 మంది రైతులకు లబ్ధిని చేకూర్చుతూ 13140 హెక్టార్లను సాగు పరిధిలోకి తీసుకురావడమయింది. అనంతపురం, కర్నూలు, చిత్తూరు వంటి కరవు ప్రభావిత జిల్లాలలో స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుని భూగర్భ జలాల సామర్థ్యాన్ని పెంచుకోవడం జరుగుతున్నది. రాయలసీమలో నాలుగు జిల్లాలలోను దీర్ఘకాల ప్రయోజనాల కోసం రూ.1100 కోట్ల నిధులను అంతర్జాతీయ సంస్థల సహకారంతో కరవు తగ్గించేందుకు చర్యలు చేపట్టడమయింది. దీనిని 2017-18 ఖరీఫ్ కాలం నుండి ప్రారంభించేందుకు ప్లాన్ చేయడమైనది.

ఉద్యానవన శాఖ ద్వారా రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్ల నిర్వహణ అమలు నిమిత్తం కరవు ఉపశమనం కోసం రూ.103.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. భూమి తేమను కాపాడేందుకు చర్యలు చేపట్టింది. కరవు ప్రభావిత జిల్లాలలో కూరగాయలను, సరసమైన ధరలలో లభ్యమయ్యేలా కూరగాయల విత్తనాలను పంపిణీ చేయాలని చూస్తున్నది.

ముఖ్యంగా కరవు ప్రభావిత జిల్లాలలో రూ.62290.52 లక్షల ఆర్థిక కేటాయింపులతో ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తున్నది. కిచెన్ గార్డెనింగ్ కోసం నీటి వనరులను గరిష్టంగా వినియోగించుకుని 9,65,000 చదరపు మీటర్లలో రూ. 6609.01 లక్షల పెట్టుబడి వ్యయంతో రక్షిత సాగును ప్రోత్సహించడమయింది.

పశుసంవర్థక శాఖ మెరుగైన పశుగ్రాస విత్తన రకాన్ని 75 శాతం సబ్సిడీపై 1,136.00 మెట్రిక్ టన్నులు సరఫరా చేయడమైనది. అదే విధంగా 2,325.00 మెట్రిక్ టన్నుల టిఎంఆర్ పశుగ్రాసాన్ని కూడా పంపిణీ చేయడమైనది. ఏడు వేల మెట్రిక్ టన్నుల సైలేజ్‌ను కూడా కిలో రెండు రూపాయల చొప్పున ఇవ్వడం జరిగింది. వీటి ద్వారా పశువులకు ఉపశమనం కలిగించడమే కాకుండా ఇప్పటివరకూ ఖర్చు చేసిన వ్యయం నిమిత్తం రూ.56 కోట్ల బకాయిలను చెల్లించమని పశు సంవర్థక శాఖ డైరెక్టరు ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. రూ.182.80 కోట్ల మొత్తానికి 2017, జనవరి నుండి మే వరకు గల నెలల కోసం కార్యాచరణ ప్రణాళికను తయారు చేయడమైనది. తక్షణమే 2017, మార్చి కోసం రూ.23.78 కోట్ల మొత్తాన్ని విడుదల చేయవలసిందిగా కోరడమైనది. ఆ అంశం ఆర్థిక శాఖ వద్ద ఉన్నది. దానిని కూడా క్లియర్ చేయించడమవుతుందని గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను. పశువులకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందచేయడమవుతుందని తెలియచేస్తున్నాను.

గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కరవు నివారణ చర్యలు చేపట్టడం జరిగింది. 100 రోజులు పూర్తి చేసిన కుటుంబాలకు ప్రభుత్వం 50 అదనపు పని దినాలను సమకూర్చుతుంది. తద్వారా మొత్తం 6,04,131 కుటుంబాలు లబ్ధిపొందుతాయి. రూ.976.68 కోట్లతో కరవు ప్రత్యేక ప్రణాళికను రూపొందించడం జరిగింది. దీనిలో రూ.586 కోట్లు వేతనాలకు రూ.390 కోట్లు మెటీరియల్ కాంపొనెంట్‌కు ఇవ్వడం జరిగింది. వేసవి వడగాల్పులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక అలవెన్స్, 5 కి.మీ. కంటే ఎక్కువ దూరంలో పని ఉన్నట్లయితే పొందిన వేతనంపై 10 శాతం అదనపు రవాణా భత్యాన్ని చెల్లించడమవుతుంది. కూలీలందరికీ రూ.5/- లు త్రాగునీటి కొరకు సమకూర్చడమయింది. ఉపాధికి సంబంధించిన పనులను ప్రభుత్వం చేపట్టడమైనది.

అధ్యక్షా, ఆంధ్రాబ్యాంకు జనరల్ మేనేజరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సంఘం కన్వీనరు ప్రకృతి వైపరీత్యాలపై ఆర్‌బిఐ జారీ చేసిన ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం 301 కరవు ప్రభావిత మండలాలలో సహాయక చర్యలు చేపట్టేందుకు కరవు ప్రకటిత జిల్లాలలో ఉన్న బ్యాంకు శాఖలకు ఇప్పటికే ఆదేశాలను జారీ చేయడమైనదని సభ్యులకు ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

కేంద్రబృందం పర్యటన అనంతరం మరికొన్ని మండలాలను కరవు మండలాలుగా ప్రకటించమని వినతి రావడంతో కొన్ని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆ మండలాలను కూడా కరవు ప్రాంతాలుగా ప్రకటించడం జరిగింది.

పెద్దలు శ్రీ సి. రామచంద్రయ్య గారు కొన్ని అంశాలను ప్రస్తావించడం జరిగింది. కరవు నివారణ కొరకు ప్రభుత్వం కొన్ని ముందస్తు చర్యలను చేపట్టడం జరిగింది. ప్రత్యేకంగా రాయలసీమకు అనేక చర్యలను చేపట్టడం జరిగింది. ఉపాధి హామీ పథకం క్రింద 100 పనిదినాలను 150 పనిదినాలకు పెంచడం జరిగింది. కేంద్రప్రభుత్వం నుండి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలయిన వెంటనే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాము. అనంతపురం, రాయలసీమ ప్రాంతాలలో వలస కూలీల గురించి చెప్పారు. వలస కూలీలను నిలువరించేందుకు గాను ఉపాధి హామీ పథకం పనిదినాలను పెంచడం, అదే విధంగా ఇచ్చే మొత్తాన్ని కూడా పెంచడం జరిగింది. అనంతపురం జిల్లా కలెక్టరుకు కూడా ఆ మేరకు మేము ఆదేశాలిచ్చాము. ఒకవేళ ఎవరైనా ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి ఉంటే వారిని వెనక్కి రమ్మనమని, పని కల్పిస్తామని, వారికి కావలసిన వసతులు కల్పిస్తామని పేపర్లో ప్రకటన ఇవ్వాలని మేము ఆదేశాలిచ్చాము.

పెద్దలు శ్రీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అనేక సూచనలు, సలహాలు ఇచ్చారు. కరవుమండలాల విషయమై 33 మండలాల విషయంలో నిబంధనలను పూర్తిగా పాటించకపోయినా, కరవు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కరవు మండలాలుగా ప్రకటించడం జరిగింది. ఎండిపోయిన పంట పొలాల వల్ల నష్టపోయిన రైతులకు ఉపాధి కల్పించమని చెప్పడం జరిగింది. పంటకు కనీస మద్దతు ధరను ప్రకటించి ఏపి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది. అలాగే, ప్యాడీ విషయంలో సమస్య వస్తే, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ తీసుకోము అంటే కూడా, రాష్ట్ర ప్రభుత్వమే సివిల్ సప్లైస్ ద్వారా కొనుగోలు చేసే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మనవిచేస్తున్నాను.

అనంతపురం జిల్లాకు సంబంధించి సభ్యురాలు శ్రీమతి పమిడి శమంతకమణి అనేక అంశాలను ప్రస్తావించారు. అలాగే, గౌరవ డిప్యూటీ ఛైర్మన్ గారు కూడా కొన్ని సూచనలు ఇచ్చారు. ఉద్యానవన రైతులకు రూ.380 కోట్లు, లక్షా డెబ్బైవేల మంది రైతులకు రుణమాఫీ వర్తించిందని తెలియచేస్తున్నాను. నీటి వనరుల విషయమై ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నది. రెయిన్‌గన్స్ విషయంలో కూడా ముఖ్యమంత్రిగారు చొరవ తీసుకుని మూడవ పంటను కాపాడాలని ప్రయత్నం చేశారు. దానివల్ల కూడా కొంత ఫలితం దక్కింది. రెయిన్‌గన్స్‌కు, కరవుకు సంబంధం లేదు. అయినా, మూడవ పంటను తాత్కాలికంగానైనా కాపాడాలనే ఉద్దేశంతో రెయిన్‌గన్స్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. భవిష్యత్తులో వాటిని ఏ విధంగా ఉపయోగించాలనే విషయాలపై కూడా మేము ఎప్పటికప్పుడు పరిశీలించి చర్యలు తీసుకోవడం జరిగిందని తెలియచేస్తున్నాను.

మ. 02.10

గౌరవ సభ్యురాలు శ్రీమతి పమిడి శమంతకమణి గారు నదుల అనుసంధానం గురించి ముఖ్యమంత్రి గారు తీసుకున్న చర్యలను గురించి అడగడం జరిగింది. తప్పనిసరిగా నదుల అనుసంధానం చేయాల్సిన అవసరం ఉంది. సభ్యులు శ్రీ పి.జె చంద్రశేఖర రావు గారు కరవు మండలాలను ఎలా నిర్ధారిస్తారని అడిగారు. కరవు మండలాలను కేంద్ర కరవు నియమావళి ప్రకారం నిర్ధారించడం జరిగింది. కరవు నిర్ణయించేటప్పుడు సంబంధిత జిల్లా కలెక్టరు వద్ద నివేదిక తెప్పించుకుంటాము. కరవు కోసం నియమించబడిన కమిటీ ఉంటుంది. ఆ నివేదిక ప్రకారం కరవు మండలాలను నిర్ధారించడం జరుగుతుంది. అలాగే, సాంకేతికంగా కరవు మండలాలను ప్రకటించేటప్పుడు అన్నీ అవగాహన చేసుకున్న తరువాత అన్ని చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుంది.

అలాగే గౌరవ సభ్యులు శ్రీ పి.జె చంద్రశేఖర రావు గారు వలసలు వెళుతున్న కూలీల గురించి చెప్పారు. అన్ని జిల్లాలలో వలస వెళుతున్న కూలీలను తిరిగి రమ్మని పిలుస్తున్నాము, వారికి కావాల్సిన ఉపాధి, వేతనాలు ఇస్తామని కచ్చితంగా చెప్పడం జరుగుతోంది. గౌరవ సభ్యులు కూడా వలసలు వెళ్లిన వారు తిరిగి వచ్చే విధంగా ప్రోత్సహించాలని కోరుతున్నాను. కూలీలకు పని కల్పించే విధంగా అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని మీ ద్వారా తెలియజేస్తున్నాను.

అలాగే, శాశ్వత కరవు నివారణా చర్యలు గురించి కూడా సభ్యులు శ్రీ పి.జె. చంద్రశేఖర రావు గారు అడిగారు. కరవు శాశ్వత నివారణా చర్యల క్రింద నీరు-చెట్టు కార్యక్రమంలో భాగంగా 10 లక్షల నీటి కుంటలు త్రవ్వడం, చెరువులను పునరుద్ధరించడం, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం కోసం ప్రణాళికలు రూపొందించడం జరిగింది. రాయలసీమ ప్రాంతాలలో ఎక్కువగా చెరువులు, నీటి కుంటలు త్రవ్వి నీటిని నిల్వ ఉంచుకుని, దాని ద్వారా నీళ్లు ఇవ్వాలని సంకల్పించడం జరిగింది. చెరువుల్లో నీరుంటేనే రెయిన్‌గన్స్ ద్వారా నీళ్లివ్వడానికి దోహదపడుతుంది. జిల్లాల్లో ఆయా ప్రాంతాల్లో 20, 25 కిలోమీటర్లలోపు ఉన్నటువంటి చెరువుల్లోని నీటిని రెయిన్‌గన్స్ ద్వారా పొలాలకు అందివ్వడం జరుగుతుంది. అంతేగాకుండా, కరవును ఎదుర్కొనేందుకు ఒక పథకాన్ని కూడా రూపొందించాము. 5 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.1100 కోట్లు కరవు జిల్లాల కోసం ఖర్చు పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేస్తున్నాను. నీటి కొరతను శాశ్వతంగా నివారించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేస్తున్నాను. ఉపాధి హామీ పథకంలో రోజుకు ఒక కూలీకి రూ.142/-వస్తుంది. అలాగే, వేసవి భృతి క్రింద ఎండాకాలంలో నాలుగైదు నెలలు రూ.20/-, రూ.30/- పెంచి ఇవ్వడం జరుగుతుంది. తప్పకుండా రూ.142/- వస్తుంది.

అలాగే, గౌరవ సభ్యులు శ్రీ జి. తిప్పేస్వామి గారు కూడా సెరీకల్చర్ గురించి, ఇంకా అనేక విషయాలు చెప్పారు. అనంతపురంలో ఉన్న సమస్యలను కూడా చెప్పడం జరిగింది. అక్కడున్న సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి గారు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలియజేస్తున్నాను.

అలాగే గౌరవ సభ్యులు శ్రీ గాదె శ్రీనివాసుల నాయుడు గారు కూడా కొన్ని విషయాలు చెప్పారు. త్రాగునీటి విషయంలో, గ్రామీణ ప్రాంతాలలో ఇంజనీర్లు తక్కువ ఉన్నా, వ్యవసాయాధికారులు తక్కువున్నా రిక్రూట్ చేసి, వ్యవసాయానికి సంబంధించి ఎంతైతే అవకాశం ఉందో రైతాంగానికి ఎంత ఉపకారం చేయగలమో అంత చేసి, రైతాంగాన్ని అభివృద్ధి చేసి, ప్రతీ గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించేందుకు పైప్‌లైన్స్ ఏర్పాటు చేసే విషయంలో, మంచినీటిని సరఫరా చేసే విషయంలో ప్రభుత్వం సంకల్పంతో పనిచేస్తోందని తెలియజేస్తున్నాను. అన్ని శాఖల సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకుంటున్నామని సభ్యులు శ్రీనివాసులు నాయుడు గారికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, కరవు ఇప్పటిది కాదు, అది మనకు వారసత్వంగా వస్తోంది. దానిని నివారించేందుకు ముఖ్యమంత్రి గారు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. నదుల అనుసంధానం చేసి, ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలనే సంకల్పంతో పని చేయడమే కాక, కరవు గురించి ప్రతీ నెలా కేబినెట్‌లో ముఖ్యమంత్రి గారు డిపార్టుమెంట్‌లతో రివ్యూ చేస్తున్నారు. ఎక్కడ ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించేందుకు అవసరమైన నిధులు ఇస్తామని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. మంచినీటి విషయంలో, ఇతర అంశాలలో ప్రజలు ఇబ్బందులు పడకూడదని అందుకు ఎంత ఖర్చయినా ప్రభుత్వం భరిస్తుందని ముఖ్యమంత్రిగారు జిల్లా కలెక్టర్‌లకు ఆదేశాలు ఇచ్చారు. కరవు నివారణకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలియజేసుకుంటూ, గౌరవ సభ్యులు ఇచ్చిన సూచనలు, సలహాలు ప్రభుత్వం తీసుకుని, అన్ని చర్యలు తీసుకుంటామని మీద్వారా తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

MR. CHAIRMAN: (Addressing Smt. Kimidi Mrunalini, Minister for Rural Development) tomorrow we will take-up short discussion on Social Security Schemes. Now, the House is adjourned to meet again tomorrow at 10.00 a.m.

(Then, the House was adjourned at 2.13 p.m. to meet again on Friday, the 24th March, 2017at 10.00 a.m.)

* * *